పునర్ముద్రిత లఘు గ్రంథాలు

ప్రపంచ తెలుగు మహాసభలు

27 - 29, డిసెంబరు, 2012

తెలుగు శాసనాలు

రచన

జి. పరబ్రహ్మశాస్త్రి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

పునర్ముద్రిత లఘు గ్రంథాలు

తెలుగు శాసనాలు

జి. పరబ్రహ్మశాస్త్రి

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం
హైదరాబాద్

తెలుగు శాసనాలు

రచయిత : జి. పరబ్రహ్మశాస్త్రి

ISBN : **81-86073-321-3**

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రచురణల సంఖ్య: 458

వెల : **రూ. 20/-**

ప్రతుల సంఖ్య : **5000**

ప్రథమ ముద్రణ : **ఏప్రిల్, 1975**

ముద్రణ : **డిసెంబరు, 2012**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

ముద్రణ : **చరిత ఇంప్రెషన్స్**, అజామాబాద్, హైదరాబాదు

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్

నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)

ముఖ్యమంత్రి

V. VASANT KUMAR, B.Sc. (Ag.), M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే "ప్రపంచ తెలుగు మహాసభల" నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

వ. వసంతకుమార్

(వట్టి వసంతకుమార్)

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వవిద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వవిద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో 1975 నాటి మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముద్రించిన శ్రీ జి. పరబ్రహ్మశాస్త్రి గారి "తెలుగు శాసనాలు" అనే గ్రంథాన్ని పునర్ముద్రిస్తున్నాం. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న ఆచార్య సి. మృణాళిని గారికి, ఆచార్య డి. మునిరత్నం నాయకుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

విషయసూచిక

		పేజి నెం.
1.	తెలుగులిపి భాషల మొదలు	1
2.	ధనంజయుని కలమళ్ళ శాసనము	15
3.	ఎఱ్ఱనగుడిపాడు శాసనము	17
4.	పుణ్యకుమారుని తిప్పలూరి శాసనము	21
5.	సత్యాదిత్య చోళుని మాలెపాడు శాసనము	24
6.	అరకటవేముల శాసనము	29
7.	వేల్పుచెర్ల శాసనము	32
8.	గణ్డత్రిణేత్ర వైదుంబ మహారాజు-వన్దాడి శాసనము	38
9.	కొండపత్తి శాసనము	42
10.	కొరవి శాసనము	46
11.	కొన్ని పద్యశాసనాలు	68
12.	పణ్డరంగుని అద్దంకి శాసనము	70
13.	యుద్ధమల్లుని బెజవాడ శాసనము	72
14.	జినవల్లభుని కుర్క్యాల శాసనము	75
15.	బణపతి దీర్ఘాసి శాసనము	76
16.	గూడూరు శాసనము	78
17.	ఉప్పరపల్లి శాసనము	86
18.	పిరంగిపురము శాసనములోని తెలుగు పద్యములు	92
19.	చిడిపిరాళ్ళ శాసనము	94
20.	ముగింపు	96

తెలుగు లిపి భాషల మొదలు

నాగరికత పెరిగిన కొలది మానవుడు తన జీవితమును వైజ్ఞానికముగను, నైతికముగను మెఱుగుపఱచుచు ఆ విధానములను తరతరముల సంరక్షించుట తన కర్తవ్యముగ భావించెను. ఆ ప్రయత్నములోనిదే లేఖన విద్య భారతదేశమునందీ విద్య యిప్పటికి ఐదు వేల సంవత్సరములకు పూర్వము నాటిదనబడు సింధు నాగరికత నాటికే యొక సువ్యక్తమగు రూపము దాల్చియున్నట్లు తెలియుచున్నది. కాని యింతవరకు ఆ లిపి సరిగా సరిగా చదవబడలేదనియే చెప్పవలెను. తరువాత చెప్పదగిన భారతీయ లిపి క్రీస్తు పూర్వము మూడవ శతాబ్ది నాటిదగు మౌర్యలిపి. అంతకుపూర్వమే వేదములు. వేదాంగములు, ఇంకా యెన్నో సూత్ర గ్రంథములు వెలసియుండుటను బట్టి యేదో విధమగు వ్రాత యుండెడిదని స్పష్టమగుచున్నది. అంతేకాదు. మౌర్య లిపి యనబడు అశోక శాసనములందున్న అక్షరములకన్న వేదసూత్ర వాఙ్మయ మందున్న అక్షర సంపుటి విశిష్టమైనదగుటచే దీనికి చెందిన లిపి అశోక లిపి కంటె విశిష్టమైనదని యెంచవలసి యున్నది కాని వేద, సూత్ర వాఙ్మయములందు కానవచ్చు అక్షరములు, వాటి ఉచ్చారణ విశేషములు అన్నియు గురు శిష్యపరంపరగా వల్లెవేయబడుచు సంరక్షించబడినవేగాని వ్రాతతో గూడిన గ్రంథముల ద్వారా కాదని కొందరు చెప్పుదురు. అంతేగాక అశోకుని నాటి లిపి అతిసరళముగను సుగ్రాహ్యముగను ఉండును. ఉదా: గ=అ, =ఇ; c =ఉ; + =క 1=ర; మొదలగునవి. ఇట్టి ప్రాథమిక దశనుండియే భారతీయ లిపులన్నియు అనేక ప్రాంతీయ మార్పులనొందుచు నేటి రూపములను పొందినవని లిపి పరిశోధకులు భావించెదరు. ఏది యెట్లున్నను సింధు నాగరికత నాటి లిపిని అశోకుని మౌర్యలిపితో కలుపు రూపాంతరమును తెలుపు ఆధారము లేవియు ప్రస్తుతము లేవు. కనుక మౌర్య లిపియే మన తెలుగక్షరములకు కూడ మాతృకమయ్యెను.

కుబిరకుని భట్టిప్రోలు శాసనము, ఎఱ్ఱగుడి (జొన్నగిరి) గుట్టమీది అశోకుని శాసనములు ఆంధ్రదేశమునందలి మొదటి వ్రాతలుగ చెప్పబడుచున్నవి. ఆ లిపిని బ్రాహ్మీలిపి యనియు అందలి భాష ఒక విధమగు ప్రాకృతమనియు చరిత్రకారులు

చెప్పుదురు. అప్పటినుండి అనేక పరిణామములు చెందుచు శాతవాహన శకము దాటి ఇక్ష్వాకు, శాలంకాయన, బృహత్ఫలాయన, విష్ణుకుండిన, మాఠర వంశ్యుల రాజ్యకాలముల నధిగమించునప్పటికి అనగా క్రీస్తు తర్వాత 500 ప్రాంతము నాటికి అంతవరకు చెల్లుచున్న ప్రాకృత, ద్రావిడ భాషల నుండి విడివడి తెలుగుభాష యొక రూపునొందెను. ఇంకను ఒక శతాబ్ది గడచిన కాని శాసన భాషగ తయారు కాలేదన వచ్చును. అంటే అంతకుముందు తెలుగుభాష యేమాత్రమూ లేదనికాదు; ఉన్నది. కాని 'నాగబు', 'సంవత్సరంబుళ్' కొన్ని ఊళ్ళ పేర్లు మొదలగునవి. అచ్చటచ్చట శాసనములలోను, పొట్ట, అత్త, కరణి వంటి పదములు హాలుని గాథాసప్తశతి లోను కానవచ్చుటయేగాని, వాక్యరూపములో భాష కనిపించుటలేదు. తెలుగు భాష వాడుక యందుండి యున్నచో కొన్ని తప్పులతో గూడిన పద సముదాయములు శాసనములందు లభించెడివియే. అప్పటి రాజుల భాష ప్రాకృతము గనుక అప్పటి శాసనములన్నియు ప్రాకృతమునందే యున్నవనువాదమంత బాగులేదు. సామాన్య జనులు వ్రాయించిన చిన్న వాక్యముల శాసనములనేకములు అమరావతిలోను నాగార్జునకొండ దగ్గర, మరికొన్ని చోట్ల దొరికినవి. అవి కూడా ప్రాకృతమునందే యున్నవి. కనుక తెనుగప్పటికి జన సామాన్యమునందు కూడ ధారాళముగ మాట్లాడబడుచుండెనను కొనుటకు ఆధారము లేవియు లేవు. కాని అనేక దేశ్య పదములు వాడుకలోనున్న మాట నిజము. వారు మాట్లాడు వాక్యము లెట్లుండునో చెప్పుట కష్టము. మనకు తెలుగు వాక్యములు గల మొదటి శాసనములు కొన్ని కడప మండలములో కనిపించును. అవి ఆరవ శతాబ్దమునుండి వ్రాయబడినట్లు తెలియుచున్నది. అప్పటికి దేశములో వాడుక యందున్న బ్రాహ్మీ లిపినే కొలది మార్పులతో తెలుగువారు కన్నడమువారు వాడుకొనిరి. అందుచే దీనిని తెలుగు-కన్నడ లిపియని పరిశోధకులు చెప్పుదురు. కన్నడ లిపి నుండి తెలుగులిపి కాకతీయుల నాటి నుండి అనగ పన్నెండవ శతాబ్ది నుండి వేఱుపడెను. అయినను ఈ రెండు లిపుల పోలిక మిక్కిలి సన్నిహితముగ నుండును.

తెలుగక్కరములు:

మున్ముందు వ్రాయబడిన తెలుగు శాసనములలో కడప మండలము కమలాపురం తాలూకాలోని కలమల్ల శాసనము మనకు లబించెడి వాటిలో మొదటిగా భావింపబడుచున్నది. ఇయ్యది క్రీ. ఆరవ శతాబ్దికి చెందినట్లు కనబడును. కన్నడ

మందప్పటికొక శతాబ్దికి పూర్వమే శాసనములు ప్రారంభమగుట గమనించదగిన విషయము. కనుక దక్షిణ భారతమున సంస్కృత-ప్రాకృత-ద్రావిడ సమ్మిశ్రమమునుండి వెలువడిన ప్రాంతీయ భాషలలో కన్నడము కంటె తెలుగు అర్వాచీనమై యున్నది. అప్పటి శాసనములను పరిశీలించుచో తెలుగు భాషలో గల అక్షర విశేషములు, పదవిశేషములు, వాక్య రచనా విధానము, సంధి, సమాస, కారక, విభక్తి మున్నగు వ్యాకరణాంశములే కాక ఉచ్చారణ సౌలభ్యమునకైన యితర మార్పులు అనేకము గోచరించును అందు అక్షరములను గూర్చి తెలిసికొందము.

అచ్చులలో అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఒ అను నెనిమిది మాత్రమే గానవచ్చును. 'ఐ'కి బదులు అయి 'ఔ'కి బదులు అవు, అగు అనునవి వాడబడు చుండెను. శకము 898 నాటి, అనిమల శాసనములో 'ఐన' అని ఐ వాడబడెను. 'ఔ' అక్షరము యొక్క ఉపయోగము కనిపించదు. హల్లులలో వర్గాక్షరములందల్ప ప్రాణములు, అనునాసికములగు ఙ, ఞ, ణ, న, మ, లు విశేషముగ గానవచ్చును. య, ర, ల, వ, శ, స, హ, ళ. వర్ణములు వాడుకయందుండెను. కాగా ముఖ్యముగ గమనించవలసిన యక్షరములు మరికొన్ని ఆనాటి తెలుగులో కానవచ్చును. అందు శకట రేఫము ఒకటి. ఇది ఇప్పటి వరకు వాడబడుచున్నను ప్రస్తుతము దాని ఉపయోగము తగ్గిపోవుచున్నది. సుమారు క్రీస్తు పదవ శతాబ్ద్యంతము వరకు అనగా నన్నయ భట్టారకుడు గ్రాంథిక భాషను శాసించువరకు శాసనములందు 'ఱ' అను రూపమున వ్రాయబడు అక్షరముండెడిది. ఇది బండి 'ఱ' లోని అడ్డు గీటును తొలగించి వ్రాసినట్లు శాసనములందు కనుపించును. దీనిని గూర్చి కీర్తిశేషులు జయంతి రామయ్య పంతులుగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు మున్నగు పలువురు పరిశోధనలు జరిపి అది మనకిప్పుడు వాడుకలో లేని వేరొక అక్షరమని నిర్ధారణము గావించిరి. అది క్రమముగా కొన్నిచోట్ల 'డ'గాను, కొన్నిచోట్ల 'ళ'గాను, మరికొన్నిచోట్ల 'ద'గాను మార్పునొంది అదృశ్యమైనట్లు చెప్పిరి ఈ సందర్భమున వారి అభిప్రాయ భేదములెట్లున్నను ఈ యక్షరమొకటి పూర్వము తెలుగు భాషలో గలదని నిశ్చయముగ శాసనములను బట్టి తెలియుచున్నది. అది 'చోఱ' పదములలో 'చోడ' లేక 'చోళ' అనియు; 'నోఱంబ' పదములో 'నోళంబ' అనియు, ఔందులూరు అనుచోట దెందులూరు గాను, క్ఱిన్ద అనునది క్రిన్ద (క్రింద)గాను 'క్ఱాచె' అనుపదము

'క్రొచ్చె'; 'వ్టచె' అనునది 'వ్రచ్చె' అనియు మార్పునొందెను. ఈ యక్షరము కన్నడములో కూడ చాల కాలముండినట్లు నిఘంటువు లందిదిగల పదములనేకములు చేర్చబడి యుండుట వలన తెలియుచున్నది. తమిళమునందిది 'వాళైప్పళం' (=అరటిపండు) వంటి పదములలో వాడబడుచున్నదని కొందరు భావించెదరు. తెలుగు శాసనములలో చోఱ అని వ్రాయబడిన కాలమునకు చెందిన పుణ్యకుమారుని దొమ్మర సన్న్వాల తామ్ర పట్టిక సంస్కృత శాసనములో 'చోళ మహారాజః చోళ కేరళానామధిపతిః' అని 'ళ' కారము వ్రాయబడింది.[1] కనుక 'ఱ' అనేది తెలుగు భాషకి చెందిన అక్షరమే; సంస్కృతములో 'ళ' గనో 'డ'గనో మారుచుండెడిది.

ఇంకొక యక్షరము θ లేక ద* ఇది దంత్య 'థ' కారముగాదు. పై జెప్పిన 'ఱ' కంటె రెండు మూడు శతాబ్దులు పూర్వమే యిది శాసనములందు సైతము ఉపయోగమునుండి తొలగెను. నన్నయభట్టు నాటికే యిది భాషలో లేదు. సంయుక్తాక్షరములలో 'న' 'ణ'తో కలసి యుండెడిది. న, ణా, మూను: చాణా ద్లాకు, చదు (మూడు చాణ్డాలురకు, చెడు) మున్నగు పదములలో కాననగును. కలమళ్ళ శాసనములో 'ధనంజయుదు రేనాణ్డు, ఏళన్ చిఱుంబూరి రేవణకాలు...' అని దు, ఱులు రెండు వ్రాయబడి యుండుటను బట్టిθ, ఱలు భిన్నాక్షరములనవలెను అట్లే రామేశ్వరము (ప్రొద్దుటూరు) శాసనమొకదానిలో ఱ, ఱ,θ,డ, ళ, లు స్పష్టముగా వ్రాయబడి యున్నవి గనుక నవి యన్నియు భిన్నాక్షరములే యగును. పై జెప్పిన 'ధనంజయుదు' అను పదములోని దు క్రమముగా ను. ణ్డు, ండు, ౦డు, డు, అనే ప్రథమావిభక్తి ప్రత్యయమైనది అట్లే వాను అనేది, వాణ్డు, వాండు, వా౦డు, వాడు అని ఏక వచనంలో మార్పు చెందింది. తమిళములోని 'అవన్' అనే యేకవచనము. 'అవర్' అనే బహువచనము తెలుగులో 'వాను'-'వాణ్డు', 'వాడు' అనే యేకవచన రూపములు 'వాణ్డ్రు, వారు' అనే బహువచన రూపములు పొందినట్లు చెప్పినను, కలమళ్ళ శాసనములోని 'ధనంజయుదు' అనేది 'ధనంజయురు' అని బహువచన

---

1. E.I.XVII P. 274 II.7-8

* తెలుగు లిపిలో ఇపుడు కనబడని ఈ అక్షరము. ఇకముందు. అకారము తప్ప తక్కిన అచ్చులు కలపవలసివచ్చినపుడు ద అని ముద్రింపబడ గలదు; అటులకాక అకారాంత అక్షరముగ వచ్చినపుడును సంయుక్తమున వత్తుగ వచ్చినపుడును అని ముద్రింపబడగలదు. పాఠకులు దీనిని గమనింపవలెను.

రూపమో లేక 'దనంజయుదు' అని ఏకవచన రూపమో తెలియదు. ఉరుటూరు శాసనములో 'చోఱ మహారాజు θ్లు, ఏళ' అనే ప్రయోగం బహువచనంగా తోస్తుంది. రామేశ్వర శాసనములో 'చదు' (చెడు); అని యేక వచనాంతమునే తెలుపుచున్నది. అరకట వేముల (ప్రొద్దుటూరు తాలూక) శాసనములో వేంగుళూద్లు, పెన్ర్థుకాలు, నారకోళు, కంచద్లు ఇన్నల్వురు సాక్షి అని యున్నది. ఇందు పెన్రుకాలు, అనే పదంలో క్రాడికూడ కనిపిస్తోంది కనుక ఈ θ ను ఱ అనటం బాగులేదు. ఇది వేరక్షరమే. పై జెప్పిన రామేశ్వర శాసనమందే చదుగట్టున్, చθగట్టున్ అను రెండు ప్రయోగములు గలవు. వీటికి 'చెడు తగులును' అను నర్థము చెప్పవలెను. కనుక 'θ' అనేది 'ద'గా మారింది. అంతేకాదు చెఱచు, చెఱ అనే నేటి పదములలోని 'ఱ'పై 'చθ' లోని 'θ' అగునా అని తోచుచున్నది. అందే చాణ్θాద్లాకు (చాండాలః) అను సంస్కృత తత్సమ పదము కలదు. 'చండాలురకు' అని దీని అర్థం చెప్పవలెను. అదే శాసనంలో 'కొణ్డయ్య' అనే పదంలో 'ణ్డ' అనే మూర్ధన్య సంయుక్తాక్షరం వాడబడింది. కాని దానిలోనే 'మూను (మూణ్డు) దంత్య సంయుక్తాక్షరం కనిపిస్తోంది. తమిళ అవన్ నుండి వాన్, 'వాన్డు' అయినట్లుగాక 'మూను' అను తమిళ పదమే మొదటి వాడుకలో నున్నది, తరువాత 'వాణ్డు' వలె 'మూణ్డు' అయింది.

'⊕' రూపములో మరొక అక్షరము ప్రాచీన తెలుగు శాసనాల్లో కనిపిస్తుంది. ఇది శకట రేఫమోలేక వేరక్షరమో ఇంకా నిర్ణయం కాలేదు. ఒకే శాసనములో ⊕ ఱ ఱ ⊕ అను నాలుగక్షరములు కనిపించును. ఇందు మొదటి రెండు 'ఱ' యగునేమో. ఇంతవఱకు చెప్పినవిగాక సంస్కృత సంబంధము వలన మిగిలిన అక్షరములతో గూడిన నేటి తెలుగు వర్ణమాల యేర్పడెను.

సంయుక్తాక్షరములలో వర్గానునాసికములు వాడుటయందు తరువాతి కాలమందెక్కువ నియమము కనుపించును. ప్రాచీన కాలమున అట్టి వాడుక ఉన్నట్లు అంతగా తోచదు. రాజ్యం చేయ, ధనంజయు, రాచమానంబున, ఫలంబు, అశ్వమేధంబు, చిఱుంబూరు, కొట్టంబు, భుజంగ, వంగనూర్లి మున్నగునవి అనుస్వారమునే కలిగియున్నవి. 'న్' స్థానములో అనుస్వార రూపములు అంతగా అప్పుడు కనిపించవు. (వసన్తిపోరి, సామన్తకముళ్ వాను, పాతకున్థు మున్నగునవి) అట్లే 'ణ' కూడ. వాణ్డు, కొణ్డయ, రెణ్డు, రేనాణ్డు, ఇత్యాది రూపములే కాని అనుస్వార

యుక్త రూపములరుదు. మిగతా అనునాసికములకు బదులు సున్నలు బహుళముగా వాడబడచునే యున్నవి.

ఈ సున్న యొక్క రూపము ప్రాచీన బ్రాహ్మీలిపిలోను, మన తెలుగు లిపిలోను ఒక చుక్క (●)గా పరమందున్న అక్షరముపైన గుర్తించబడెడిది. అనునాసికము వాడుచో పరమందున్న అక్షరమునకు పైన వ్రాయుదుము గనుక దాని స్థానములో చుక్కను వాడినను అట్లే పరమందున్న అక్షరముపైన నుంచెడివారు. (ధనఞ్జయుదు = ధనజయుదు; రాచమానమ్బున = రాచమానబున దేగులబు, వళ, భుజగ, వేగు, వగనూరు, ఫలబు) కొంతకాలమునకు ఆ చుక్కయే చిన్న సున్నగా అక్షరము పై భాగముననే వ్రాయబడెడిది. ఇది సాధారణముగ చాళుక్యుల లిపిలో కాన్పించును. క్రీ.శ. 1124 నాటి గూడూరు శాసనమునందు కూడ నిట్లే యున్నది. ఇంక తెలుగులిపి ప్రత్యేకత నొందిన తర్వాత అక్షరము తర్వాత, అదే పంక్తిలో నిప్పటివలె సున్న పెట్టుట ఆచారమైనది. దీనికి కూడ కొంత చరిత్ర కలదు. ప్రాచీనలిపిలో 'మ'కారము హల్మాత్రమే వ్రాయబడినచో 'ర' వ్రాసెడివారు. అంటే మ్=ర. ఇదే కాకతీయుల నాటికి పూర్వమే పై నున్న పొల్లు లేకుండ '0'గా మారింది. మ్=ర=0 ఇటువంటిది అయిందన్నమాట. కన్నడలిపిలో కూడ నిదేవిధముగా మారింది. క్రీ. 1100 ప్రాంతపు కందూరు చోళుల వొల్లాల శాసనములో సున్నకు బదులు 'ర' వాడుట కలదు. ఇట్లే మరికొన్ని శాసనములందును దీని వాడుక కలదు. ప్రాకృత భాషా సంపర్కము తగ్గి సంస్కృత భాషా ప్రభావమెక్కువైన కొలది అనుస్వారమునకు బదులు వర్గానునాసికములను వాడుట యెక్కువైనట్లు కనిపించును.

ఉదా: దఙ్కులపూణ్డి, సమరసఙ్ఘట్టణ, సమాలిఙ్గిత, పఞ్చమహాపాతక, రాజ్యఙ్చేయ, ప్రసాదఞ్చేసె, కుఞ్చెణ్డు, వసన్తేశ్వరము, వన్దిత, వసున్ధరాం, నేణ్టి, వైదుమ్బ, సమ్పన్నుణ్డు, మొదు||.

ఉచ్చారణమునకు తగినట్లు వ్రాయుట చేత కాకపోవుట నేడు కూడ మనకు తెలుసు. భాషాంతరపదాలు వాడునపుడు మరీ కష్టము. (Bank)ను బంకు, బాంకు, బ్యాంకు, బేంకు అని వ్రాయుచుందుము. కొరవి శాసనంలో చాయంబడిన అనే పదమిట్టిదే. పొడిచిన అనుటకు పొడిచ్చిన, ఆదాయంబు అనుటకు అదెయమ్బు వ్రాయుట, ఇవి అన్ని ఉచ్చారణ దోషములో వ్రాయుటలో తప్పులో చెప్పలేము రెండు

ఆనాడట్లే ఉన్నవి.

కొన్ని విలక్షణోచ్చారణములు గల పదములు:

శ్రీయ్తెయరికొడుకు మరమ	=	శ్రీ అయితయారికొడుకు మారమ కావచ్చును. (ముద్దనూరు శా.)
నూట్టామ్బది	=	నూటయేమ్బది
అదెయమ్బు	=	ఆదాయమ్బు
కాడ్లిబ్ర్వేంగు	=	కాడ్లవేగు(?)
సఋత్తుదిగున్	=	సంయుక్తుణ్డగున్.

సంధి విశేషములు

1. పదరూపము ఏకాదేశమగుట

వీరన్టు + అయ్య = వీరున్టయ్య... రాగిమడవనపల్లి శాసనము

ఉత్తమున్టు + అయిన = ఉత్తమున్ణయిన.... తిప్పలూరు

సిద్దవటంబు + ఆడుచు = సిద్ధవటంబాడుచు... రామాపుర శాసనము

రేనాణ్డు+ ఏళుచు = రేనాణ్డేళుచు... రామేశ్వరము

రాజులు+ఏళన్ = రాజులేళన్... చిల్మకూరు

వసన్తీశ్వరంబునాకు + ఇచ్చినది = వసన్తీశ్వరంబు నాకిచ్చినది... రామేశ్వరము.

కాని దీనికి విరుద్ధముగ పూర్వరూపమే యేకాదేశమయినట్లు రెండు చోట్ల గలవు.

సంయుక్తున్ఱు + అగు = సంయుకున్ఱగు.. (ఇన్దుకూరు శాసనము)

మహాపాతకున్ఱు + గు = మహాపాతకున్ఱగు... (వెల్దుర్తి శాసనము)

ఈ రెండు లేఖకదోషములేమోనని సంధియము కలుగచున్నది.

2. యదాగమసంధి:

దీని+ఆదాయమ్బు = దీని యాదాయమ్బ... (బలపనూరు)

ఇరవది+ఆది = ఇరవదియాది... (ఎఱ్ఱగుడిపాడు)

స్తితి+ఉ = స్తితియు

3. సరళాదేశ-గసడదవాదేశసంధి:

మూణ్డు+పుట్లు = మూణ్డువుట్లు.... (బలపనూరు)

చదు+కట్టున్ = చదుగట్టున్ ... (రామేశ్వరము)

ఫలంబ+కాన్చున్=ఫలంబుగాన్చున్.... " "

పరబలంబు+పొడిచి = పరబలంబు బొడిచి... రాగిమడవనపల్లి

ఈస్థితిం+తప్పువారు = ఈ స్థితిదప్పువారు...(కొరవి)

వేయి+చెఱువులు = వేసెఱువులు (మాలెపాడు)

4. ఇతర సంధులు:

మూణ్డు+నూఱు= మున్నూఱు

మూణ్డు+తూము = ముత్తుమ్ము

ఇను+మారు=ఇమ్మారు; ఇమ్మడి

ఈ+మూణ్డు= ఇమ్మూణ్డు... రామేశ్వరము

ఈ+నల్వురు= ఇన్నల్వురు ఆరకటవేముల

పెద్ద + తెరువు = పెందెరువు

పెద్ద+ చెఱువు=పెంజెఱువు

ప్రాచీన శాసనములలో సంధిని వివక్ష చేయకపోవుటయే తరచు కనుపించును. రేనాణ్డు ఏళన్, సాక్షికను ఇచ్చిన; శ్రీధరయకు ఇచ్చిన నేల; పటుకాను;

సమాసములు:

ఆయా రాజులు వారి ప్రశస్తులలో ప్రసిద్ధమైయున్న సంస్కృత సమాసాలనే అధికముగా వాడుకొనెడువారు. సమరసఙ్ఘట్టణోపలబ్ధ జయలక్ష్మీ సమాలింగిత వక్షస్థల అని వైదుమ్బులు, జగత్త్రయాభివన్దిత సురాసురాధీశ పరమేశ్వర ప్రతీహారీకృత మహాబలికులోద్భవ' అని బాణరాజులు చెప్పుకొనేవారు. కాని రేనాటి చోళులు మొదట్లో ప్రశస్తులే చెప్పుకోలేదు. 'స్వస్తిశ్రీ చోడమహారాజుల్లేళన్', 'ఎరికల్ముతురాజు ధనంజయుదు రేనాణ్డు ఏళన్' అంటూ ప్రారంభం చేసి శాసన విషయము చెప్పేవారు. తర్వాత 'పృథివీ వల్లభ విజయాదిత్య చోడమహారాజుళ్' అని పృథివీవల్లభ అని మాత్రమే చేర్చుకొన్నారు. కాని కొంతకాలం తర్వాత అంటే తొమ్మిదో శతాబ్దిలో వీరు 'చరణసరోరుహవిహిత విలోచన త్రిలోచన ప్రముఖాఖిల, పృథ్వీశ్వర కారితకావేరీతీర, కరికాల కులరత్న ప్రదీప, అహితాంకుళ' అనే ప్రశస్తిని మొదలుపెట్టిరి. కాని మొదటి రేనాటి చోళులు, ఈ ప్రశస్తిని చెప్పుకొనే అర్వాచీనచోళులు ఒకే కుటుంబంలోని వారో కాదో యింకా స్పష్టముగా తెలియదు. 6,7,8, శతాబ్దాల్లోని ప్రాచీన చోళ

శాసనములు అతి క్లుప్తంగాను, చిన్న చిన్న తెలుగు పదాలో సంస్కృత-ప్రాకృత తద్భవాలో కలిగియుండెడివి. గ్రామనామములు, ఏవైన బిరుదులు కొన్ని, రెండు మూడు పదముల సమాసములుగా నుండెడివి. తాణ్ణికొణ్డ, తాడ్లతేవ, చిఱుంబ్రోలు, తర్కపుప్రోలు, ఊరిస్వాముళ్, మార్పిదుగు, విడెల్విదుగు పెందెరువు, ముచ్చింతల, మున్నూఱు, వేవాన్ఱు, పెట్నిధి, ఇన్నల్వూరు, పొలగరుసు, రట్టుగుళ్ళు, రాచమానంబు, వీరున్టయ్య.

సంస్కృత సమాసాలు యథాతథంగా వాడుకొనేవారు.

చరువశర్మ పుత్ర విన్నశర్మళాకు
పెర్బాణవంశ భుజంగది భూపాదిత్యులు. — అరకట వేముల శాసనము

కౌణ్డిల్య గోత్రస్య పెన్బాఱ రేవ శర్మాణ పుత్రస్య అగ్గిశమ్మారికిచ్చిన దత్తి (చామలూరు శాసనము). అంటే వారికెట్లా వస్తే అట్లా వ్రాసేవారు. ఇట్లాంటి సమాసాలను నన్నయగారు క్రమబద్ధం చేయటం తెలుగుతనానికి అపకారమో ఉపకారామో మరి?

పదజాలము:

ద్రవిడ, కర్ణాట, ప్రాకృత భాషల నుండి అనేక పదములు తెలుగులో ప్రవేశించినవి. సంస్కృతమునుండి తత్సమములు తద్భవములనేకములు చేరుచున్నవి. కాని వాటినైన సరియగు విభక్తి ప్రత్యయములు చేర్చుకొని బహుళముగా వాడుకొనుట వారికింకా తెలియదు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, షష్ఠి, సప్తమీ విభక్తుల ప్రత్యయములే పరిమితముగా వాడబడెడివి. అవి కూడ మనకిపుడు ప్రసిద్ధముగానున్న (కారక) అర్థములలో వాడబడెడివికాదు. సమాపక క్రియలకు బదులు క్రియాజన్య విశేషణములే అధికముగా వాడబడెడివి. ఇచ్చిన పన్నస, వ్రచ్చినవారు, నిల్పిన శిల, వధిసిన వన్తు.

6,7,8 శతాబ్దములలో తెలుగు శాసనములందువచ్చు కొన్ని పదములు.

కొను=తీసుకొను / పట్టుకొను → కఞ్చిగొణిన=కంచిని పట్టుకొనిన
రామాపుర శాసనము C. 700 AD.

ఏణ్డు = సంవత్సరము

నాణ్డు = దేశము (ప్రాంతము); నేడు (కాలము)

పాఱ = బ్రాహ్మణుడు

పాఱున్ = పోవును... (రామేశ్వరశా.)	
తేనికి, దేనికి = దీనికి	
వేసెఱువుళు = వేయిచెఱువులు	
మగను = వీరుడు, భటుడు	రాగిమడవనపల్లి
పసర(ము) = పశువు?	"
వెళియ = వెడలగొట్ట?	"
పొడిచి పడియె = పోట్లాడి చనిపోయె	
పుట్లు = (కొలత)	
తుమ్బు = (తూము)...	బలపనూరు
ప్రళు = ప్రాలు = బియ్యము	
కుంచెడు = (కొలత)	
నెయ = నేయి	
ఉప్పు	
వసులు = ఆవులు	
ముదుణ్డ్లు	ముద్దనూరు
వట్లు = (వడ్ల)	అనిమెల క్రీ. 976
పులయూరి = ?	రామేశ్వరము ఎ.డి. 700
కాన్బు = కను = పొందు	
అచ్బు = దచ్బు = చెఅచు	
చదు=చెడు-చన్గగు (కొఱ్ఱపాడు)	"
క్ఱిన్దన్ = క్రిందన్	"
నిల్పిన = నిలబెట్టిన	"
కొట్టంబు = (కోట?)	ఎఱ్ఱగుడిపాడు
ఇచ్చిన	
ఇరవది	
కంచరి	
కమ్మరి	

పంపు = పంపున (ఆనతిన)... కలమళ్ళ సి. 580

ఏళన్ = ఏలన్

అఱికళా =?

ఏంబది = 50 ఉరుటూరు 70

వక్రంబువచ్చు = అడ్డువచ్చు

కొచ్చియ = (కౌశిక, గోత్ర?)

సమ్మఁరు = శమ్మఁ (ఆర్య)

రట్టగుళ్ళు రామేశ్వర

రట్టకుట్ట వెల్దుర్తి

వక్రపల్కినవారు

పారదాయ = (భరద్వాజగోత్ర?)... తిప్పలూరు 625. ఎ.డి.

మఱున్ఱ పిడుకు = (శత్రువులకు పిడుగువంటివాడు)

పటుకాను = స్థానముగాను : పట్టుగాను

పన్నవీస = పనాశ = పన్నస = దానముచేసిన భూమి తిప్పలూరు 625 ఎ.డి.

పులొంబున = పొలంబున (విప్పఱ్ఱ శాసనంలో కూడ 'పులోంబున' అని కలదు) రామేశ్వరము

రెఞ్జు

తోటళు

ఆణతి = ఆజ్ఞ

మాఱ్పిడగు = శత్రువులకు పిడుగువంటివాడు

వేపురు

పరియారువు = పరిహారముగ నల్లచెరువుపల్లె

తేవుళ్ = దేవులు

కొఱొచె = క్రొచ్చె (శిలపై చెక్కుట)... పఱికి = ప్రక్కి నల్లచెరువుపల్లె

క్ఱొచ్చె :ఱ – పూర్వాక్షరమున క్రారముగను, పరాక్షరమునకు ద్విత్వముగను మారును.

వఱచు = వ్రచ్చు

అఱిసిన = చెఱచిన

తానికొన = తాడికొండ = అత్తివర్మ గోరంట్ల శాసనము

రేగొన = విక్రమేంద్ర = చిక్కుళ్ళ శాసనము

కుస్తూరు = పోలమూరు శాసనము

వేయి వఱకు అంకెలు వాడుచుండిరి. పుణ్యకుమారుని తిప్పలూరి శాసనమందు తిథి, వార, నక్షత్ర, హోరలు చెప్పబడినవి గనుక వాటి పేర్లు బాగా తెలిసియుండును.

ప్రాచీన తెలుగు శాసనాలలో వాక్యరచన మన యిప్పటి దానికంటే కొంత విలక్షణముగ నుండును. ఏ భాషయందైనను వాక్యరచనకు ప్రధానముగ కారక నియమము పాటించుట ముఖ్యము. అనగా నేయే సందర్భములలో నేయే విభక్తి ప్రత్యయములతో నామవాచకములను క్రియతో నన్వయించవలెనో గమనించుట. ఒక్కొక్క భాషలో నీ విధాన మొక్కొక తీరుగ నుండును. సంస్కృతములో 'చతుర్థీ సంప్రదానే' అని దానార్థమునందు చతుర్థి విధింపబడెను. 'విద్ధశర్మణే గ్రామోదత్తః' అని వాక్యముండును. కాని తెలుగులో అదే వాక్యము వ్రాయుచో 'విద్ధశర్మకు గ్రామమివ్వబడెను' అని యుండును. దానార్థములో బహుళముగా షష్ఠినే తెలుగులో వాడుదుము. దీనికి తెలుగు వ్యాకరణము రచింపబడక పూర్వము నుండి షష్ఠియే యిట్టి వాక్యములందు రూఢియై యుండుట కారణము. క్రొత్తగా భాష రూపొందునపుడు విభక్తి ప్రత్యయము లతిస్వల్పముగ నుండును. వాటిని మాత్రమే ఉపయోగించుచు వాక్యములను రచించెడివారు. కనుక స్థిరమైన భాషయగు సంస్కృతముకంటె తెలుగు భాష ప్రాథమిక దశలో చాల తప్పులతో లక్షణ విరుద్ధముగ నుండెడిది. ఒకే రాజుచే వ్రాయించబడిన సంస్కృత శాసనములు తెలుగు శాసనములు పోల్చి చూచిన సంస్కృత శాసనములు సుబోధముగను తెలుగువి వక్తవ్యాంశము కూడ తెలియబడకుండగను ఉండును. పుణ్య కుమారుడనే రేనాటి చోళ రాజుచే నొసగబడిన మాలెపాడు, దొమ్మరి నన్నూల సంస్కృత శాసనాలు చక్కగా అర్థమగుచుండును. కాని ఆ రాజువే తిప్పలూరు, రామేశ్వరములోని తెలుగు శాసనాలు అర్థమగుటలో కష్టముగనుండును. అట్లే తూర్పు చాళుక్య రాజగు విష్ణువర్ధన మహారాజు యొక్క అహదనకర శాసనము సంస్కృత భాగము సులభముగనుండును. అంతేకాక సంస్కృత శాసనాలు సాధారణంగా

విద్వాంసులు వ్రాసెడివారు. కనుక కొంతమటుకు నిర్దుష్టముగనే యుండును. తెలుగు శాసనాలు ప్రజాబాహుళ్యము మాటాడు భాషలోనే యుండెడివి. కనుక గ్రామ్యమనవలెను. దానిని వ్రాయునపుడు అనేక లోపములుండును. ఇప్పటి గ్రామ్య భాషనైనను వ్రాయవలెనన్నచో అనేక భేదములుండును. ప్రాంతీయ భేదములేకాక ఉచ్చారణలో కూడ కొంచెం చదువుకొన్న వారు మాట్లాడునది వేరు, చదువు రానివారు మాట్లాడునది వేరు. అందుచే ఇట్టి భేదములన్ని మనకు తెలుగు శాసనాల్లో కనుపించును.

తెలుగు భాషలో ఆఱవ శతాబ్దము వఱకు వాక్య రచన ఉన్నట్లు చెప్పదగిన ఆధారములు లేవు. అమరావతి ప్రాకృత శాసనాల నడుమ 'నాగబు', గాథా సప్తశతిలో పొట్ట, అత్త, కరణి మొదలగు పదాలు ఒకటి – రెండు శతాబ్దములనుండి వాడుకలో నున్నట్లు తెలియుచున్నను నాగార్జునకొండ శాసనాల్లోగాని మరి యితర చోట్ల శాసనాల్లోగాని ప్రాకృత భాషలోను, చెదురుగ సంస్కృత భాషలోను వాక్యములున్నవేగాని తెలుగులో వాక్యములు 6వ శతాబ్దిలోగాని కానరావు. అప్పుడప్పుడే ద్రవిడ, ప్రాకృత, కన్నడ, సంస్కృత పదాలలో నుండి కొన్నిటిని తీసుకొని తమకున్న పదజాలముతో జోడించి తెలుగు వాక్యములు వ్రాయుట మొదలు పెట్టుకొన్నట్లు ప్రాచీన తెలుగు శాసనాలను కొన్నిటిని చూడగ మనకు తెలియగలదు. అప్పటికే మాటాడు భాషలో తెలుగు వాక్యాలు ప్రాకృత వాక్యాల స్థానంలో విశేషముగ జొచ్చియుండును. కాని తెలుగులో ప్రాకృత వాక్యాల స్థానంలో విశేషముగ జొచ్చియుండును. కాని తెలుగులో వాక్యమును వ్రాయుట క్రీ. 575 ప్రాంతముదనబడు ధనంజయుడను రేనాటి చోళరాజు యొక్క కలమళ్ళ శాసనమును బట్టియే మనకు తెలియుచున్నది. అంతకు పూర్వము రెండు శతాబ్దముల నుండి కూడ యేకొద్ది వాక్యములో వాడుకలో నుండి యుండునని యూహించవచ్చును. మనకు మొదటి తెలుగు శాసనాలు కొన్ని రేనాడు మండలము (కడపజిల్లా)లోనే దొరుకుచున్నవి. అయినను సరిహద్దు జిల్లాలలను విడిచి మిగిలిన తెలుగు దేశమందంతటను అప్పటికి తెలుగు భాష వ్రాత భాషగ పరిణమించినదని చెప్పవచ్చును. ఇప్పుడు కొన్ని శాసనాలను వాటి రచనా విధానమును పరిశీలించుదము.

వీటిలో అనేక పదములు దీర్ఘములకు బదులు హ్రస్వములు వాడుట, హ్రస్వములకుగాను దీర్ఘములు వాడుట, శ, ష, లకు బదులు 'స'ను వాడుట, ఋకార

స్థానములో 'రి'వాడుట 'అ' కారమునకు బదులు 'ఎ' కారమును వాడుట మున్నగు ననేక వ్యత్యస్తములు నేడు వ్యాకరణాదుల దృష్టిలో అపశబ్దములని తోచును. అప్పుడప్పుడే మాటలు పలుకుట నేర్చుకొను శిశువులు తమ ఊహలను ప్రకటించుట కెంతో శ్రమతో మాటలను వెదకికొనుచు తప్పులతో గూడిన అసంపూర్తి వాక్యములను ఎట్లు పలుకుదురో అట్లే యీ ప్రాచీనుల తెలుగు వాక్యములుండును.

౨. ధనంజయుని కలమళ్ల శాసనము

(సుమారు క్రీ. 575) - కమలాపురం తాలూక

ఎపి. ఇం. XXVII - పుట. 221

1. ....
2. కల్ము(తు)రా
3. జు ధనంజ
4. యుదు రేనా
5. ణ్డు ఏళన్
6. చిఋంబూరి
7. రేవణకాలు (పం)
8. పు చెనూరుకాజు
9. అఱి కళా ఊరి (-)
10. ణ్ణ వారు ఊరి... ...
11. ... ...
12. ... ...
13. ... ...
14. ... ...
15. ... ... పఞ్చ (మ)
16. హాపాతకస
17. కు.

ఈ శాసనములో ఠ, ఱ, ఋ, ద (ణ్డు, ణ్ణలలో) అక్షరములున్నవి. 'వారు' అను బహువచనము కానవచ్చుచున్నది.

'ఎరికల్ ముతురాజు' అనే బిరుదుగల ధనంజయుడను రాజు రేనాణ్డు ఏలుచుండగా చిఋంబూరు అనే గ్రామానికి చెందిన రేవణ అను పేరుగల 'కాలు' ఒక ఉద్యోగి (లేక ఆసామి) యొక్క పంపున చెనూరి గ్రామానికి చెందిన 'కాజు... '

అని వాక్యమ సంపూర్తిగ నున్నది. తుదిలో పంచమహాపాతకుడగునని యీ ధర్మమును చెడగొట్టువారికి పాపము చెప్పబడెను. ఈ శాసనములో భాషా విషయకముగ విశేషములు తెలుసుకొను అవకాశమంతగా లేదు.

ఎరిగల్ అను నగరము వీరికొకప్పుడు రాజధాని యగుటనుబట్టి యీ రాజులలో కొందరికి ఎరిగల్ ముతురాజు, ఎరిగల్ దుగరాజు అను రాజ బిరుదములుండెడివని దీనిని ప్రకటించిన కీ.శే. ముట్లూరి వెంకట రామయ్య గారు, ప్రొఫెసర్ కె.ఎ. నీలకంఠశాస్త్రిగారు చెప్పిరి. మహారాజు, మహారాజాధిరాజు, యువరాజు (దుగరాజు) అను పదములు రాజపదవులలో ప్రభేదములను తెలుపునట్లే ముత్తురాజు పదముకూడ నొక భేదమును తెలుపునని వారు చెప్పిరి.

3. ఎర్రిగుడిపాడు శాసనము

(క్రీస్తు శకము 600 ప్రాంతముది)

ఎపి.ఇం. XXVII – పుట. 225

ఇది కూడ కమలాపురం తాలూకాలోనిదే.

మొదటివైపు

1. స్వస్తిశ్రీ ఎరిక
2. ల్ముత్తురాజుల్ల
3. కుణ్డికాళ్లు నివబుకా
4. ను ఇచ్చిన పన్నస (11*)
5. దుజయ రాజుల
6. ముత్తురాజులు నవ
7. ప్రియ ముత్తురాజులు
8. వల్లవ దుకరజులు శక్షి
9. కాను ఇచ్చి (న*) పన్నస్స (11*)

రెండవ వైపు

10. కొట్టంబున పా
11. పాఱకు కుణ్డికాళ్లు
12. ళా ఇచ్చిన పన్నస
13. ఇరవది యాది నా
14. ల్కు మఱున్తుద్లునేల (11*)

ఇందు 'పాఱకు' అను మాటలో శకటరేఫము, 'మఱున్తుద్లు' అను మాటలో 'ఱ'తో బాటు 'θ' కూడ వాడబడెను.

ఈ శాసనంలో సమాపక్రియ లేకున్నను క్రియాజన్య విశేషణముతో గూడిన కర్మాంత వాక్యములు మూడు కలవు. శాసనము పూర్తిగ లభించుచున్నది కనుక కొంత పరిశీలింపదగి యున్నది.

1. ఎరికల్ముత్తురాజుల్ల కుణ్డికాళ్లు నివబుకాను ఇచ్చిన పన్నస- అని మొదటి వాక్యము. ఈ వాక్యములో 'నివబుకాను' అను భాగమర్థమగుటలేదు. 'నివంబుకాను' 'నెవంబుకాను', 'నెపంబుకాను' అని దీనిని ప్రకటించిన పై జెప్పిన విద్వాంసులు కొంత సరిపెట్టిరి ప్రస్తుతము మనకు వేఱర్థము తోచుట లేదు గనుక దానినట్లే యంగీకరింతము. 'ఎరికల్ముత్తురాజుల్ల' అనునది ప్రథమాంతమో షష్ఠ్యంతమో తెలియదు. 'కుణ్డికాళ్లు' అనునది ప్రథమాంతమే. రాజుయొక్క కుణ్డికాళ్ళు (ఉద్యోగి) నివంబున (=రాజుగారిపేర?) పన్నస (=భూమిదానము) ఇచ్చిన భూమి యిది అని ఆ శాసనశిల యున్న పొలమును నిర్దేశించును. ఇట్లుకాక ఎరికల్ముత్తురాజుల్ల అనుదానికి ఎరికల్ముత్తురాజు రాజ్యకాలమున అని వారు చెప్పిరి. అపుడు 'నివంబున' అనుదాని కర్థము వేరుగ జెప్పవలయును.

2. దుజయ రాజుల ముత్తురాజులు, నవప్రియ ముత్తురాజులు, వల్లవదుకరాజులు అను ముగ్గురు సాక్షిగ ఇచ్చిన పన్నస (ఇది)- అని రెండో వాక్యము సమాప్తమయ్యెను దుజయ (దుర్జయ) రాజు యొక్క (పుత్రుడగు) ముత్తురాజు ఒక సాక్షి ముత్తురాజునునది యొకానొక రాజపదవి అంటిమి గనుక ఈయన పేరిందు లేదు. దుర్జయరాజు అనునది తండ్రి పేరు. ఈ సాక్షి పేరు వ్రాయలేదన్నమాట రెండవ సాక్షి నవప్రియ ముత్తురాజులు. నవప్రియుడనే పేరుగల యొక రాజకుమారుడు. మూడవ సాక్షి వల్లవ దుకరాజులు. వల్లభుడనునది మరల బిరుదనే తోస్తుంది. అయినను ఆ బిరుదుగల దుకరాజు (దుగరాజు = యువరాజు) అని చెప్పవచ్చు. 'క', 'గ'లకు 'త', 'ద'లకు ఆనాడంత భేదముండెడిది కాదు. తుగరాజు, దుకరాజు. దుగరాజు, అనుపదాలు యువరాజను అర్థములో వాడిన తావులనేకము గలవు. ఈ విధముగ తండ్రి పేరుతో మాత్రమే ఒక సాక్షియు బిరుదు పేర్లతో మిగిలిన ఇద్దరు సాక్షులను జెప్పబడిరి.

3. కొట్టంబున పాఱకు కుణ్డికాళ్ళులా ఇచ్చిన పన్నస ఇరువది యాది నాల్కు మఱున్తుడ్లునేల - అని మూడో వాక్యం పరిసమాప్తమయ్యెను. ఇచ్చట 'కొట్టము' అనునది బోయకొట్టమువలె నొక దేశ విభాగమని చెప్పి ఆ విభాగములో భూమిని దానము చేసిరని దీనిని ప్రకటించినవారు చెప్పిరి. కాని 'కొట్టంబు' అనునది రాజనగరమని చెప్పి అందుండు ఒక పాఱకు (బ్రాహ్మణునికి) దానమొసగిరి యనుట బాగుండును లేకున్నచో ప్రతి గ్రహీత యగు బ్రాహ్మణుని పేరు చెప్పలేదు సరిగదా

ఆయన నివాస స్థలముకూడ చెప్పబడకపోవును. ప్రతి గ్రహీతల నివాస స్థానములు సాధారణంగా శాసనాల్లో చెప్పుట కలదు. అయితే యిచ్చిన భూమి గల దేశ విభాగము నిర్దేశింపబడకుండుట లోపమగును కదా యనినచో యీ శాసనశిలయున్న దేశమే అది యగునని సరిపెట్టుకోవచ్చును. అట్లనేక శాసనాలు కలవు. బ్రాహ్మణుని నివాసమే కొట్టము. ఇరువది యాదినాల్కు - అనునది సంఖ్యావాచకము. ఇరువది (=రెండు పదులు) అది (=మొదటగల) నాల్కు (=నాల్గు) అనగా 20....4 అని పూర్వము శాసనాల్లో ౨౦ ముందు వేసి కొంత వ్యవధి వదలి ౪ అంకెను వేయువారు. అట్లే మిగిలిన అంకెలను కూడ వ్రాయువారు. కనుక ఇరువది మొదటగల నాలుగు అని వ్రాయబడెను. దశ, శత, సహస్రాది స్థానములను బాగుగ వాడుట అప్పటికింకా చేతకాదనిపిస్తుంది. పదుల స్థానములో సున్నను మాని ౨ మాత్రమేవేసి దగ్గరలో ౪ను వ్రాయుట తెలిసిన తర్వాత ఇరువది నాలుగు అని 'అది'ని వదలి వ్రాయుట నేర్చిరి. ఈ విధంగా మూడు వాక్యాలతో శాసనం పూర్తి అయినది. రాజును, దానము చేసిన రాజోద్యోగిని చెప్పుట కొక వాక్యము, సాక్షులను చెప్పుటకొక వాక్యము, ప్రతి గృహీతను దానం చేసిన భూపరిమితిని చెప్పుటకొక వాక్యము, ఏ వాక్యములోను సమాపకక్రియ లేదు. మూడు వాక్యములలోను ఇచ్చిన పన్నస అని క్రియాజన్య విశేషణముతోనే కర్మ నిర్దేశింపబడినది అయినను పై జెప్పిన సందేహాలు ప్రతి గ్రహీత పేరు లేకుండుట, కొందరి సాక్షుల పేర్లు లేకుండుట, మున్నగు లోపములు కొన్ని శాసనంలో కలవు రచనలో తప్పులు లేవనవచ్చును.

ఇవి క్రొత్తగా భాష నేర్చుకొనేవారి వాక్యములు. ప్రథమావిభక్తిలో ఏకవచన బహువచనములు. షష్ఠిలో 'పాఱకు' 'రాజుల్ల' అనునవి గలవు. సప్తమిలో 'కొట్టంబున' అని యున్నది ఇంతకుమించిన విభక్తి ప్రత్యయములు వాడబడలేదు. అంటే వాక్యరచనను మెఱుగుపెట్టుటకై కారక విశేషలములంతగా వాడుట యింకా బాగుగ తెలియదనిపించును.

కమలాపురం తాలూకాలోదే యిందుకూరులోని శాసనమొకటి రచనలో కొంత మెఱుగనిపించును.

"స్వస్తిశ్రీ చోటిమహారాజుల్లేశన్ ఎరిగల్ దుగరాజుల్ ఇచ్చిన పన్నస కొచ్చియపాఱ రేవశర్మ్మా=రికిన్"

అని ఒకే వాక్యములో వక్తవ్యాంశమును పూర్తిచేసెను. అయితే దీంట్లో సాక్షులు లేరు. దానమిచ్చిన 'భూపరిమితి లేదు. కాని

"తేనిఅచ్చిన వాన్ఱు పఞ్చమహాపాతక సంయుక్తున్గు అసివైరుపులిఖితం" అని యీ ధర్మమును చెఱిచిన వానికి పాపఫలము, వ్రాసిన వాని పేరు అసివైరువు అని విడిగా రెండు వాక్యాలలో చెప్పబడెను. మొదటి వాక్యములో దాత, ప్రతిగ్రహీతల పేర్లు చెప్పబడినవి. బ్రాహ్మణుని గోత్రము కూడ 'కొచ్చియ' (=కౌశిక) అని చెప్పబడింది. తెలుగులో వ్రాయాలనుకొనుటబట్టియే 'కౌశిక' అనుటకు బదులు 'కొచ్చియ' అను ప్రాకృత పదాన్ని రచయిత వాడెను. అనగా సంస్కృతములో వ్రాయుటకన్న తెలుగులో వ్రాయటం వారి కానాడు క్రొత్తగా ఉండేది. ఆ విధంగా భాషను సృష్టించుకొని వాక్య రచన చేయటంలో వారి నేర్పు కూడ చెప్పదగినదే.

ఇందు చెప్పబడిన చోళ మహారాజు వెనుక కలమళ్ళ శాసనమందు జెప్పబడిన ధనంజయ మహారాజు యొక్క కొడుకని చెప్పుదురు. ఇతని తర్వాతి తరము వాడు పుణ్యకుమారుడు రేనాటి రాజులలో గొప్పవాడు. ఇతనికనేక బిరుదులు కలవు. తామ్రశాసనాలు కూడా ఇతనివి కలవు. ఇతని తిప్పలూరు శాసనము చూతము.

4. పుణ్యకుమారుని తిప్పలూరి శాసనము

(క్రీస్తు శకము 630 నాటిది కావచ్చును)

ఎపి.ఇండికా. XXVII - పుట. 231

ఇదియు కమలాపురం తాలూకాలోనిదే. దీని లిపి సొగసైన పల్లవ - గ్రంథాక్షరములను పోలి యుండును. ఐకారము కళింగరాజుల శాసనములందువలె నుండును.

ఎరికల్ ముతురాజు పుణ్యకుమారుడు చిప్ఱలి పట్టుగాను రేనాణ్డేలు చుండగా చామణకాలు అను ఉద్యోగి ఔవురు (నివాసియగు) తక్కన్ప్రోలు పారదాయ (భారద్వాజ) కత్తిశర్మకు తిప్ఱలూరను ఏబది (మత్తరుల) పన్నస కార్త్తిక మాసము బహుళపక్షము ద్వితీయ, పుణరు పుష్యమి (పునర్వసు) నక్షత్రము సోమవారము బృహస్పతి హొూర అగు సమయమున ధర్మము చేసెను. పుణ్యకుమారునికి మరున పిడుకు; మదముదితును, ఉత్తమోత్తమును, గణ్యమానును అను బిరుదాలు లేక ప్రశంసాపదములు గలవు.

మూలము

1. స్వస్తిశ్రీ ఎరికల్లముతు
2. రాజు పుణ్యకుమారును గణ్య
3. మానును మరున పిడుకు మద
4. ముదితునుత్తమోత్తమునయిన వా
5. ను చిప్ఱలియ పటుకాను రేనాణ్డే
6. ళుచు తక్కఁ పుళోల పారదాయ
7. కిఔవురు కత్తిశమ్మఁకు తిప్ఱలూ
8. ర పనాశ కొణ్డ కార్త్తిఁయ చీకు
9. బిదియ సోమవారంబు పుణరు
10. పుష్యంబు బృహస్పతి హొూర (కా)
11. ను ఏమ్బది యె చామణకాల ధ (11*)

ఇచట దానము చేసినది చామణకాలు అను ఉద్యోగి. కనుక 'పుణ్య కుమారుడు రేనాణ్డేళుచు' - అనుదానికి పుణ్యకుమారుడు రేనాణ్డేళుచుండగా అని చెప్పవలెను.

'ళ'కారములు కొన్ని యింకా 'ల'కారములుగ మారలేదు. ఏళుచున్ అనేయున్నది. వేరే శాసనంలో 'శర్మ్మఁళాకున్' అని కూడా కలదు. 'ఎరికల్' అనుహలంతము పట్టుదలగా 'ఎరికల్ల' అని అజంతంగా మార్చబడింది. ఇదే నిజమైన తెలుగుతనము. అట్లే ద్రవిడ హలంత తత్సమాలు పుణ్యకుమారన్; గణ్యమానన్, ముదముదితన్, ఉత్తమోత్తమన్ అనే పదాలు ఉకారాంత తెలుగు తత్సమాలుగ మారినవి. పుణ్య కుమారున్ఱు, గణ్యమానున్ఱు, మదముదితున్ఱు, ఉత్తమోత్తమున్ఱు అని ఉకారాంతములు ప్రథమైక వచన రూపములు తయారైనవి. ఈ చివరి 'ఉ'కారము నుచ్చరించుటకు ముందున్న ప్రాతిపదికలోని 'అ'కారముకూడ 'ఉ'కారము కావలసి వచ్చింది. అనగా చివరి 'ఉ'కారము నుచ్చరించుటలో కష్టము లేకపోతే ముందున్న ప్రాతిపదికలోని తుది 'అ'కారము 'ఉ'గా మారనక్కరలేదనుకోవలెను. అందుచేతనే 'రంగడు' 'మల్లడు' 'రేవడు' అను రూపములనేకము వాడుకలోనున్నవి.

ఇచట ముతురాజు అనుటచే పుణ్యకుమారుడింక మహారాజ పదవిని పొంద లేదని తెలియుచున్నది. మఱున్ఱ పిడుకు అనగా శత్రురాజులకు పిడుగు వంటి వాడని అర్థము. 'క', 'గ'ల మధ్య భేదమింక పూర్తిగా రాలేదు. అట్లే 'త', 'ద' ల మధ్య కూడ. తేనికి, దేనికి అని అభేదంగానే వాడబడుచున్నవి. పల్లవ మొదటి మహేంద్రవర్మ యొక్క 'పగాప్పిడుగు' అనే బిరుదును పోలిన బిరుదీ పుణ్యకుమారుని 'మఱున పిడుగు' లేక 'మార్పిడుగు' అనునవి. అట్లే 'మదముదితున్ఱు' అనేది కూడ పల్లవ రాజు యొక్క 'మత్తవిలాస' అనే బిరుదును పోలియున్నది. చిఱఁలియ అనేది చిప్పలి అనే నగరము. పటుకాను (=పట్టుగాను) అంటే రాజధానిగా రాజ్యము చేయుచుండగా, అని అర్థము, తర్క్కఁపుఱోల అనగా తర్మ్మప్రోలు అనే ఊరు తకప్రోలు అని వేరే శాసనంలో కూడా వస్తుంది. 'పుఱోల'లోని 'ఱో' అను అక్షరము వలన ముందున్న 'పు' కొంత కాలమునకు 'ప్రో'గా మార్పునొందెను. అట్లే 'కొఱొచె' అనునది 'క్రొచ్చె' అని మారింది. 'పారదాయ' అనగా 'భారద్వాజ' అని కత్తిశర్మ యొక్క గోత్రము కాదగును. ఇచట గమనించవలసిన దేమన 'భారద్వాజ' అని, పుణ్యకుమారుని సంస్కృత శాసనాల్లో అనేక మార్లు వస్తుంది. అయినా యిక్కడ తెలుగుతనం ఉండాలని ప్రాకృత రూపాన్ని అనుకరించి 'పారదాయ' అని వాడెను.

'కిఱెవురు' అనే పదానికి అర్థము తెలియుట లేదు. తిప్పలూరులోనే భూమిదానం చేయబడింది. ఇట్లు బ్రాహ్మణులకు దానంగా ఇచ్చే భూమిని 'పన్నస' అంటారు.

పన్నాస, పన్నవిస అను రూపములలో కూడ నిది ప్రాచీన తెలుగు శాసనములందు కనుపించును.

'కొణ్డకార్త్తిక' అను పదంలో 'కొణ్డ' అంటే సరిగా తెలియదు. తిథి, వారాలు, నక్షత్రము, హోర చెప్పబడినవి. పుణరుపుష్యం అంటే పునర్వసు నక్షత్రమని అర్థము. తమిళంలో కూడ దీనిని 'పునర్పూశం' అంటారు. సోమవారమనీన్నీ, బృహస్పతిహోర అనిన్నీ చెప్పబడినవి. శాసనాల్లో వారము, హోర చెప్పబడుట యిదే మొదలనిపిస్తుంది. కనీసం వారము పేరు చెప్పుట కూడ ఇంతకుముందు శాసనాల్లో కానరాదు.

ఏబది అని సంఖ్యమాత్రమే చెప్పబడింది సందర్భమునుబట్టి 'మఱుతర్లు' అను భూపరిమాణముగా గ్రహించవలెను. చామణకాలు అనే ఉద్యోగి యొక్క 'ధ' అంటే 'ధర్మము' అని ప్రాకృత శాసనాల్లో సూక్ష్మముగా వ్రాయుట కలదు. కనుక అట్లే యిక్కడ కూడా గ్రహించవచ్చును.

'రేనాణ్డేళుచుండగా' అనుటను బదులు 'రేనాణ్డేళుచు' అని వ్రాయటము, తుదిలో 'చామణకాల (ధర్మము)' అని క్రియ లేకుండా వాక్యం ముగియుట ఇవి రచనలోని లోపములు. వాక్యరచన సరిగా రూపొందలేదని స్పష్టంగా తెలుస్తోంది. వీరి శాసనాలన్నీ యించుమించుగా ఇట్లే యుండును. కొన్ని పదాలకి సరిగా అర్థం తెలియక పోవటమేగాక వాక్యాల్లో కర్త, క్రియ, కర్మలను తెలుపు పదాలు కూడ స్పష్టంగా ఉండవు. క్రొత్తగా భాషను తయారుచేసుకొనే కాలమది. ఈ మాత్రం శాసనం వ్రాయటమే చాలా గొప్ప ఆనాడు.

ఈ పుణ్యకుమారుని కొడుకు మొదటి విక్రమాదిత్యుడు, ఇతని కొడుకు శక్తి కుమారుడు, ఇతని కొడుకు రెండవ విక్రమాదిత్యుడు, ఇతని కొడుకు సత్యాదిత్యుడు. 'విక్రమాదిత్య' అను పేర్లు వచ్చినప్పటినుండి వీరు బాదామి చాళుక్యులకు సామంతులైనట్లు తెలుస్తుంది బాదామి చాళుక్య రెండవ పులకేశి వల్లభుని (611-643) కొడుకు మొదటి విక్రమాదిత్యుడు క్రీ. 678 వరకు రాజ్యమేలెను. తరువాత అతని కొడుకు వినయాదిత్యుడు, ఇతని కొడుకు విజయాదిత్యుడు వరుసగా రాజ్యమేలిరి. విజయాదిత్యుని కొడుకు రెండవ విక్రమాదిత్యుడు క్రీ. 732లో రాజయ్యెను. ఇతనికి సమకాలికుడు సత్యాదిత్యుడనే రేనాటి చోళరాజు. ఈ రాజు యొక్క శిలాశాసన మొకటి కమలాపురము తాలూకా మాలెపాడులో కలదు.

5. సత్యాదిత్య చోళుని మాలెపాడు శాసనము

(సుమారు క్రీ.శ. 725 నాటిది)

ఎపి.ఇండికా. XI - పుట. 345

మొదటివైపు

1. అ స్వస్తిశ్రీ చోఱమ
2. హా రాజాధిరాజ ప
3. రమేశ్వర విక్రమాది
4. త్య శక్తి కొమర వి
5. క్రమాదితుల కొడుకు
6. (ళ్ళ్) కాశ్యపగోత్రు
7. (న్దు) శత్యదిన్దు శిద్ధి
8. (వే*)యు రేనాణ్డు ఏఱు (వే)
9. (ళు) ఏళుచు (న్ది) కొమ
10. (టి) పాఱ రేవశ
11. ర్మ్మకాశ్యపగో
12. త్రి ((త్రు)నికి ఇచ్చిన
13. (--) చిఱుంబూరి ఉత్త
14. (--) శతూపుఁ న దిశ
15. (--) దు జుగ్గి పొల గ (రు)
16. సు దక్షిణదిశ (ర)
17. (-) గ్గా పాఱ (-)

రెండవ వైపు

18. ఏనుమఱుత్రుగా
19. ను తాగిరి (11*)దేని
20. సల్పిన వానికి

21. వేగుద్లుమువేసె
22. ఉవుళు వేవాన్గు
23. ద్లు నిల్పిన పుణ్య
24. ంబు దీనికి వక్రంబు
25. వచ్చు వన్గు పుత్రవ
26. ద్య స్త్రీవద్య గోవ
27. ద్య పఞ్చ మహా
28. పాతక ఞ్జేసిన
29. వాని లోక(ంజ)
30. న్వాన్గుల

ఇప్పటికి భాష కొంచెం మెఱుగైంది. రాజు కొద్దిపాటి ప్రశస్తి, తన కులగోత్రములు, తండ్రితాతల పేర్లు వ్రాయించుకొనెను. తను చోఱమహారాజాధిరాజ పరమేశ్వరుడననియు, విక్రమాదిత్యుని పుత్రుడగు శక్తికొమరుని కొడుకైన (రెండవ) విక్రమాదిత్యుని కొడుకుననియు కాశ్యపగోత్రమునకు చెందిన వాడననియు చెప్పుకొనెను సిద్ధవటము–వేయి గ్రామాల సీమ, రేనాణ్డు–ఏడువేల గ్రామాల సీమ రెండిటిని కలిపి రాజ్యము చేయుచున్నట్లు చెప్పుకొనెను. అట్టి సత్యాదిత్య మహారాజు కాశ్యపగోత్రుడగు రేవశర్మ అను బ్రాహ్మణునికి ఇచ్చిన(ది) అని వాక్యము ముగియును. భూమి అని పూరించుకొనవలెను. కొమఱి అనునది 'పాఱ'కు విశేషణముగ నున్నది గనుక నొక గ్రామమని అర్థమగుచున్నది. తర్వాత వాక్యములో చిఱుంబూరు మున్నగు సీమలు చెప్పుతూ ఇచ్చిన భూపరిమితి చెప్పబడెను. వాక్యం చివర 'తాగిరి' అని సమాపకక్రియ కలదు. ఆ సరిహద్దులు తాకునట్లు అయిదు మఱుతుర్లు భూమిని ఇచ్చిరి అని అర్థము. ఇంతవఱకు రెండు వాక్యములు సరిగానే యున్నవి. 'తాగిరి' అను క్రియ మనకిప్పుడు ఈ యర్థములో కానరాదు.

తర్వాత ఈ ధర్మమును కాపాడువానికి పుణ్యఫలము, చెఱచువానికి పాపఫలము చెప్పబడినవి ఇందలి పదములు కొన్ని పరిశీలింపదగియున్నవి.

'విక్రమాదిత్య శక్తి కొమర విక్రమాదితుల కొడు'కను చోట మూడు పురుషాంతరముల వారొకే సమాసములో జేర్చి చెప్పబడుట యొక విశేషము. 'ఏఱు

చున్రి' అని 'ఏలుచుణ్డి' అను నర్థమును వాడబడెను. కాశ్యపగోత్ర రేవ శర్మకు అనుటకు బదులు 'రేవశర్మ కాశ్యపగోత్రునికి' అనే ప్రయోగము విలక్షణంగా ఉన్నది. షష్ఠీప్రత్యయము 'రేవశర్మ' పదానికి కాకుండ గోత్రపదానికి చేర్చబడింది. 21వ పంక్తి నుండి వేగుద్లు, **ము** వేసెఱువుళు, వేవాన్రుద్లు నిల్పిన పుణ్యము అను దానిలో ము యొక్క ప్రయోజనము తెలియదు. ప్రథమావిభక్తి ప్రత్యయము కాదు. ఆనాటికింకా 'ంబు' అనేదే వాడబడుచుండెను. లేఖక ప్రమాదము కావచ్చును. 'వేగుద్లువు' అని దానిని ప్రకటించినవారు చదివిరి. అప్పుడు కూడ 'వు'కి ప్రయోజనము కానరాదు. ఇచట 'గుడి'కి బహువచనము 'గుద్లు' అని యున్నది. అది నేడు గుడ్లు, గుళ్లు అని ద్వివిధ రూపములైనది. అట్లే మఱికొన్ని పదములు గలవు. వర్ణము భాష నుండి పోవునపుడు దానినిక సరిపోవు ఉచ్చారణమును ఉన్న అక్షరములతో సరిపెట్టుటకై చేసిన ప్రయత్నమే యిట్టి వికల్పరూపము లయ్యెనని స్పష్టమగుచున్నది.

గుడి ⟶ గుద్లు (=గుడ్లు, గుళ్లు) (ప్రస్తుత మాలెపాడు శాసనము)

వాకిలి ⟶ వాకిద్లు (=వాకిండ్లు, వాకిళ్ళు) అరకట వేముల శాసనము)

ఊరు ⟶ ఊద్లు (=ఊఁడ్లు, ఊళ్ళు) (ఇదే శాసనము)

కంచరి ⟶ కంచద్లు (కంచడ్లు, కంచర్లు) (అరకటవేముల శాసనము)

వేవాన్రు, ద్లు అని యీ శాసనమందు చూడనగును.

'వేవాన్రుద్లు' అను పదము 'వేయి ఊళ్ళు' అను నర్థమున వాడబడినట్లు తోచును. 'పుదలి ఏదువాన్రు' 'సాక్షి వచ్చువాన్రు' 'క్రంబు వచ్చువాన్రు' మున్నగు క్రియాయుక్త విశేషములందువలె 'వేయి' అను సంఖ్యావాచకము తరువాత కూడ వాన్రు వాడబడెను. వేవాన్రు = వేయువాడు అని కీ.శే. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు చెప్పిన యర్థమిచట బాగులేదనిపించును. పుత్రవధ, స్త్రీవధ, గోవధ అనుటకు పుత్రవద్య, స్త్రీవద్య, గోవద్య అని యున్నది. పుత్ర వధయు, స్త్రీ వధయు, గోవధయు అని సముచ్చయార్థ 'ఉ'ను చేర్చదలచనేమో.

'లోకం జన్వాన్రు' = లోకము చనువాడు

ఊరు 'పదమును గురించి కీ.శే. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు కొంత చర్చించిరి (రాజరాజనరేంద్ర సంచిక). అందు వారు 'ఊరు' యొక్క ప్రథమైక వచనము 'వాన్రు'లో వలె 'ఊన్రు' కాదగుననియు, అది క్రమముగ ఊణ్డు, ఊడు అయినందువలన

ఊడ్లు, ప్రథమా బహువచన రూప మేర్పడి యుండుననిరి. కాని ప్రాచీనశాసనములగు కొసినేపల్లి శాసనమందొక దానిలో 'ఊరుపెన్ కాలు' అనియు, చిలమకూరు శాసనమందు 'చిఱుంబురు పళన్' అనే ప్రయోగము ఉన్నది. కనుక 'ఊరు' అని యేకవచనరూపము, అట్లాగే వారు చెప్పిన రీతిగ నల్ల చెఱువుపల్లె శాసనములో 'కజ్జఘూన్ఱూ ఏళ' అనే ప్రయోగములో 'ఊన్ఱు' అను రూపము కనిపించుచున్నది. కనుక ప్రథమైక వచన రూపములోనే సందేహము కలుగుచున్నది. 'ఱ' అను అక్షరముతో కూడిన పదమని చెప్ప వీలగుచున్నది. అది 'ఊన్ఱు' అనుటకంటె 'ఊదు' అనుట యుక్తమని తోచును. అది క్రమముగ 'ఊరు'గ మారియుండును. సాధురేఫమే ప్రాచీనకాలము నుండి యందు తఱచు కానవచ్చును. కాని వేల్పుచెర్ల శాసనములో 'కొదపునూఱు' అని శకటరేఫ కలదు. కనుక అప్పటికే దీనిలోని 'ఱ' వర్ణము ర, ఱ, లుగ మార్పు నొందుచుండెనని తెలియుచున్నది. బహువచనములో మాత్రము 'ఊడ్లు' అని రూపము క్రమముగ ఊడ్లు, ఊళ్లు అని మార్పునొంది వికల్ప రూపము లేర్పడియుండును. ఏకవచనములో వారు చెప్పిన ఊఱు, ఊదు అను రూపములు చిన్త్యము. 'వంగనూర్లి' అని వంగనూరికి సంబంధించిన లేక వంగనూరులో అను ప్రయోగము అరకటవేముల శాసనముందు కలదు. 8,9శతాబ్దములలో తెలుగు భాష నుండి తొలగిపోయిన 'ఱ' అను మనకు తెలియని అక్షరము యొక్క వికారము లీ రూపములన్నియు, 'ఱ' అను నక్షరము కంటె ఈ 'ఱ' యొక్క వాడుక ప్రాచీన శాసనములందధికము. ప్రథమైక ప్రత్యయమునందేకాక, బహువచన ప్రత్యయమందు, ప్రాతిపదికలయందు ఇది ఉన్నట్లు తెలియుచున్నది. ఈ క్రిందివి కొన్ని యుదాహరణలు మాత్రమే.

పుణ్యకుమారున్ఱు – ప్ర. ఏ. ప్ర.

ధనంజయుదు – ప్ర.ఏ.ప్ర

వాకిద్లు – ప్ర.బ.ప్ర

వాన్ఱు – ప్ర. ఏ. ప్ర.

చదు – ప్రాతిపదిక

ఊదు – "

ఈ వర్ణము యొక్క సరియగు ఉచ్చారణగాని, దాని విశేష ప్రయోగములుగాని తెలుసుకొనుటకు తగినన్ని పదములు ప్రస్తుతము లేవు. ఈ విలక్షణోచ్చారణముగల యక్షరమును ప్రాచీనులే తొలగించి దాని స్థానములో రూపాంతరముల నేర్పాటు చేసిరి. నన్నయగారికి కూడ దీని సంగతి తెలియకపోయియుండును.

6. అరకట వేముల శాసనము

(8వ శతాబ్దముది కావచ్చును)

ప్రొద్దుటూరు తాలూక.

1. స్వస్తిశ్రీ వల్లభమహారాజాధి రాజపరమహేశ్వర భట్టరళ పృథివిరాజ్య

2. ఇశ్చేయన్ పెఱ్బాణ వంశ భుజంగది భూపాదిత్యుల కదాన్ వంగనూర్లి చరువ శర్మ్మపుత్ర

3. విన్న శర్మ్మళాకు నిడుగడంబున పన్నశ ఇచ్చిరి. వేంగుళూద్లు, పెద్దుకాలు, నారకొళు కంచద్లు

4. ఇన్నల్వ్వురు సాక్షి

5. దేనికి వక్రంబు వచ్చు వాన్డు పఞ్చమహాపాతక సంయ్యుక్తున్డగున్॥

6. అబ్భిర్ద్ధత్తన్డిభి ర్భక్తం సద్భిశ్చ పరిపాలితం। ఏతానినని వర్త్తన్తే పూర్వ్వరాజకృ

7. తానిచ॥ స్వదత్తా (0) పరదత్తా (0) వాయోహరేతి (త) వసున్ధరా (0) షష్టిం వర్ష సహస్రాణి విష్టా

8. యాం జాయతే కృమి (ః)॥

శాసనము చాలా స్పష్టముగ చదువుటకు వీలుగ నున్నది. శాసన పాఠము పూర్తిగనే యున్నది. చెప్పదగిన లోపములు కానరావు. సంస్కృత శ్లోకములలో తప్పులు చెప్పదగినవి అంతగా లేవు కనుక లేఖకుని దోషమని చెప్పి వదలివేయవలసిన భాగమంతగా లేదు. కాని మనకీ శాసనములో అనేక సందేహాలు కనుపించును.

1. 'పృథివీరాజ్యఇశ్చేయన్' అనే క్రియకు కర్త కనుపించదు. శ్రీ వల్లభ మహారాజు అని చెప్పుచో ముందుండవలసిన 'మహారాజాధిరాజ...' ఇత్యాది బిరుదు పరమందున్నట్లు భావించవలెను. అట్లా కూడ కొన్ని గలవు. "స్వస్తిశ్రీ విక్రమాదిత్య పృథివీవల్లభ మహారాజాధిరాజ పరమేశ్వర భటారళ్" అని రామాపురంలోని చాళుక్య విక్రమాదిత్యుని శాసనము ఇదే కాలమునకు చెందిన దొకటి కలదు అయినను 'శ్రీ' స్వస్తిశ్రీలో దానినిగ చెపితే వల్లభ మహారాజగును శ్రీ పల్లభుడుగాని వల్లభుడుగాని

ప్రసిద్ధ రాజెవడు ఆనాడున్నట్లు తెలియదు.

2. పెర్బాణవంశ భుజంగది భూపాదిత్యుల కదాన్ - ఇది దానము చేసిన దాతను తెలుపును. భూపాదిత్యుడనే సామంతుడనుకొనవలెను. ఆయన మహాబాణ వంశమునకు చెందినవాడు. 'కదాన్' అనే పదానికి అర్థము తెలియదు. పెర్ అనగ కన్నడములో గొప్ప అని అర్థము.

3. 'చరువశర్మ పుత్ర విన్నశర్మళాకు' అని ప్రతిగ్రహీత పేరు తండ్రి పేరుతో కలిపి సమాసము చేయబడింది నిడుగడంబున - అనేది స్థలనామము కావచ్చును. అచ్చట పన్నశ అంటే భూమి దానము ఇచ్చిరి.

4. సాక్షులు నల్వురు, ఉన్న పదాలు నాలుగు (1) వేంగుళూద్లు, (2) పెన్రుకాలు (3) నారకోళు (4) కంచ్చద్లు. ఈ నాలుగు మనుష్యుల పేర్లగునా కాదా అని సందేహము. వేంగుళూద్లు అనునది ఊరి పేరగుచో పెన్రుకాలు ఆ యూరి వాడగును. ఇదియే ఉచితమని తోచును కాని 'వేంగుళూద్ల' అని షష్ఠ్యంతముగా అది లేదు. పైన 'వంగనూద్ల' షష్ఠ్యంతము కలదు. 'నారకోళు' అనునది స్థలనామమో మనిషి పేరో తెలియదు. కాబట్టి మన యిష్టం మీద ఆధారపడి యున్నది. 'నమ్మిపోళు' అని మనిషి పేరొకటి బాణవంశపు ధవళెయ రాజు యొక్క బలపనూరు శాసనములో కలదు. అట్లే యిదియు మనిషి పేరగునేమో. కంచద్లు (కంచరివాండ్రు) అని యెందరో తెలియదు. ఈ నాల్గిటిలోను ఒక్కటి కూడ మనిషి పేరుగా కనిపించదు. వేంగుళూద్లు, వేల్పుచెర్ల శాసనమందున్న వ్రేంగులవంటి వారి సంఘమునకు చెందిన నివాసమని తోచును. వారికి సంబంధించిన 'పెద్దకాలు' అనగ ఆసామి లేక ఉద్యోగి యని అర్థమగును. 'కణ్ణనూద్లు' అని మనిషి పేరుగా వైదుంబ గండత్రినేత్రుని వందాడి శాసనములో నున్నది అట్లే వేంగుళూద్లు మనిషి పేరగునేమో చెప్పజాలము. ఇట్టి యూహలెన్నియైనను చేయుటకు వీలుగ నున్నది. సాక్షుల నిర్దేశము అంటే అక్కడ ఎదురుగ నున్న వారిని మనుసులో పెట్టుకొని వారి పేర్లు కూడ వ్రాయకయే వీరు సాక్షులని చెప్పబడెను. కంచద్లు ఎందరో తెలియదు. మొత్తము నలుగురని మాత్రము చెప్పబడెను. ఇచ్చిన పన్నస యొక్క పరిమితిగాని యెల్లలుగాని చెప్పబడలేదు.

దీనిని బట్టి ఆనాటి మంచి భాషలో వ్రాయబడిన శాసనాలైనను మనకీ నాడు సులభముగ నర్థము కావని చెప్పవలెను. దానికి ఆనాటి భాష సరిగా రూపొందక

పోవుటయే కారణము. భాషను తయారుచేసుకొనే కాలమది. ఇప్పుడు మన కట్టికాలమొకటి తెలుగు భాషకుండెనా యనిపించును. ఉన్నదనుటకు ఈ అసంబద్ధ వాక్యములే ప్రమాణము. మాట్లాడునపుడు వారు ద్రావిడ, కన్నడ, ప్రాకృతములతో గూడిన తెలుగుభాషను మాట్లాడువారు. కన్నడులు తాము కన్నడములోనే వ్రాయటం మొదలిడినప్పటినుండి వీరికి కూడ భాషాభిమానము పుట్టి వ్రాయుట ప్రారంభించిరి. ఆనాటి వారి శ్రమయే నేడు మనము తెలుగు వారము అని చెప్పుకొనుటకు మూలము. తెలుగువారికి ఆఱు-ఏడు శతాబ్దములలోని వారే మూలపురుషులు. నన్నయాదులకంటె మున్ముందు వారికే మనజాతి అర్పించవలసిన అగ్రతాంబూలము. గాసట-బీసటభాషనైనా మనకే వేర్పరచి యిచ్చిరి కదా! నేటి విశాలాంధ్ర నిర్మాణమునకు ఆనాటి వారి తెలుగు భాషా నిర్మాణమే మూలము.

7. వేల్పుచెర్ల శాసనము

ఇది జమ్మలమడుగు తాలూకాలోనిది. శాసనము సమగ్రముగను స్పష్టముగను ఉన్నది. చివరి కొద్ది అక్షరములు తప్ప మిగిలిన భాగము బాగున్నది. కాని మనకు అర్థమగుటలో అనేక సందేహములు కలుగుచున్నవి.

మూలము

1. స్వస్తిశ్రీ కొౘ్లవ్రేంగు
2. ళ కొడుకు అయితా
3. ణ్ణ అరిభాలవ్రేంగు
4. వేళ్పు చెఱువున
5. షా(జ)ళ్కి మి ప్రశాదె
6. ఇచ్చెశె (॥*) వ రా స మిభో
7. ళ శివ కొమరెయక్కు
8. చన్ద్రదిత్య కాల్లంబు నాకు ని
9. ల్చిరి (||*) సశనంబు (బి) చిరి (॥*)దీ
10. నికి శక్షి చేంగాలు ఎన్మ్మళకా
11. లు ఏడ్లకాలు మేషికొణ్డు తాఱ
12. డ్లకలు (॥*) కొదపు నూఱ (వెట్టు)
13. రాజమానంబు నల్పది మఱు
14. తుడ్లు ఇచిరి (॥*) నేలనిల్పి
15. న వారికి అస్వమేదంబున
16. పలంబు వక్రంబు వచ్చువాన్ఱు
17. వేగవిలళు వేగంగియళు
18. భరనాసియుఱచిన
19. (వరు)
20. సిదయంబు రెణ్ణు (దెళా)?

ఈ శాసనములో 'కాθ్ల'లో 'θ' అక్షరమునకు తలకట్టు కలదు. చెఱువు, తాఅడ్లకలు అను పదములలో శకటరేఫము కలదు. 'ఱ చినవరు'లో 'ఱ' అక్షరము కలదు.

'అరిభాలర్వ్యేంగు'లోను 'భరనాసియు'లోను 'భ' వర్ణము కలదు. వేరే మహాప్రాణములు లేవు. 'ఏడ్లకాలు'లో 'ఏ' అను అక్షరముపై దీర్ఘమును కూడ కలిగియున్నది. ఎ,ఏల భేదము అప్పటి వ్రాతలో కనుపించదు. ఱాతిలోనేదైన పగులుండుటచే నట్లున్నదేమో.

దీనిలోని విషయమును ఈ క్రింది వాక్యములుగ విభజింపవచ్చును.

1. క్లా ర్వ్యేంగుళకొడుకు అయితాణ్ణ అరిభాలర్వ్యేంగు వేళ్పు చెఱువున పాజళ్ళిమి ప్రశాదఇఛ్చెసె. ఇచట 'పా(జ)ళ్ళిమి' అను పదము క్రొత్తది. 'పన్నస'కు వలె భూమిదానమని అర్థమిచట సరిపోవును. 'జ' అక్షరము స్పష్టముగ లేదు గనుక ఈ పదము సందేహముతో గూడి యున్నది.

2. వరాసమి భోళ శివ కొమరెయకు చన్ద్రాదిత్య కాలంబునకు నిల్పిరి. ప్రతి గ్రహీత పేరు ఈ వాక్యములో చెప్పబడెను. 'వరాసమి' ఆయన ఊరిపేరగునేమో. 'భోళశివ' అనునది తండ్రి పేరు కావచ్చును. 'కొమరెయ' ఆయన పేరు.

3. సళనంబిచిరి – శాసనమిచ్చిరి

4. దీనికి సాక్షులు : చేంగాలు, ఎన్మ్మళకాలు, ఏడ్లకాలు, మేషికొణ్డు, తాఅడ్ల కాలు అని ఐదుగురు.

5. కొదపునూఱవెట్టు రాజమానంబున నల్పది మఱుతుడ్లు ఇచ్చిరి. 'ఊరు' గ్రామమనే పదములో సాధురేఫమే కలదు. కాని యిచట శకటరేఫమున్నది. ఊదు అనునది ఊదు, ఊఱు అని రెండు విధములుగను మారుటకు 'θ' యొక్క విలక్షణోచ్చారణమే కారణము. కొదపునూరులో కొలుచు రాజమానములో నల్పది మఱుతుర్ల భూమి యిచ్చిరని ఈ వాక్యమునకర్థము.

6. నేలనిల్పిన వారికి అశ్వమేధంబున ఫలంబు = ఫలశ్రుతి.

7. వక్రంబు వచునాన్ను వేగవిలఱు, వేగంగియలు భరనాసియుఅచినవారు – అవి చెఅచువారికి పాపఫలము. భరనాసియు అనగా వారణాసియందు అని అర్థము. ప్రథమాంతమునకు 'ఉ' ప్రత్యయం చేర్చి యడాగమము చేయబడింది. కట్టించిన

గుడియు, చేసిన పనియు, ఇచ్చిన స్తితియు మున్నగు ప్రయోగములు ప్రథమైక వచనంలో శాసనాలలో వచ్చుచుండును.

8. సిద్ధాయంబురెణ్డు (--)- ఆ భూమిపై విధించు పన్ను. సాధారణముగ 'పన్నస'గ నిచ్చు భూములపై పన్ను విధించరు. కనుక 'పాజల్కిమి' అని మొదటి వాక్యములోని సందిగ్ధపదమేదో దానభేదమును తెలుపునది గావచ్చును. దీనికి పన్ను కూడ విధించబడెను.

మొదటి వాక్యములో కాθ్రేంగు కొడుకు అయితాణ్ణ అరిభాల వ్రేంగు' అను దానిలో తండ్రి కొడుకులిద్దరు పేర్కొనబడినట్లు తెలియుచున్నది. వ్రేంగు పదము ఇద్దరి పేర్లకు తుదియందున్నది గనుక దానిని వారి అధికారవాచక మనవచ్చును. గోకర్ణచోదుని కొడుకు ఉదయచోదుదు అనునపుడు చోడ శబ్దమువలె వ్రేంగు అనునది వారి వంశనామమైనను కావచ్చును. కాని ప్రసిద్ధ వంశములలో నట్టి పేరు లేదు. కనుక 'రట్టడి' వలె 'వ్రేంగు' కూడ నొక గ్రామాధికారివంటి ఉద్యోగిగా గ్రహించిన బాగుండును. తండ్రి, కొడుకుల కా యధికారము వంశ క్రమమున సంక్రమించినది కావచ్చును. 'వేఁగు' అను పదము అరసున్న గలిగి తపించు అను అర్థమును కలిగియున్నది. అరసున్న లేని పదము చారుడు, దూత అనునర్థమును కలిగియున్నది. కాని పాక్షికంగా దీనికి కూడ నరసున్న కలదని శబ్దరత్నాకరములో చెప్పబడినది. కనుక 'వ్రేంగు' అనగా 'దూత' అను నొక రాజకీయాధికారి. తలారివంటి ఉద్యోగి కావచ్చును. ఇప్పుడిక తండ్రి పేరు కాθ్రేంగు అనియు, కొడుకు పేరు అయితాణ్ణ అరిభాలవ్రేంగు అనియు చెప్పవలెను. వీటిలో కొడుకు పేరు విలక్షణంగా కనుపించును. అయితాణ్ణ అనేది మాత్రమే పేరు కావచ్చును. 'అరి' పదమును 'శర్మారికి' ఇత్యాదులందువలె 'ఆర్య' శబ్దభవముగ గ్రహించి 'గారు' అని అర్థము చెప్పుకొని 'అయితణ్ణగారు అనే బాల లేక చిన్న వేఁగు అని సర్దుబాటు చేయవలెను. 'అయితణ్ణారి' అని వ్రాయుటకు 'అయితాణ్ణ అరి అని 'ణ'కు ఉండవలసిన దీర్ఘమును 'త'కు వ్రాసి 'అరి' అని విడిగా వ్రాసెనేమో. ఏదో విధంగా సరిపెట్టవలెను. లేకపోయిన కొడుకు పేరు విలక్షణంగా ఆనాటి పేర్లకు దూరంగా ఉంటుంది.

తండ్రి పేరు 'కాθ్రేంగు' అని చెప్పుటలో కూడ కొంత తప్పు ఉన్నదని తోచును. 'కాθ' అనేది మనిషి పేరగునా కాదా? 'వ్రేంగు' వలె అది కూడ నొక

చిన్న అధికారిని తెలుపు పేరగునా? అట్టి అదికారుల అనగా 'కాళ్ల'పై అదికారి 'ప్రేంగు' కాదగునా? అపుడు 'కొడుకు' అను పదానికి తండ్రి పేరు దొరకదు. పోనీ అధికారి కొడుకేననవచ్చు లేదా కొడుకు పేరులో 'అయితాణ్ణ' అనేది తండ్రి పేరు కావచ్చు కూడ. 'అరిపాల' అనేదే కొడుకు పేరు అగును. ఈ విధంగా కూడ చెప్పుట కవకాశము కలదు.

మనకు రేవణకాలు, పుద్దణకాలు వంటి పేర్లుగల అధికారులు కొందరు శాసనాల్లో అచ్చటచట కనిపించెదరు. అట్టి కాలులనే ఉద్యోగుల మీద దూతయైన వానిని 'కాదిప్రేంగు' అని చెప్పవచ్చును కదా! ఇట్లనుకొనుటలో కూడ కొంత ఆధార మీ శాసనంలోనే కలదు. నాలుగవ వాక్యంలో 'సాక్షులుగ జెప్పబడిన వారందరు కాలురే. చేంగాలు (=చేలమీద అధికారి). 'చేను' శబ్దమున ఉత్వమునకు ఒకానొకచో లోపంబు గానంబడియెడి' అని చెప్పి శబ్ద రత్నాకరములో "వెలుగులో చేన్మేసిన గాచువారలెందు గలరె జగతి", ఉత్తరహరి. 5. ఆ. ఉదహరించబడెను. చేను+కాలు=చేంగాలు అను రూపమగునని తోచును. ఎన్మళకాలు (=ఎనుముల మీద అధికారి), ఏడ్లకాలు (=ఏడలనగా గొఱ్ఱెలు కనుక గొఱ్ఱెల మీద అధికారి); మేషికాణ్డు (=మేకల మీద అధికారులు); తాఱడ్లకాలు (దీనికర్థము తెలియదు) అంటే చేల మీద, బఱ్ఱెల మీద, గొఱ్ఱెల మీద, మేకల మీద, తాఱడ్లమీద పన్నులు వసూలు చేయు అధికారులని అర్థము. ఈ కాలుర మీద పై యదికారి అనగా వీరు వసూలు చేసిన పన్నులను రాజుగారికిచ్చు వేఁగు 'కాళ్లప్రేంగు' అనబడును. 'అరిపాల' అనే పదం పన్నులను వసూలు చేయునను నర్థమునే సూచించునేమో. కొండపర్తి శాసనంలో "ఫలధారు' అనే సుంకరి యొకడు కనిపించును. 'అరిపాల' 'ప్రేంగు' 'కాలు' అనే పదాలన్నీ స్వల్పభేదముతో సుంకరులను తెలుపునని తోస్తుంది. ఆహవమల్ల, త్రైలోక్యమల్ల, త్రిభువనమల్ల అనే బిరుదులు ఈ షడ్భేదముతో నొకే యర్థమును చెప్పుట లేదా. అట్లే

'కాళ్లప్రేంగు' అనే పెద్ద అధికారి కొడుకు అయితణ్ణ అనే అరిపాల ప్రేంగు అని చెప్పుకొన్నా తప్పులేదు. ఇప్పుడు 'కాలు' పదము యొక్క షష్ఠి కాళ్ల అని కావలెను. కాళ్లు, కాణ్డు, కాడ్లు అని ప్రథమాబహువచన రూపములగునేమో కాదు యొక్క షష్ఠి 'కాడ్లి' అగును, అనగా కాలుర యొక్క అని చెప్పవలెను. ఊఱు (ఊరు)కి షష్ఠి 'ఊళ్ల'

అని 'వంగనూఱ్లి' అను పదములో పై జెప్పిన అరకట వేముల శాసనముందు కలదు.

'కాలు' అనుదానిని గూర్చి లోగడ అనేకులు చర్చించిరి. 'గురుపాదాః' 'పితృపాదాః' 'భగవత్పాదాః' ఇత్యాది సంస్కృత పదములందు గౌరవార్థముగా వాడబడు 'పాద' శబ్దమునకు తెలుగులో 'కాలు' అని చెప్పుకొని అదే గౌరవార్థము వాబడియుండునని కొందరు తలంచిరి. కాని యీ శాసనంలో చేంగాలు, మేషికాలు, ఏడ్లకాలు, ఎమ్మళకాలు అనునవి ఆ గౌరవార్థమును సూచించుటలేదు. మనుష్యవాచకములుగాక 'చేను' మున్నగువాటికి కూడ 'కాలు' వాడబడుచున్నది. ఇప్పటికి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతంలో 'కాలు' అంటే పశువు అనే అర్థంలో వాడుట నేను స్వయంగా వింటిని. కాలు అని వారు మాట్లాడుతుంటే దాని అర్థమును ఒకప్పుడు వారి నడిగితిని. వారు కాలు అనగా పశువు అని సమాధానము చెప్పిరి. అప్పుడు ఈ శాసనంలోని పదాలు కొంత అర్థమయినట్లు తోచినవి. పశువేకాక వేరర్థములు కూడ ఈ శాసనమందు కలవు. అయినను 'పాదాః' అనే అర్థం కాదని నిశ్చయముగ చెప్పవచ్చును. ఆయా పశువులపై గాని చేలపైగాని సుంకములు వసూలు చేయు ఉద్యోగి అని చెప్పుట చాలా బాగుండునని తోచును. రేవణకాలు, పుద్ధణకాలు మంచికాలు అనువారు కూడ అట్టి యుద్యోగులే యగుదురు.

కాలురకు సంబంధించిన అధికారి గనుకనే అయితణ్ణ కొడుకగు అరిపాల వ్రేంగు తను చేసిన ధర్మమును కాపాడుటకై తనకు విధేయులగు కాలురను కొందఱను సాక్షులుగ నియోగించెనని శాసనమున కర్థము చెప్పవచ్చును. అది యుక్తముగ కూడ నుండును. గుడులలో చేయు ధర్మములకు స్థానపతులను, అచట యితర పనివాండ్రను సాక్షులుగను సంరక్షకులుగను పెట్టునట్లే యిక్కడ కూడ తన వృత్తికి సంబంధించిన వారినే సాక్షులుగ పెట్టుకొనెను.

ఈ కాఱ్లువ్రేంగులు రేనాటి చోళుల సుంకాధికారులని తెలియదగును.

'వాకిలి'కి బహువచనము 'వాకిఱ్లు' (అరకటవేముల శాసనము)

అట్లే 'కాలు'కి బహువచనము 'కాఱ్లు' కావచ్చును.

ఱ అనే అక్షరము వాడుకనుండి 'పోవునపుడు' 'వాకిండ్లు–వాకిళ్ళు'గా మారినట్లు 'కాణ్డు–కార్లు' అను రూపములనొంది యుండవచ్చును. ఇట్టి వికల్పరూపములుండుట కట్టి 'ఱ' అక్షరమును తొలగించుటయే కారణము. దాని ఉచ్చారణముతో

సన్నిహితోచ్చారణము గల రెండు మూడు రూపములు వికల్పముగ చెప్పుకొనవలసి వచ్చెను. 'కాలు' పదము పశువనెడు అర్థములో ఇంకను కొన్ని ప్రాంతములలో వాడుకయందున్నది. కనుక దీనిని నిఘంటువులో చేర్చుట మంచిది. ఈ విధముగ వాడుకలోనుండియు నిఘంటు కర్తల దృష్టికి రాని పదములను సేకరించుట నేటి పరిశోధకుల బాధ్యత. దానితోపాటు ప్రాంతీయముగ రూఢమైయున్న విశేషార్థములు గల పదములను, నుడికారములను సేకరించవలసిన అవసరం కూడ కలదు. ప్రాంతీయ పలుకుబడులను అనగా వాక్యోచ్చారణలోగల భేదములను నవీనపద్ధతిలో టేపురికార్డు చేయుట కూడ భాషా పరిశోధనకు అవసరము. ఇట్టి నవీన సాధనములు లేకున్నను శిలలపై వ్రాసియుంచిరి గనుక వాటిలో కొన్నియైనను మనకు లభించుటచే అప్పటి భాషను కొంతయైనను తెలిసికొనగలుగుచుంటిమి. తెలుగు పదములనేకము సంస్కృత పదములతో భాష నుండి తొలగింపబడినవి. 'తొఱ్ఱు' అను పదము పశువను అర్థములో నిఘంటువులోను, శాసనములందును కనవచ్చును. తొఱ్ఱూరు అను గ్రామములు గూడ కలవు. అంటే పూర్వము పశువుల సంతలు జరుగు ప్రదేశములని అర్థము. కాని నేడు అది వాడుకలో లేదు. దాని స్థానములో పశువులు లేక గొడ్లు అనే వాడుచున్నాము. నేడు ఆంగ్లము నుండి, హిందీ నుండి, ఉర్దూ నుండి అనేక పదములు తెలుగు పదముల స్థానములో వచ్చి చేరుచున్నవి. ఈ దశలు జీవభాషలకు తప్పవని భాషాశాస్త్రజ్ఞులు చెప్పుదురు.

అట్లే మఱికొన్ని పదములు కన్నడపదములని చెప్పి తెలుగు నుండి నన్నయాదులు తొలగించిరి. కాని శాసనాలలో నన్నయకు తర్వాత కూడ కనుపించును.

పన్నస = దానముచేయబడిన భూమి

ఇది కాకతీయుల నాటివఱకు శాసనములందు కానవచ్చును

మఱ్తురు = భూపరిమితిని తెలుపు కొలత

ఇది కాకతీయులకు తర్వాత కూడా శాసనములందున్నది.

ఇట్టివి ఉభయభాషలకు సామాన్యమనుకొనుటలో తప్పులేదు.

8. గణ్డత్రినేత్ర వైదుంబ మహారాజు వన్దాడి శాసనము

(రాయచోటి తాలూక)

రేనాటి చోళుల తరువాత ఎనిమిదవ శతాబ్ది తుదియందు కడప మండలము బాణరాజులకును, వైదుంబ రాజులకును వశమయ్యెను. వైదుంబులు మొదట చిత్తూరు మండలములో నుండెడివారు. వారికి వైదుమ్బ్రవోలు అను నగరము రాజధాని. తర్వాత రేనాటి చోళులను నిర్జించి చిర్పులి నాక్రమించుకొనిరి. కొంతకాలమునకు పొత్తపి (రాజంపేట తాలూక) కలుకడ (వాయల్పాడు తాలూక) నగరములు కూడ వీరికి రాజధానులయినట్లు శాసనములందు కలదు. రేనాటి చోళులవలె వైదుంబులు కూడ తెలుగు మాట్లాడు రాజవంశము వారు. వీరి శాసనములనేకము తెలుగులోను కొన్ని కన్నడములోను కలవు. వాటిలో అధిక భాగము యుద్ధములను గూర్చి చెర్కొనుచు అందు మృతినొందిన వీరుల స్మారకములుగ వేయించబడినవి. వీటిని బట్టి వీరు యుద్ధప్రియులగు రాజులని తెలియుచున్నది. 9,10 శతాబ్దులలోని వీరి శాసనములు ప్రాచీన శాఖకు చెందినవి. 11,12 శతాబ్దులవి అర్వాచీన శాఖకు చెందిన రాజులవని చరిత్రకారులు చెప్పుదురు. ఈ రాజుల చరిత్ర నిర్మాణమునకు తగిన శాసనసామగ్రి యింకా లభించకపోవుటచే వీరి ఉభయశాఖల చరిత్ర సరిగా తెలియదు.

ప్రాచీన వైదుంబులు బాణరాజులతో కలిసి నోళంబ, గంగ, చోళ రాజులపై యుద్ధములనేకము చేసిరి. అట్టి యుద్ధములలో సుమారు క్రీ. 830 ప్రాంతములో జరిగిన సొరమేడి యుద్ధమతి ముఖ్యమైనది. ఈ సమరములలో ననేక వీరులు మరణించినట్లు శాసనములనుబట్టి తెలియుచున్నది. పెనుగొండ తాలూకాలోని చోళెమరి యనునది 'సొరమెడి' యగునని నిర్ణయించిరి. ముదిమడువను వేఱొక గ్రామమువద్ద కూడ యుద్ధము జరిగెను. వైదుంబ మహారాజు గణ్డత్రినేత్రుడిందు పాల్గొనెను. ఈ క్రింది శాసనము అతని సేనాపతియు వైదుంబాన్వయమునకు చెందినట్టియు కలిగ త్రినేత్రుడను రాజు రేనాంటి పోదన్గురవద్ద యుద్ధములో మృతినొందినట్లే క్రింది శాసనమున గలదు.

మూలము

1. స్వస్త్య అనేక సమర సంగట్టణో
2. పల్ధ (లబ్ధ) జయలక్షుమీ సమలింగిత
3. వక్షస్త (ళ) కలిగె త్రిణేత్ర శ్రీసింగ
4. (మర) సేనాపతి వీరమహోర (రా)జ స్వస్తిశ్రీ మహా
5. ర(రా)జు రేనాణ్టి పోదన్గుర స్వర్గ౯ం బెక్కిన కణ్ణ -
6. నూఱు అణివెట్టి కీఱుగుణ్టి సొ(చ్చి)
7. రి(।*)గణ్ణ త్రిణేత్రున్గు కల్చి పుల్కవే
8. ఋప్ప సాసనంబు ఇచ్చె. ఎన్బయి
9. వెట్టి పురి (పురాచ) వెట్టిం (।) కణ్ణ నూθ్ల
10. గొలంబున వరికి వయ్దుంబ వసంబున వారు (దే)నికి
11. వక్రంబు వచ్చిన వాన్గు వారణాసి పాఱను కవిలళాను అచ్చిన
13. వన్గు (।) గట్టు లి (ఖి*) తమ్ (।।)*

'అనేక సమర సంఘట్టనో పలబ్ధ జయలక్ష్మీ సమాలింగిత వక్షస్థల' అనునది వైదుంబరాజుల ప్రశస్తి. ఇచట చనిపోయినది వైదుంబాన్వయమున రాజపుత్రుడును, యువరాజును కావచ్చును. కనుక ఆ ప్రశస్తి యితనికి చెప్పబడెను. అతని పేరు కలిగె త్రిణేత్రుడు. సింగ (మర), సేనాపతి వీరమహోరాజు అని అతని బిరుద నామములు. అతడు రేనాడులోని పొదన్గుర (స్థలము పేరు) వద్ద మరణించెను. రేనాటి రాజుల రాజధాని పొదిలి యనునది యొకటి కలదు అచట ఈతడు యుద్ధమున మరణించి యుండును లేక ఈ శాసనమున్న 'వన్దడి'. పొదన్గి దాని వికృతి యయినను కావచ్చును స్థలం నామమని చెప్పుటయే యుక్తమని తోచుచున్నది. 'పొదనుర' అను పదములో 'ఊర అని తుది వర్ణములు పలుక వీలగుచున్నవి. 'రేనాంటి' అని ముందున్నది. కనుక రేనాంటిలోని 'పొదండి' యనుచోట అని చెప్పిన బాగుండునని తోచుచున్నది. అచట యుద్ధమున కలిగెత్రిణేత్ర సేనాపతి మరణించగా, అతనిని ఖననము లేక దహనము చేయునపుడు అతనితోబాటు కీఱుగుణ్ట సొచ్చినవాడు కణ్ణనూద్లు అనువాడు. రాజులుగాని, యువరాజులుగాని యితర ముఖ్యులుగాని చనిపోయినప్పుడు వారి దహనమప్పుడుగాని లేక ఖననమప్పుడుగాని మరియొక సజీవుని కూడ ఆ

మృతదేహముతో కలిపి తుది సంస్కారము చేసెడివారు. సహగమనములో భార్యయే అట్లు భర్త యొక్క మృతదేహము ననుసరించి పోయెడిది. ఇచట అట్లు గాక రాజకళేబరముతో వేఱొకనిని బలవంతముగ జంపువారు. 'రాచపీనుగ తోడులేనిదే పోదు' అనెడి సామెతకు ఇదియే మూలము. యుద్ధములందు చనిపోయిన రాజులకు మాత్రమే యిట్లు చేసెడివారో లేక సామాన్యముగ రాజులెట్లు చనిపోయినను చేసెడివారో తెలియదు. ఇప్పటికి మనకు తెలిసిన ఆధారములనుబట్టి యుద్ధమృతులగు రాజులకే యీ కీఱుగుణ్ట సంస్కారము జరిగెడదని తెలియుచున్నది. ఇట్టి శాసనములు మఱికొన్ని కలవు. ప్రస్తుతమున కణ్ణనూద్లు అను వ్యక్తి సజీవుడుగనే కలిగె త్రిణేత్రుని మృతదేహముతో కలిపి కీఱుగుంట (అనగా రెండు విధములగు శరీరములను కలిపి గుంటలో పాతి పెట్టబడు) సంస్కారమును పొందెను. ఈ సందర్భమున మృతుడగు రాజు యొక్క వస్త్రములు అలంకారములు మున్నగునవి యీ సజీవ వ్యక్తికి తొడిగి ఆ వేషముతో నతనిని మృతదేహముపై గూర్చుండబెట్టి పూడ్చెడివారు. అణివెట్టుట అనగా ఈ యర్థమే కావచ్చును. కిటెల్ - కన్నడ నిఘంటువులో అణి = to come near: to touch, etc. to put on Jewels and ornaments, to embellish అని యున్నది. మృతదేహమునకు అలంకారముండదు గనుక జీవదేహమున కదిచేసి తృప్తిపడుట దీని ఉద్దేశ్యమై యుండును.

ఇట్టి త్యాగము చేసినందులకు ప్రతిఫలముగ వాని సంతతి వారికి మాన్యము లిచ్చెడివారు. ఈ శాసనమట్టి మాన్యమును తెలుపుచున్నది రెండవ భాగమున రాజగు గణ్డత్రిణేత్రుడు కల్చి (కాల్చి) (దహనమే జరిగెననిపించుచున్నది) పుల్కవేళ్ళు (=పునుక తాలుపు?) అనగా యుద్ధములందు మారణ క్రియకు అధి దైవము. వీరమరణము బొందువారికి ఆ వేల్పు పేర శాసనమిచ్చుట, ఆ వేల్పు పేర పూజ సేయుట, మున్నగునవి కలవు. పుల్కవేల్పుని సేవించు ఆచారము తరువాత మైలార, బేతాళ దేవులను సేవించుట యైనది. ఇది వీరుల మారణ హోమమునకు సంబంధించిన తంతు. సొరమేడి యుద్ధమున చనిపోయిన వీరు లనేకులకు ఇట్టి సంస్కారములు చేయబడి యుండును. రెండు, మూడు శాసనములట్టివి కనిపించుచున్నవి. ప్రస్తుతం ఎణ్బాయి (మర్తురులు) కీఱుగుంట సొచ్చినవాని వారికిచ్చి పురిపు (=అర్థమగుటలేదు) రాచవెట్టిరి. రాచమర్యాదలతో కాల్చిరి అని యర్థము. 'పురిపు' అనుచోట అక్షరములు

సందిగ్ధముగ నున్నవి. 'చితి' యను అర్థము గల పదమగు ననిపించుచున్నది. తరువాత వాక్యములో, కీఱుగుంట సొచ్చిన కణ్ణనూర్ వంశము వారికి నైదుంబ మహారాజులు వసంబున ఉందురు. అనగా కృతజ్ఞులుగా నుందురు. ఈ మాన్యమును చెడగొట్టువారు వారణాసిలో బ్రాహ్మణుని, గోవులను చంపినవారు, గట్టులితమ్ అని తుదిలో వ్రాసినవాని పేరేమో స్పష్టముగ లేరు.

ఇట్టిదే మఱియొక శాసనము అచటనే కలదు.

9. కొండపర్తి శాసనము

వరంగల్లు సమీపంలో కొండపర్తి యను గ్రామము వద్ద చెఱువులో నొక కొండరాతిపైన ఈ శాసనము కలదు. ఇది యిటీవలనే కనుగొనబడెను. అక్షరములు సుమారు తొమ్మిదవ శతాబ్దమునకు చెందునని భావింపబడుచున్నవి. అర్థమగుటలో నిదియు కొంత చిక్కు కలిగించుచున్నది ఇది యొక పొలమును కట్టుబడి కిచ్చు సందర్భమును తెలుపుము.

1. స్వస్తి (।) పొలమెయరట్టోడి మంచి కాళు
2. కొణ్డవకు సమభగంబు తంబుల స్రవంబుచేసిన
3. భూమి (।) దీని గూన్తుకున్తుల పరుదివడ్డి యారంభచేయువారు (।*)
4. యిట్లు దక్కనిగల్వనుణ్డి తంబులంబు దిన్నవారవన్దామి గొరవలు (దా)నమెయు
5. కురమమయ్యము గణపతి యోజు యిట్లు సాక్షిగాను తంబు(ల) స్రవం చేసిన స్రవణభూమి (।*)
6. యీ నెల యరి నాలుగు ద్రమ్మలు అయంబు పుట్టెణ్డుగొలుగు ధనంజెయ ఫలదారు
7. కొనువారు అకిడి ప(0)గులేదు (।*) యిద్ధలం బొత్తున నార(ం)భ చేయువారు అమ్మ కొణ్డమణ్డి యారంభ
8. చేయువాణ్డు స్రావకుల భీమియక్ణొం పాలదివాకరయస్రన్ను గొలమేడియము సాక్షి (।*)
9. నాగ కమరియ క్రొచ్చె (॥*) మంగళమహాశ్రీ (॥*)

'క్ణొంపాల' పదములో (8వ పంక్తి) 'ఱ' అక్షరము వాడబడెను. సున్నకు బదులింక బిందువులేగలవు. తంబుల స్రవంబుచేసిన భూమి – ఉదకధారా పూర్వకము చేసి దానము లొసగుట మనకు తెలుసు. ఇది తాంబూలము పుచ్చుకొని యిచ్చిన భూమి. ఇది దానము కాదు. ఒక కట్టడి. అంటే భూమి సేద్యము చేయుటకై యిచ్చి సమభాగం పాలు పంచుకొనే యేర్పాటు చేసుకొనిరి. పూర్వమిట్టి విధానము నిర్ణయము చేసుకొనునపుడు కూడ అందుకు సంబంధించిన వారు తాంబూల గ్రహణము చేసి తామా నిర్ణయమునకు కట్టుబడి యుందుమని అంగీకరించుట ఆచారమని మనం దీనివలన గ్రహించెదము. అట్టి ఆచారము వివాహ సందర్భంలోనే మనకు ప్రస్తుతం

అలవాటుగానున్నది. వధూవరులు నిర్ణయమై వారికి వివాహము చేయుదమని వారి పెద్దలు నిర్ణయము చేసుకొనునపుడిట్టి సంప్రదాయము కలదు. అట్లు తాంబూలము తినిన పిదప ఆ నిర్ణయము మారదని భావము. వివాహమునకు సంబంధించిన యితర నిర్ణయములు చేయునపుడు కూడ తాంబూలములు స్వీకరించుట కలదు. బజంత్రీలు, పల్లకీలు మోయువారు, వంటవారు మున్నగువారిచేత కూడ ఆనాడు తప్పక రావలెనను నిర్ణయముతో నిట్టి తాంబూల స్వీకారముచేయబడును. వేరే కట్టుబాట్ల విషయంలో మనకంతగా ఈ యాచారము కనుపించదు. కాని ఆ కాలములోనిది ప్రతి ముఖ్యమగు కట్టుబాటుకి ఇరువురు – లేక పలువురు మధ్య పరస్పర ఒప్పందము మీద చేసుకొనబడు నిర్ణయానికి తాంబూల స్వీకరణము అతి ముఖ్యమగు సాంఘికాచారముగ నుండెడిదని మనకీ శాసనమువలన తెలియుచున్నది. అట్లు చేసుకొన్న నిర్ణయమును ఆయా పక్షముల వారెవ్వరు తప్పకూడదని కట్టడి. దానికి సాక్షులు కూడ తాంబూలము స్వీకరించెదరు. ఇది దానము కాదు. కేవలమొక కట్టడి మాత్రమే.

పొలమెయరట్టోడి అనే స్థానికాధికారి మంచికాళు కొడుకైన కొణ్డవకు చేరి సమానముగ పాలికి సేద్యము చేయునట్లు ఏర్పాటు చేసిన భూమి యిది అని మొదటి వాక్యానికి అర్థము. అట్లని తాంబూల స్వీకారము చేయబడెను. ఈ భూమిని కూన్తుకున్తుల అంటే బిడ్డబిడ్డ తరమున పరువదివడ్డి అంటే వ్యవసాయ పర్వమునాడు చెల్లించుపన్ను చెల్లించి సేద్యము (ఏటేటా) ఆరంభచేయువారు అంటే ప్రారంభము చేయగలరు. భూమిలో సేద్యమునకు దిగునపుడు ముందుగ భూస్వామికి కొంత చెల్లించవలెను. పంట వచ్చిన తరువాత మఱికొంత చెల్లించవలెను.

పరువది=పర్వము = వ్యవసాయ పర్వదినమగు యేఱువాక పూర్ణిమవంటి దినము. నీరారంబంబు, కాడారంబంబు, (వరియారంబంబు, వెల్లారంబంబు అని కొరవిశాసనంలో పన్నులు విధించబడెను. అట్టి యారంభము ఇది).

వడ్డి

(ఒడ్డు – ఒడ్డి)	=	చెల్లించి
ఆరంభచేయువారు	=	సేద్యము ఆరంభించవలయును.

కూన్తుకున్తు = స్త్రీ వాచక పదములతో తరతరముల అను నర్థమున బిడ్డ బిడ్డ తరమువంటి ప్రయోగము కాని బిడ్డ పదము ఉభయ లింగ వాచకము (బిడ్డడు, ఆడబిడ్డ) కూన్తు పదము పుం వాచకము కానరాదు.

ఇట్లు దక్కని = ఈ విధముగ దక్కు (=చెల్లును) అని

గల్పనుండి = స్థలనామము అచట నుండి ఈ శాసనములో 'నుండి' అను ప్రత్యయము రెండు చోట్ల వాడబడెను.

వన్దామిగొౌరవలు = వన్దామి యను పేరుగల గురువులు (మత స్థానమునకు చెందిన స్థానపతులు)

తంబులంబు దిన్నవార (రు) - తంబులము తిన్నవారు.

దానమెయు, కుమరమయ్యము, గణపతి యోజు– దీనికి సాక్షులని చెప్పబడెను.

ఈ నేలయరి = ఈ భూమికి పన్ను - నాలుగు ద్రమ్మలు

ఆయంబు పుట్టెణ్డిగొలుగు = ధాన్యరూపముగ చెల్లించవలసినది. పుట్టెడు కొలత.

ఈ రెండు విధముల రాబడి ధనంజెయుడను పేరుగల ఫలధారుడు. (సుంకాధికారివంటి ఉద్యోగి) తీసికొనగలరు. ఈ పదము తహసీల్దారు, సుబేదారు, జమీన్దారువంటి ఉర్దూ పదము కాదు. ఈ సంస్కృతపదము వేఱుచో గానరాదు, క్రయవిక్రయములందు వస్తువుల వెలను నిర్ధారించుటయందు ధారణ పద ప్రయోగము కానవచ్చుచున్నది. 'వణిజులు తమయంత వలసిన ధారణ సేయ జూచుట ప్రజఁజెఱిచికొనుట' మడికిసింగన సకలనీతి సమ్మతము. ప. 218.

అకిడి పంగులేదు - అకిడి, పంగులేదు. ఈ రెండు విధములగు వేఱొండు పన్నులు లేవు. ఈ పన్నులెట్టివియో తెలియవు. పంగు సుంకము వేరే శాసనాలలో కూడవచ్చును. అకిడి అనేది పంగునకు విశేషణమోలేక వేరే పన్నును తెలుపు పదమో

తెలియదు. మొత్తము మీద రెంటి అర్థము సరిగా తెలియదు. పన్నులని మటుకు తెలుసు.

ఇద్దఱం బొత్తున నారభ చేయువారు – కొణ్ణప – వన్దామిగొరవ. ఈ యిఋవుర పొత్తున

ఆరభ – సేద్యారంభము చేయువారు.

అర్మకొండ నుండి యారభ చేయువారు – ఇది బహుళ గొరవల పక్షమున పంపబడు సేద్యకాండ్రను తెలుపును. ఈ గొరవలు అర్మకొండ (అన్మకొండ)లోని జైన గురువులు, వారు తమ సేద్యగానిని పంపుదురు. అనుముకొండకు పూర్వము అర్మకొండ యని యితర శాసనములందు కూడ కలదు.

స్రావకుల భీమయ – ఆ సేద్యకాని పేరు. ఆయన స్రావకుడు. సామాన్య జైన మతానుయాయి.

ఈ సేద్యకానిని పంపు విషయంలో క్టొంపాల దివాకరయ, స్రన్ను మేడియ అను నిద్దరు సాక్షులు.

నాగరకమరియ – నాగయ్య అనే కమ్మరి యీ శాసనమును తొలిచెను. ఇచట 'నాగయ'లోని 'య' 'కమరి' పదమునకు చేరుట గమనించదగిన గ్రామ్య ప్రయోగము.

మంగళమహాశ్రీ – పూర్వకాలమునందేది వ్రాసినను 'మంగళాదీని, మంగళ మధ్యాని, మంగళాంతాని' అను సంప్రదాయ మును పాటించెడువారు. మధ్య అది లేకున్నను ఆద్యంతములలో మాత్రము శాసనములందీ యాచారము కనుపించును. ఆదిలో 'స్వస్తిశ్రీ' యనియు అంతమున 'మంగళమహాశ్రీ' అనియు ఉండును.

ఇప్పటి కౌలునామావంటిదీ శాసనము. స్టాంపులు, రిజిస్ట్రేషన్లు లేకుండ చక్కగా తాంబూలాలు పుచ్చుకొని నిర్ణయము చేసుకొన్నారు. దాన్నొక గుండు మీద చెక్కించారు.

10. కొరవి శాసనము

(సుమారు క్రీ. 935)

పదవ శతాబ్దములోగాగల తెలుగు శాసనాలలో ముఖ్యముగ చెప్పదగినది కొరవి శాసనము. ఇది క్రీస్తు 935 నాటిదని చరిత్రకారుల యభిప్రాయము. అప్పటి తెలుగు శాసనములన్నిటిలోనిది భాషయందు, చారిత్రక విశేషములందు చాలా ముఖ్యమైనది. ఇది వరంగల్లు జిల్లా మానుకోట (యిప్పటి మహబూబాబాదు) తాలూకాలో కొరవి గ్రామమున వీరభద్రాలయములో నున్నది. శాసన స్తంభము తుదియందు విరిగిపోవుటచే నలువైపుల కొన్ని పంక్తులు నష్టమైనవి. ఇటీవల అదే గ్రామమున చెరువులో నొక శాసన ఖండము లభించెను. అదియు నిదేవిధముగ నుండ శిలాస్తంభముపై నిదేవిధమగు అక్షరములలో దీని విషయంతో కలియు విషయమునే కలిగి శాసనము యొక్క అడుగు భాగము మాత్రము కలదిగా నుండెను. ముందు చెప్పిన మొదటి భాగమున నష్టమైన భాగమిదియేనని నిశ్చయముగ చెప్పలేనంత అగోచరముగ విషయము కనుపించుచున్నది. మొత్తమున రెండు భాగములను కలిపి చదువు కొన్నను లోగడగల సందేహములట్లే యుండును. దీని నిప్పటివరకు పలువురు విద్వాంసులు పరిశీలించి యుండిరి.[1] అయినను భాషయందైతేనేమి, చరిత్రయందైతే నేమి యిందలి విషయములు సందేహరహితములు కాలేదు.

దీనివలననేగాని వేరువిధముగ తెలియని చరిత్రాంశము కొంత యిందు కలదు. శకాబ్దములు చెప్పబడకున్నను ఆధారాంతరములచే నిది క్రీస్తు 935 నాటిదని తెలియుచున్నది. పూర్వము వేంగీ నాటికి పశ్చిమ సరిహద్దైన ప్రస్తుత ఖమ్మము మెట్టు జిల్లాకు చేరిన విషయమును ముదుగొండ చాళుక్య లనబడు రాజులు దరిదాపు నాలుగు వందల సంవత్సరములు యేలుచువచ్చిరి (సుమారు క్రీస్తు 800 నుండి 1200 వరకు). వీరధిక కాలము వేంగి చాళుక్యులకు సామంతులై యుండిరి. చాళుక్య గుణగవిజయాదిత్యుని తరువాత నతని సోదరుడగు విక్రమాదిత్యుని పెద్దకొడుగకు మొదటి భీముడు క్రీస్తు 892లో వేంగి రాజ్యమున కభిషిక్తుడగు సమయంలో రాష్ట్ర

---

1. ఎ.పి. ఆంధ్రికా -. పుటలు : 118-145

కూట రెండవ కృష్ణుడు దండెత్తి వచ్చి రాష్ట్రమును బీభత్సమొనర్చెను. అప్పుడు ముదుగొండ చాళుక్య వంశ్యుడగు కుసుమాయుధుడనే రాజు రాష్ట్ర కూట కృష్ణునితో తన శక్తికొలది పోరి వేంగిదేశమును కాపాడి భీముని పట్టాభిషేకము నిర్విఘ్నముగ జరిపించెను. ఈ యంశముతో మన కొరవి శాసనం ప్రారంభమగును. మరల కొద్ది కాలమునకే రాష్ట్ర కూట కృష్ణుడు దండెత్తి వచ్చుచు త్రోవలో ముందుగ ముదుకొండ రాజ్యము నాహుతి గొనెను. ఆ యుద్ధంలో కన్నర బల్లహుని (కృష్ణరాజు యొక్క) చేతజిక్కి ముదుకొండ చాళుక్య రాజయిన కుసుమాయుధుడు మండిసెను. ఈ వంశము నీప్రాంతమున నెలకొల్పినది బాదామి చాళుక్య సంతతిలోని వాడైన రణమర్దుడను రాజు. తాను పట్టము గట్టుకొనునపుడు రాజ్యాధికార సూచకముగ మెడయందొక కణ్ఠియను అలంకరించుకొనెను. దానికి రణమర్దకణ్ఠియ యను పేరు. అతని సంతతిలో ఆ రాజ్యమునేలు రాజులెల్లరు దానిని రాజలాంఛనముగ ధరించుట ఆచారమై యుండెను. కుసుమాయుధుడు రణభూమిలో చనిపోగా మృతదేహము శత్రువుల వశము కాకుండు లోపుగనే శిరమును, దానితోపాటు అతడు ధరించిన రణమర్దకణి యను అతిధైర్య పరాక్రమములతో పోరి అతని పెద్దకొడుగుణగయ్య కాపాడగలిగెను. లేనియెడల శత్రువులు తమచే జయింపబడిన ప్రధాన నాయకులగు రాజు సేనా నాయకుల శిరములను తమ విజయసూచకముగ ఊరేగించి అవమాన పఱచెదరు. అంతేగాక వారి ముఖ్యములగు రాజలాంఛనములను తాము స్వీకరించి ఆ రాజ్యమును తాము లోబరచుకొన్నట్లు ప్రకటించుకొందురు. అందుచే రాజులు స్వయముగ యుద్ధములో పాల్గొనునపుడు తమ మృతదేహముల కిట్టి యవమానములు జరుగకుండ కాపాడుటకై తమ వెంటనే ప్రత్యేక రక్షకులమ ఉంచుకొందురు. ఈ సందర్భంలో కుసుమాయుధునికి, అట్టి రక్షకుడుగ తన పెద్దకొడుకైన గొణగయ్యయే ఆయాపదలో శరీరమునుండి శిరమును, రాజలాంఛనమగు రణమర్దకంఠియను కాపాడెను. వెంటనే తానా కణ్ఠియను ధరించి రాజపదవిని స్వీకరించి అదే యుద్ధ రంగమున శత్రువును పారద్రోలి విజయలక్ష్మిని సంపాదించి ముదుగొండ రాజ్యమును నిలబెట్టగలిగెను. దీనికంతకు చాళుక్య భీముని రక్షించుట గూడ ప్రధానమైనది గనుక అతని సేవలు ప్రక్కనే సహాయముగ నిలబడినవని వేరే చెప్పనక్కరలేదు. తన తండ్రి నిహతుడైనను గొణగయ్య రాష్ట్ర కూట చక్రవర్తియగు కృష్ణరాజును తరుమగొట్టి తన రాజ్యమును

వేంగి రాజ్యమును కాపాడుట కొద్దిపాటి విషయము కాదు చాళుక్య భీమునకు చేసిన ఈ మేలునకు ప్రతిఫలముగ వేంగి రాజ్యములో గొణగయ్య గౌరవ ప్రతిపత్తులు ఇనుమడించెను. కొరవి శాసనములో మొదటి భాగమునగల చరిత్ర యిది.

కొంతకాలము గడిచినది. సుమారు ముప్పది సంవత్సముల తర్వాత మొదటి భీముడు గతించెను. అతని పుత్రుడు కొల్లభిగణ్డ విజయాదిత్యుడు కొద్దికాలమేలెను. ఇతని పుత్రుడు మొదటి అమ్మరాజు వేంగికి రాజయ్యెను. అతడు కూడ ఆఱేడు సంవత్సరములు రాజ్యము చేసి గతించిన పిమ్మట దాయాదులలో కలహమువచ్చి వేంగి రాజ్యమును యుద్ధమల్లుని వంశ్యులగు తాడప, అతని కొడుకు రెండవ యుద్ధమల్లుడు చేజిక్కించుకొని యేడు సంవత్సరాలు రాజ్యము చేసిరి. క్రీ. 934లో మరల అమ్మరాజు వంశమునకు చెందినవారు తిరుగబడిరి. అమ్మరాజు సవతి తమ్ముడగు రెండవ భీముడు యుద్ధమల్లుని కడతేర్చి రాజ్యము చేజిక్కించుకొనెను. ఇట్టి అనిశ్చిత పరిస్థితిలో ముదుగొండ రాజగు గొణగయ్య కెవరిని చేబట్టి వేంగితో తనకు గల సంబంధమును నిలబెట్టు కోవలెనో తోచలేదు. రెండవ యుద్ధమల్లునికి రాష్ట్ర కూట చక్రవర్తియగు నాలుగవ గోవిందుని అండదండలు గట్టిగా నున్నవి. కాని యుద్ధమల్లుడు రాజ్యార్హుడు కాదని గొణగయ్య భావించెను. మొదటి అమ్మరాజు కొడుకు బేత విజయాదిత్యుడు పిఠాపురము పారిపోయెను. అతని దృష్టిలో దేశము విడిచి పారిపోయిన అమ్మరాజు పుత్రుడగు ఈ విజయాదిత్యుడే న్యాయమైన రాజు. కాని బలహీనుడగుటచే రాజ్యమును దక్కించుకొనలేకపోయెను. యుద్ధమల్లుని కడతేర్చి రాజ్యమును సంపాదించిన రెండవ భీమునితో ముందుగా తన వ్యతిరేకతను చూపి విరోధము తెచ్చుకొనెను. యుద్ధమల్లుని సహాయముకొఱకు వచ్చిన రాష్ట్ర కూట గోవిందుడు ముందుగా ముదుగొండ రాష్ట్రముపై బడెను. వేంగిలో తాను నమ్మిన బేతవిజయాదిత్యుడే పారిపోగా తనకు స్థానమే మాత్రము లేదని తలచి గోవిందుని ధాటికి ఆగలేక గొణగయ్య పొరుగున ఉన్న వేములవాడ చాళుక్యరాజైన రెండవ అరికేసరి యొద్ద శరణుజొచ్చెను. ఈలోగా అతని సోదరుడగు నిరవద్యుడు వేంగిలో రాజుగ నిలబడిన రెండవ భీముని ప్రాపుచేరి అతని బలముతో గోవిందునెదిర్చి తరిమివైచి ముదుగొండను తాను చేజిక్కించుకొనెను. కొద్ది వ్యవధిలోనే వేములవాడ రాజైన రెండవ అరికేసరి గోవిందుని పరిమార్చి అతని ప్రత్యర్థియగు మూడవ

అమోఘవర్షునికి రాష్ట్ర కూట రాజ్యమిప్పించెను.

క్రీస్తు 933-934 సంవత్సరములో వేంగి, ముదుగొండ, రాష్ట్రకూట రాజ్యములలో నింత కల్లోలము జరిగెను. మూడు రాజ్యములలోను రాజులు మారిరి. వేంగిలో యుద్ధమల్లుడుపోయి రెండవ భీముడు రాజయ్యెను. రాష్ట్ర కూటమునకు గోవిందుడుహతుడై మూడవ అమోఘవర్షుడు (బద్దెగుడు) రాజయ్యెను. మధ్యనున్న ముదుగొండలో గొణగయ్య పారిపోయి వేములవాడ చేరగా అతని తమ్ముడగు నిరవద్యుడు వేంగి రాజగు ఇమ్మడిభీముని ప్రాపుతో అధికారమును పొంది యీ కొరవి శాసనమును వేయించెను. ఆ సందర్భమున కొరవిలో తన యధికారము ప్రతిష్ఠించుచు అచటి స్థానిక నాయకుడైన నల్లమేడెయ కొడుకు పెద్దనను రావించి "నీవు నాకు చాలా సహాయమొనర్చితివి గనుక. దానికి ప్రతిఫలముగ నేదియైనను కోరుకొనుము ఇత్తును" అని యడిగినట్లు శాసనములో ఉన్నది. దానికి జవాబుగ పెద్దన సవినయంగా "నీ సంపద యంతయు నాకున్నట్లే గనుక వేడుకొనవలసిన దేదియులే"దనును. అంతేగాక "కొరవిసీమ ముదుగొండ సలుకులదే" అని చెప్పి విరమించును. అంటే ఆ వంశము వారెవరైనను తాను వారికి విధేయుడగనే యుందునని స్థానిక నాయకునిచే వాగ్దానము చేయించుకొని అన్నయగు గొణగయ్య రాజ్యమందున్న కొరవికి తానే యధికారి ననిపించుకొనును. అన్నగారిదివరలో కొరవి ప్రజల నుండి ఆ నాయకునకిచ్చిన ఆదాయము లేవిగలవో అవి యన్నియు మరల తాను కూడ నిరవద్యుడు స్థిరపఱచును. ఇది రెండవ భాగములోని చరిత్ర. ఇది చాలా చిక్కులతో గూడియున్నది. కనుకనే చరిత్ర పరిశోధకులకు గూడ సరిగా బోధపడుట లేదు. రెండు పెద్ద రాజ్యముల మధ్య జరిగిన పోరాటములో మధ్యనున్న చిన్న రాజ్యము పడిన యిక్కట్లు, ఆ సందర్భంలో ఈ చిన్న రాజ్యమును దక్కించుకొనిన నిరవద్యుడు తన యధికారమును స్థాపించుకొనుటను తెలుపుటకై వేయించిన శాసనమిది. చాళుక్య మొదటి భీముని పట్టాభిషేక వృత్తాంతముతో ప్రారంభమై రెండవ భీముని పట్టాభిషేకముతోనంతమగుచున్నది. అందువలన ఏ భీముడు శాసనములో చెప్పబడుచున్నది. వ్యక్తముగాక పరిశోధకులు సందేహపడుచుండిరి. గొణగయ్య, అతని తమ్ముడు నిరవద్యులలో ఎవరి కథ యెంతవఱకో తెలియక కొంత సందేహము. శాసన మసంపూర్తియగుటచే కొంత కష్టము. భాష విషయములో మొదటి రెండు

భాగములలోను కష్టము కనిపించదు. మూడవ భాగమున దండనములు విధించు సందర్భంలోనే కొన్ని పదములర్థము కావు.

ఈ ముదుగొండ సల్కుల శాసనములు వేరే రెండు తామ్రపట్టికలు గలవు. కాని వాటిలో కేవలము వంశవృక్షములు మాత్ర మొసఁగబడినవి. రాజకీయాంశము లెవ్వియు తెలుపబడలేదు. ఇదియే ఆ రాజులకు సంబంధించిన క్లిష్టమగు రాజకీయా లను తెలుపుచున్నది. శాసనమును రచించుటలో జూపిన నేర్పును చెప్పదలచిన విషయములను సుబోధమగునట్లు వ్రాయజాలక పోయెననిపించును. ఆనాడు వారి దృష్టిలో రాజకీయ విషయములన్ని పరిచితములై యుండినవే గనుక వారికి ఈ రచన చక్కగానే అర్థమగుచుండెడిదని భావించవలెను. మనమిప్పుడు ఆ రాజకీయాల లోని విశేషాంశాలను వేఱే ఆధారముల ద్వారా కనుగొనవలసి యుండుటచే కష్టముగా నున్నది.

శాసన మూలము

పెద్దరాయి - మొదటివైపు

1. శ్రీ విక్రమాదిత్య నృపా
2. గ్రతనయుణ్డయ్న చాలుక్య
3. భీమునకు శౌచకన్దర్పఁ
4. నకువే (ఏ) గీశ్వరునకు రన
5. మర్ధఁ (ర్ధాఁ) న్వయ కులతిలకు
6. ణ్డయ్న కుసుమాయుధుణ్డు గ
7. న్నర బల్లహుని కస్త ప్రాప్త
8. (౦) బయ్న రనమర్ధఁ (ర్దఁ) కణ్థియం దన
9. భుజవీయ్య (ఁ) బలపరాక్ర
10. మంబున న్దెచ్చి కణ్థియం గట్టి
11. పట్టం బెత్తి ఖఙ్గసహాయు
12. ణ్ణె నేల యెల్లం గావంబు (బూ)ని
13. మంచి కొణ్డ నాణ్డా దిగ
14. వేంగి దేసము విష్నువ

15. ర్ద్ధ (ర్ధ) నుతో నర్ద రాజ్యంబుసే
16. యు చున్న కుసుమాయుధు పె
17. ద్ద కొడు కనేక రిపు నృపతి
18. మణిమకుట మకరికా
19. కషణ మృశృ (సృ)ణిత చ (రణ*)

పెద్దరాయి - రెండవ వైపు

(ఈ క్రింది రెండు వైపులలో నేది రెండవదో ఏది మూడవదో చెప్పవీలు గాకున్నది)

1. గల కలావర్తంబు రా
2. జ్యంబు సేయుచు నిష్ఠ (ష్ట)వి
3. షయ కామ భోగంబుల
4. ను భవించు చు సుఖంబు
5. ణ్డి యొక్క నాణ్డు కొరవి నల్ల
6. మే ఱె య కొడుకు పెద్దన
7. రావించి నీవు నాప్రాణ స
8. మానుణ్డ వైన చెలివి నీ
9. చేసిన యుపకారంబు నా
10. కు బ్రత్యుప కారంబు సేయ
11. వలయుం గాన నీకేమి వ
12. లయుం దాని వే
13. ణ్డి కొమ్మన్న నీ
14. శ్రీ నాకెల్లం గలదేమిలే
15. కున్న వేణ్డి కొణ్డు మయ్న
16. ంబరోపకారంబు పొణ్డె నా
17. ని కొరవి యన్నది ముదు
18. గొణ్డ సల్కుల కులసన్త

పెద్దరాయి – మూడవ వైపు

1. స(టా) నెగల్ల శ్రీనిరవ
2. ద్యుణ్ణ నేక సమర సంఘ
3. ట్టణ భుజాసి భాసురు
4. ణ్ణై తమ యన్న రాజ్య శ్రీ
5. కెల్ల న్దాన యరు హూణ్ణై
6. చేకొని నిల్చి భీమసలు
7. కి యన్ద నేక వస్తు వా
8. హనోత్సవంబు ల్వడ యు
9. చు తమ యన్న గొణంగయ్య
10. చేసిన ధర్మ్మువులు నస
11. ంబును నెగల్పను గావను
12. రక్షింపను వలయునని
13. చేకొని కొరవికిచ్చిన
14. స్తితి సల్పి శిలాస్థ (స్త) మ్భ
15. ంబు ప్రతిష్ఠి (ష్ఠి)ంచి భీమేశ్వ
16. రంబును నాతని కొట్పించి
17. న చెఱువులు మఱియు మె
18. వ్వి యేని నాతని చా(చే) యంబడి
19. (న) ధర్మ్మువుల (న్దీ అ...)

మొదటిరాయి – నాలుగవ వైపు

1. ముక్కు దఱిగినను చఱి
2. చినను చురియ వెఱికిన
3. ను ముట్చి లినను అంక్కాడి
4. నను ఇరువాద్యది ఏను
5. ద్రమ్మలు మాణిసి చేసిన
6. దోసంబునకు వాని జీవిత

7. ం ఒ దణ్డువు వరియా ర (ంఒ)
8. ంబు పదవరంబు, వెల్లార
9. ంబంబు ఎరగద్యాణంబు పె
10. **రామణి** పున్నమ నాణ్డు ఏ
11. నూరు ద్రమ్మలరివె
12. ట్టి సుఖంబు మనువ (వా) రు (।*)
13. నాయకుణ్డెయ్ను (న) కాంపులయ్ను
14. వెఱ రాజులంజొచ్చి మ
15. నా(ం) జనదు యీా స్తితి యడి
16. సి కొన్న రాజుల్గ ల రేని
17. యు యీా స్తితి యడిసిన కవ
18. నాపకు ఇన్దు మన్న కంపు

చిన్నరాయి - మొదటివైపు

1. ...ఱు నన్దమ యమ్మక (ట్టి)
2. న ప ట్టంబు గావం బూని (ధు)
3. రదెడె రాముణ్డె తనచే
4. తివాల తోడుగా ననుంగు
5. గొఱంగణ్డను పేరితో జ
6. లుక్య భీమణ్డు న్ద ను

చిన్నరాయి - రెండవ వైపు

1. గాల(ం)బున......
2. కాన్తరిత్తుణ్డె చనిన నా
3. తని తమ్ముణ్డు సకలలో
4. కాశ్రయ, మణికణ (న) కము
5. క్తాలంకార చలుక్య కు(లో)
6. ధ్భవ సితగ చఱక్క బీ

చిన్నరాయి - మూడవ వైపు

1. ఇచ్చిన స్తితియు పఱియ (ద)
2. యు (ం) బోయు వెఱెయంబు జి
3. ట్టరి యెల్ల న్దక్కి చా బొడి
4. చిన మాట యిరువది ద్ర
5. మ్మలు మనం బొడిచిన
6. నఋవది ద్రమ్మలు
7. అక్కసలకు క ఱ కు (ం) లి
8. లేదు.

చిన్నరాయి - నాలుగవ వైపు

1. మహీపతి వంశ జాశ్చపా
2. పాదపేత మనసో భువి భూ
3. రిభూపా ఏ (యే) పాల యన్తిమ
4. మధమ్మ్ర్గ మిమం సమస్తం
5. తేషా(ం) మయా విరచి తోంజలి రేష
6. మూర్ధ్నీ (ర్ధ్నీ) (॥*) చన్ది (సన్ధి) విగ్రహిచాము (ం*)
7. ఱెయప్ర (ప్రా)లు.

కొరవి శాసనములోని భాషా విశేషములు

ఇది క్రీ. 935 నాటి దగుటచే ఇంచుమించు నన్నయభట్టు కాలమునకొక శతాబ్దము ముందుది. ఇప్పటికి పూర్వము తెలుగు శాసనములందు కనుపించు 'θ' అను అక్షరము పూర్తిగ అదృశ్యమైనదనవచ్చును. ఈ క్రింది పదములలో అది వాడపడలేదు.

	పూర్వము శాసనము	ఇప్పుడు కొరవి శాసనములో
వీరునθయ్య	(రాగిమడవనపల్ల)	తనయుణ్డయ్న
ధనంజయుదు	(కలమల్ల)	కుసుమాయుధుణ్డు
వాన్θు	(రామేశ్వరం)	వాణ్డు
సంయుక్తునθగున్	(అరకటవేముల)	(లో) కాన్తరితుణ్డె

ఖడ్గ అనుటకు ఖఙ్గ

మేడియ అనుటకు మేఱెయ

చళక్క అనుటచు   చ ఱిక్క (చాళుక్య)

నెగడ్పను   " నెగఙ్పను

క్రొప్పించి   " కొఱ్పించి

ప్రుచ్చిలిన   " ముఱ్చిలిన

చాముండెయ   " చాముంఱెయ

అక్రమ సంధులు:

1. చనుదు**యీస్తితి** యడిసిన - దీనిలో **యీ**

2. కలరేనియు యీ స్తితి యడిసిన " యీ

3. మఱియు **మెవ్వియేనినాతని** " మె అనునది వ్రాత పొరపాటు కావచ్చును. 'ఏని నాతని' యనుచోట 'ఏనిన్' ద్రుతాంతముగనున్నది. శబ్దరత్నాకరములో ఏని అని కళగా చూపి, ద్రుతాంతముకూడ మతాంతరమున జెప్పబడెను.

4. రాజుల్గలరేనియు " ఇచ్చట కళగానే యున్నది.

సంధి వివక్ష చేయకుండ వ్రాసినవి:

1. కవనాపకు ఇందుమన్న

2. ఱంకాడినను ఇరువాద్యది ఏనుద్రమ్ములు.

ఇంతవఱకు గల తెలుగు శాసనములలో 'ఐ' అను అక్షరము వాడుట అరుదు. దానికి బదులుగ 'అయి' అనునది వాడబడుచుండెడిది. కాని యీ శాసనమందు పదాంతములందు రెండు విధములుగను వాడబడెను. 'ఐన' అని 'న'పరముగ వ్రాయుచో 'అయిన' అని వ్రాయనుద్దేశించి 'అయ్న' అని వ్రాసెను.

తనయుణ్డయ్న, కులతిలకుణ్డయ్న, అస్త్రప్రాప్తంబయ్న, నాయకుణ్డెయ్న, అనుచోట రెండు విధములు కలిపి తప్పు వ్రాయబడింది. 'న'పరముగాని, కేవల 'ఐ' అనియే వ్రాయుచోట 'అయి' వ్రాయకుండ ఏత్వము క్రిందైత్వము వ్రాసెను. ఖఙ్గసహాయుణ్డై రాముణ్డై, (లో) కాన్తరితుణ్డై, భాసురుణ్డై, అరుహుణ్డై, 'సమానుణ్డవైన చెలివి' అనుచోట మాత్రము 'ఐన' అని కలదు.

(కడప జిల్లా అనిమెలలోని క్రీ. 976 నాటి వైదుంబ శాసనములో వర్షంబు 'ఐన' అని విడిగా 'ఐ' కారము కనిపించుచున్నది). ఈ కొరవి శాసనములో విశేషమేమన 'అయిన' అను రూపము లేదు. కాని 'అయ్న' అనేదే పై పదములలో కనిపించుచున్నది. అనగా ఉచ్చారణ సౌకర్యము కొఱకు యి లోని ఇ లోపించినదని అర్థము. ఈ లోపము సంస్కృతంలోను కనిపించును. సంస్కృతములో దీనిని ఉపధాలోపమని చెప్పుదురు. 'అథాప్యుపధాలోపో భవతి' అని నిరుక్తకారుడు వేదములో ఈ లోపమును జెప్పెను. 'అల్లోపో నః' అని పాణిని సూత్రము కూడ నిట్టి లోపమును గూర్చియే. (ఉదా: రాజన్ + ఇ = రాజ్న్ + ఇ = రాజ్ఞి; నామన్ + ఇ = నామ్న్+ ఇ = నామ్ని; అనగా ఇచట వరుసగ 'జ' కారము 'మ' కారము మీది 'అ' కారములు లోపించినవి. నూతన ⟶నూత్న; విద్యాధర⟶ విద్యాద్ర; ఇత్యాది సంస్కృత పదములు).

అట్లే 'వైదుంబ' పదము 'వయిదుంబ' అని కాని 'వయ్దుంబ' అని కాని అగును.

గారికి ⟶ గార్కి

పెఱుకు ⟶ పెఱ్కు ఇట్టివి అనేక పదులు శాసనములందు గానవచ్చును.

ఇపుడు ⟶ ఇప్డు మనకిపుడు వాడుకయందును గలవు.

చేసిన ⟶ చేశ్న

గాన ⟶ గ్నా

చదువు⟶ చదివిన అనిక్రాంత క్రియా విశేషణములలో 'ఇన'

చేయు ⟶ చేసిన తుదియందుండుట సామాన్యమైనను 'ఇ' లోపించుట

అగు ⟶ అయిన గమనించదగినది.

సంయుక్తాక్షరములను ఉచ్చారణ సౌలభ్యము కొఱకు విశ్లేషమొనర్చుట కొన్ని తావులందు గానవచ్చును. తెలుగు శాసనములందిది సాధారణము. నిఘంటువులో కొన్ని చేర్చబడెను.

'అర్హుణ్డై' అనుటకుగాను 'అరుహుణ్డై' వర్షఁబు అనునది వరుషంబు అను రూపములో అనేక శాసనములలో నున్నది. కాని నిఘంటువులో చేరలేదు.

దీర్ఘమును హ్రస్వముగను, హ్రస్వమును దీర్ఘముగను వ్రాయుట కూడా కలదు.

నీయుపకారంబునకు	-	నీ యుపకారంబు నాకు
నా సం(సం)బు....	-	న సంబు
మనువారు	-	మనువరు
కాంపు	-	కంపు
వ్రాలు	-	వ్రలు
మనంజనదు	-	మనాంజనదు.

వ్రాతలోని పొరపాట్లుగా జెప్పదగినవి కొన్ని గలవు.

రణమర్ద అనుటకు	-	రనమర్ధ (రెండు చోట్ల వాడెను)
విష్ణువర్ధనుతో	-	విష్ణువర్ధెనుతో
కలకాలవర్తంబు	-	కలకలావర్తంబు
వేణ్డికొన్డుము	-	వేణ్డికొణ్డుము
ప్రతిష్ఠించి	-	ప్రతిష్టించి
మఱియునెవ్వియేని	-	మఱియు మెవ్వియేని
మానిసి	-	మాణిసి

గొణంగణ్డు - భీమణ్డు

ఇచట 'గొణంగ' 'భీమ' అనునవి ప్రాతిపదికలు. 'పుంలిఙ్గంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు' - (బాలవ్యా. తత్సమ-సూ. 21) అను సూత్రము ననుసరించి గొణంగుణ్డు, భీముణ్డు అని రూపములు కావలెను, రాముణ్డు- నలె. 'మల్ల' శబ్దమునకు మల్లుందు, మల్లందు అని వైకల్పికముగా ఉత్వము గలదు. 'రంగ' శబ్దమునకు 'రంగండు' అని ఉత్వములేని రూపమే కాని 'రంగుండు' అని వ్యవహారమందు అంతగా కానరాదు కనుక పై సూత్రము వ్యవస్థిత విభాషయని తెలియుచున్నది. ప్రత్యయమైన 'దుఙ్'లోని 'ఉ' కారోచ్చారణ సౌలభ్యము కొఱకేర్పడినది గానే ప్రాతిపదికలోని 'అ' కారమును ఉత్వనిధియని తోచును. అంటే కొన్ని చోట్ల సారూప్యమును బట్టి పూర్వోచ్చారణ పరవర్ణము మీదికి కూడా జారును. ముకుట, రాముదు, భీముదు ఇత్యాదులలో వైరూపమును బట్టి కూడ ఉచ్చారణ మారుట గలదు. మకుట, పురిస, భీమణు, గొణంగణ్డు ఇత్యాదులు. ఇట్టి మార్పులు భాషాశాస్త్రములోని తీరులని చెప్పెదరు. వ్యాకరణ సూత్రములు లేని నాటి

ప్రయోగములగు భీమణ్డు, గొణంగణు అను పదములు మనకిచట గలవు ఇట్టివియే మఱికొన్ని ప్రయోగములానాటి శాసనములందు బహుళముగ గాన్పించును శకము 1042 (క్రీ. 1120) నాటిదగు మాటేడు శాసనములో నిట్టి పదములనేకములు గలవు.

1. కోటమల్లడింద్రాచల ధీరుండై
2. కీచక వైరి విక్రముండు కిల్బిష దూరుండు **రామండును**
3. మహేంద్రాచల ధీరుండ**ప్పండు**
4. భటాగ్రణి **రేవండు**
5. దాని దండి యీ నాచండు
6. మన్య **దేవండనం** గీర్తి మహిమన్
7. కీర్తులు దనరి **వెలుంగ మల్లండన** ధాత్రివీథులనెల్ల బరగె
8. గరిడియా బల **మల్లండన**

గూడురు శాసనములో వెన్నుడు, వెన్నడు, సూరదు అను ప్రయోగములు కలవు.

కనుక అర్వాచీనమగు బాలవ్యాకరణ సూత్రవిధి నిత్యముగాక వ్యవస్థితి విభాషగ వర్తించునని చెప్పవలెను.

అచ్చ తెలుగు పదప్రయోగములు చేయుట కూడ నిందు కానవచ్చును.

నేల యెల్లంగావంబూని – 'పృథ్వీరాజ్యం సేయుచు' అని ఆనాడు బహుళముగా వాడుకలో నున్నను తెలుగులోనే వ్రాసెను. శ్రీ విక్రమాదిత్యనృపాగ్రత నయుడని మొదట వాడినను తర్వాత కుసుమాదిత్యుని పెద్దకొడుకు అని తెలుగులో వ్రాసెను. చేతివాల తోడుగా – 'కరవాల' పదమును వాడుక మిశ్రసమాసమైనను దీనిని వాడెను. కలకాలవర్తంబు – ఆ చంద్రార్క్క స్థాయిగానని వ్రాయలేదు.

సంస్కృత దీర్ఘ సమాసములు : రిపునృపతి మణిమకుట మకరికాకషణ మశృ (సృ)ణిత చరణ (యుగలుణ్డె) సకలలోకాశ్రయ, మణికనక ముక్తాలంకార, చలుక్యకులోద్భవ, సితగచతిక్కభీ (మ–) అనేక సమర సంఘట్ట భుజాసి భాసురుణ్డు.

విభక్తి ప్రత్యయములు:

ప్రథమలో – డు, ము, వు, లు అన్నియు కనుపించును. నాణ్డు, దణ్డువు, దేశము, భోగంబులు, ధర్మువులు

ద్వితీయలో	– 'న్' మాత్రమే వాడబడెను.
తృతీయ	– 'నన్' (పరాక్రమంబునన్), తోన్.
చతుర్థి	– పొంటె (పరోపకారంబు పొంటె)
పంచమి	– అన్దు (భీమసలుకి యన్దనేక వస్తువాహనోత్సవంబు ల్వదయుచు)
షష్ఠి	– కి, కు, ని.
సప్తమి	– అన్దు (సలుకియన్దు) పంచమ్యర్థములో

దీనినిబట్టి అన్ని విభక్తులలోను రచన చేయుచుండెడి వారని తెలియుచున్నది. రేనాటి చోళుల శాసనములకంటె కొంత మెఋగేకదా!

ప్రథమావిభక్తి ప్రత్యయములో మరియొక విశేషము. 'ఇచ్చిన స్తితియు' అని 'స్తితి' అనే ఇకారాంత తత్సమముపై గూడ 'ఉ' చేర్చి యదాగమ సహితముగా వ్రాయబడింది. ఈ 'యు' సముచ్చ యార్థములో అనగా 'కూడ' అనే అర్థమునందుగాక 'ఉ'కార ప్రత్యయముతో నేర్పడిన ప్రథమాంతమేనని చెప్పవలెను. ఇట్టి రూపములు వేరే తావులందు 'చేసిన పనియు', 'కట్టించిన గుడియు', అని చెప్పు చిన్న శాసనము లందు కూడ కనుపించును. తరువాత దానికి క్రమముగా లోపము వచ్చినది. దీనిని బట్టి ప్రథమావిభక్తి ప్రత్యయము 'ఉ' మాత్రమేనని తోచును. డ్, వ్, మ్, అనునవి ఆగమ విశేషములు కావచ్చును. గళ్, ల్ (ద్రవిడ భాష నుండి) అనేది బహువచనంలోని ప్రత్యయమని నిశ్చయించిరి. ప్రాకృతమునందు 'అత ఓత్ సోః' అనే సూత్రమును బట్టి అకారాన్త ప్రాతిపదికలకు 'ఓ' ప్రథమైకవచన ప్రత్యయముగా విధింపబడెను. కాని యిది కూడ అ+ఉ=ఓ యేర్పడిన పిదప 'అ'కు లోపమును చెప్పుచు చేయబడిన విధి యనిపించును.

వత్స+ఓ అని 'ఓ' కారమును విధించి 'త్స'లోని 'అ'కారమునకు లోపము చెప్పుదురు. అప్పుడు వత్స్+ ఓ = 'వచ్ఛో' అను రూపమేర్పడును. కాని దీనికి 'ఓ' ప్రత్యయమునకు 'ఉ' మూలమనుట యుక్తమని తోచును. పై జెప్పినట్లు వత్స+ఉ=వచ్ఛో, వృషభ+ఉ=వసహో; పురుష+ఉ= పురిసో ఇత్యాదులు 'ఉ' ప్రత్యయము తోటే సిద్ధించుచున్నవిగదా! తెలుగుకి కూడ అట్లే 'ఉ' ప్రత్యయమే ముఖ్యమైనది. 'డ్, మ్, వ్,లు ఏకవచన మందును 'ల్' బహువచనమందును ఆగమములగ వచ్చి చేరినవి.

గురువు, వధువు - ఇత్యాదులలో 'వ్' ఆగమము. అట్లే ప్రస్తుత ఇకారాన్త ప్రాతిపదికలకు 'య్' ఆగమము చేరగా, స్తితియు, పనియు, గుడియు అను రూపములేర్పడును.

కారక విశేషములు:

అతని కొఱ్ఱించిన చెఱువులు	:	'అతడు' అని ప్రథమాంతమునకు బదులు షష్ఠి వాడబడెను. 'నా యొనర్పబూనిన' వంటిది.
అతని చేయంబడిన ధర్మువులు నీచేసిన యుపకారంబునకు	:	'ఆతనిచే చేయంబడిన' అనుటకు బదులు తృతీయకు లోపముగాని, లేక తృతీయార్థమున షష్ఠిగాని చెప్పబడెను.
భీమసలుకి యన్దనేక వస్తు వాహనం బల్వడయుచు	:	ఇచట 'వలనన్' అని పంచమికి బదులు 'అందు' అని సప్తమి వాడబడెను.

విశేష పదములు:

1. ధురదెడె - 'తమయమ్మ గట్టిన పట్టంబు గావంబూని' ధురదెడె రాముణ్డై' అని ప్రయోగమున్నది. అర్థము తెలియదు.
2. సితగచఱక్క - 'చాలుక్యకులోద్భవ సితగచఱక్క' భీ అని యున్నది చఱక్క=చళక= చారెక్య : సితగ శీతగు - చల్లని కిరణములు గలవాడు (చంద్రుడు), ఇట్టి యర్థము చెప్పినను సరిపోవుట లేదు.
3. సటానెగల్ల - ఈ పదము నిరవద్యునికి విశేషణముగ జెప్పబడెను. బిరుదము.
4. నసంబు - నాశంబు
5. నెగఱ్పును - (నెగడు=వృద్ధి నొందు) అభివృద్ధి గావించుట.
6. కొఱ్ఱించిన - క్రొప్పించిన = త్రవ్వించిన: వ్రటచిన⟶వఱ్చిన⟶వ్రచ్చిన (=చెఱచిన), అనురూపములవలె. క్వొచె⟶ కొఱ్చె⟶ క్రొచ్చె⟶ (గ్రొచ్చు అని శబ్ద రత్నాకరము) 'ఱ' అను అక్షరము ముందున్న అక్షరములో క్రారముగను (◡) తరువాతి

అక్షరములో దాని ద్విత్వముగను మారుట పలుతావులందు కాననగును.

7. ముఱ్చిలిన - ముచ్చిలిన-దొంగిలించిన

8. పఱియ దయుంబోయు వెరెయంబు - అర్థమగుటలేదు. (వెరెయంబు=వ్రయము అగునేమో)

9. జిట్టరి -

10. కఱకూలి - అక్కసలకు **కఱకూలిలేదు**. ఈ పదము ఉప్పునూతుల శాసనమందు కూడ కలదు. అచట కఱ్ఱకూలి సర్వబాధాపరిహారము చేయబడెను. వడ్రంగులకిచ్చెడి కూలి మీద విధించు వృత్తి పన్ను మన్నించుట కావచ్చును.

11. (మాణిసి) మానిసి - భటుడు

12. పడవరంబు - 'తోంటళాయు పడువారంబు ఇచ్చిరి' అని జయసింఘ వల్లభుని విప్లఌ శాసనమందు కలదు. (S I VI-584) వరియారంబము కారుకు ధాన్యరూపమగు (Tax in kind) సిద్ధాయము. వెల్లారంబమునకు ఎర గద్యాణము (అరగద్యాణము?) పన్ను-ఊరి మొత్తమున 500 ద్రమ్మలు అరి

(1) పడువారంబు రైతులు విడిగా

(2) ఎరగద్యాణము చెల్లించవలసిన పన్నులు.

(3) 500 ద్రమ్మలు అరి రాజుకు చెల్లించవలసిన ఉమ్మడి కానుక

13. వరియారంబంబు-పరివిత్తులు చల్లుకారు

14. నెల్లారంబంబు- మెట్టగింజలు చల్లుకారు

15. పేరామణిపున్నమ - ఆ మణి = వసంతము - వైశాఖ పున్నమి?

16. కవనాప - ద్రోహి యనెడి నిందావాచకముగ వాడబడినది

17. ఇన్దుమన్న - కవనాపకు ఇన్దుమన్నకాంపు 'అని ప్రయోగము పై వాక్యమును బట్టి ఈ స్థితిని లేక మర్యాదను (కట్టుబాటును) చెడగొట్టిన ద్రోహులకు' 'ఇత్తుము అన్న కాంపు.....' అని చెప్పవలెనేమో. కాని ఇన్దు నివసించు కాంపు అని చెప్పుటయే బాగుండును.

18. చాబొడిచిన - చావన్ పొడిచిన = చావఁబొడిచిన (చావఁగొట్టిన) అని యుండవలెను. 'వ'కారలోపమిందు కానవచ్చుచున్నది.

19. కాంపు - 'గృహస్థుడు' 'రక్షకుడు' 'కాపాడువాడు' అను నర్థములు. ఈ పదమును ఊరికాంపు. పల్లెకాంపు. పసుల కాంపు, దివ్వెకాంపు, పొలంకాఁపు అను ప్రయోగములలో కనుపించును. వ్యవసాయదారు అను నర్థములో సామాన్యముగా వాడబడుచున్నది. విజయనగర రాజుల శాసనములందు కూడ 'కాంపు' అని కలదు.

ఈ శాసనములో ఈ స్థితి యడిసిన కవనాపకు ఇందుమంన్న కాంపు... అని వాక్యము నష్టమై అసంపూర్తిగ నున్నది. కనుక 'ఇందుమన్న' అను పదము పైన జెప్పినట్లు 'ఇచ్చెదము అన్న కాంపు' అనే అర్థము చెప్పవలెనో లేక 'ఇందు (ఈ గ్రామమునందు) మనెడి (నివసించెడు, మనుట = నివసించుట) కాంపు.... అని చెప్పవలెనో తెలియదు. ఇచ్చెదమను అర్థములో 'ఇన్దుము' అనుట సాధువు కాదు. కనుక రెండవ అర్థమునే గ్రహించవలయును. ఏనూరు ద్రమ్మలరివెట్టి సుఖంబుమనువారు అనే ప్రయోగమిందే కానవచ్చుచున్నది. అట్టే 'మనంజనదు'. 'నాయకున్లైన, కాంపులయ్న వెఱరాజు లంజొచ్చి మనంజనదు' నిరవద్యుడీ వాక్యములో క్రొత్తగా తన యధికారమును స్థాపించుచు ప్రజలను శాసించుట తెలియుచున్నది. ఇచట నాయకులైనను, కాపులైనను తననుగాక శత్రురాజుల పాలికి జనకూడదు. నాయకులనగా దండనాయకాది ఉద్యోగులుగాని, సంఘనాయకులుగాని కావచ్చును నాయక పదము క్రమముగా నాయుడు అని మార్పునొందెనని తెలియుచున్నది. సింగమ నాయకుడు - సింగమ నాయుడు; అనపోత నాయకుడు - అనపోత నాయుడు; మాధవనాయకుడు - మాదానాయకుడు, మాదానేడు అనే మార్పులు పేర్లలో కనిపించును. కాంపులనగా నాయకులుగాక ఇతర ప్రజలని చెప్పవచ్చును.

20. ఎల్లన్ (=సమస్తము) అను నవ్యయము మూడు చోట్ల వాడబడెను.

తనయన్న శ్రీకెల్లన్దాన యరుహుణ్డై
నీ శ్రీనాకెల్లం గలదు.
జిట్టరి యెల్లన్దక్కి

రచనావిశేషములు:

కొరవిసీమయందు నిరవద్యుడు సంపాదించుకొనిన యధికారము పెనుగాలివంటి అప్పటి రాజకీయ వాతావరణములో తనకొక గొప్ప విజయమే. అట్టి విజయమునకు తను ఆశ్రయించిన చాళుక్య రెండవ భీముదు యుద్ధమల్లుని జంపి వేంగిలో స్థిరపడుటయే కారణము. కనుక నిరవద్యుడు కొరవి యందు దీనినొక విజయ శాసనముగ స్థాపించెను. రెండవ ముక్క యిదేవిధమగు వేరొక శాసనఖండమనిపించు చున్నది. అయినచో రెండు విజయశాసనముల నతడిచట స్థాపించవలెను. రాజులు పూర్వము ఇట్టి విజయశాసనములను మిగిలిన శాసనములకంటె ఘనముగా వ్రాయించుకొనుట ఆచారము. కనుక ఈ కొరవి శాసనము చక్కని భాషలోను, శైలిలోను రచింపబడి తెలుగు భాషలో నొక మలుపును సూచించును అంటే అప్పటివరకు ఉన్న శాసనాలు చాలా తప్పులతోను ఉచ్చారణ లోపములతోను ఉండెడివి పైన జెప్పిన వేల్పుచెర్ల శాసనము చూడండి, చెప్పదలచిన విషయము నెంత కష్టముతో రచించెనో, ఎంత దుర్బోధముగ నున్నదో, రెండు మూడు శతాబ్దులు గడిచిన తరువాత భాష యెట్టి యభివృద్ధి గాంచెనో యిందు కనపడును. అందలి రాజకీయాంశములు దుర్గ్రాహ్యముగ నుండుటయు, శాసనము కొంత శిథిలమగుటయు, ఆ భాషలోని ప్రయోగములు కొన్ని మనకిప్పుడు పరిచితములుగాకుండుటయు, కారణమున మనకా రచన యింకను పూర్తిగా అర్థమగుటలేదు. అప్పటికి కన్నడములో కావ్యరచన ప్రారంభమైనది. పది సంవత్సరములలో పంపకవి, ప్రక్కనున్న వేములవాడలో, విక్రమార్జున విజయమనబడు కన్నడ భారతమును వెలువరింప నున్నాడు. తెలుగున పద్యరచన కూడ శాసనములందు కానవచ్చుచున్నది. మన కొరవి శాసనము కూడ కవిత్వముతోనే మొదలగుచున్నదని చెప్పబడుచున్నది. ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు ఈ క్రింది పంక్తులను ప్రస్తరించి చూపిరి.

(1) శ్రీ విక్రమాదిత్య- నృపాగ్ర తనయుడైన
చాళుక్య భీమునకు - శౌచ కందర్పునకు
వేగీశ్వరునకు - రణమర్ధాన్వయ కులతిల
కుండైన కుసుమాయు-ధుండు గన్నరబల్ల
హుని కస్త్రప్తంబై - న రణమర్దకణ్ఠి
యందన భుజవీర్యబల-పరాక్రమమున దెచ్చి
కణ్ఠియంగట్టి పట్టంబెత్తి ఖడ్గ

ఈ యేడు పాదములందును ఐదేసి మాత్రలుగల నాలుగేసి గణములున్నవి. కావున ద్విరదగతి రగడ పాదములుగా గనవచ్చును. మూడుపాదములలో యతి సరిపోయినది. ఆద్యంత ప్రాసములు లేవు.

(2) కొరవి నల్లమేఱెయ - కొడుకు పెద్దన్న (న)
రావించి నీవునా - ప్రాణసమాను

ఇవి యతి కూడ సరిపడిన ద్విపద పాదములు. ప్రాసలేదు.

(3) శ్రీకెల్లఁదాన యరుహుఁడై చేకొని
నిల్చి భీమసలుకి యందనేక

సీసపాదము యతిలేదు.

(ప్రాఙ్నన్నయ యుగము, పుట. 357)

వచన రచన కూడ చాలా సొంపుగ నుండును.

(1) "పట్టంబెత్తి ఖడ్గ సహాయుండై నేలయెల్లం గావంబూని మంచి కొణ్డనాణ్డాదిగ వేంగిదేశము విష్ణువర్ధనుతో నర్ధరాజ్యంబ సేయుచున్న, కుసుమాయుధు పెద్దకొడుకనేక రిపునృపతి మణిమకుట మకరికా కషణ మసృణిత చరణ".

(2) తమ యమ్మకట్టిన పట్టంబు కావంబూని (ధర దెడి రాముణ్డె తనచేతి వాలతోడుగా..."

(3) "కలకాల వర్తంబు రాజ్యంబు సేయుచు
నిష్టవిషయ భోగంబు లనుభవించుచు
సుఖంబుణ్డి యొక్క నాణ్డు....."

(4) "నీ శ్రీనాకెల్లం గలదేమి లేకున్న వేణ్డకొన్దు
మయ్నం బరోపకారంబు పొణ్డనాని.........."

(5) తమయన్న రాజ్యశ్రీకెల్లన్దాన యరుహున్డై చేకొని నిల్చి భీమపలుకి యన్దనేక వస్తు వాహనోత్సవంబు ల్వడయుచు."

ఈ విధముగ శాసనమంతయు మృదుమధురముగ నన్నయభట్టు రచనా మాధుర్యము వందయేండ్లకు ముందే కలదని నిరూపించుచుండెను. సంస్కృత పదములను సమాసములను తెలుగులో వలసినంతగా వాడుట యీ రచన యందలి విశేషము. తెలుగు పదములు గూడ నట్లే వాడబడెను. ఇందలి పదప్రయోగములను బట్టియే నన్నయ ఆంధ్రశబ్దానుశాసన మొనర్చెనాయనిపించును. 'ప్రయోగశరణా వైయాకరణాః' అని కదా పండితోక్తి. కాని నన్నయ దీనిలోని ప్రయోగములన్నింటిని స్వీకరింపవలేదనియే చెప్పవలెను. తననాటికింకా వచ్చిన మార్పులను, తన సొంతమును, కన్నడ సంప్రదాయమును కూడ దృష్టియందుంచుకొని తను వ్యాకరణము రచించెను. క్రీస్తు 935 నాటికి తెలుగు భాష కావ్యరచనకు తగిన చక్కని రూపుదిద్దు కొన్నదనుటలో సందియము లేదు.

ఈ విధముగ కొరవి శాసనము తెలుగుదేశ చరిత్రలోను భాషలోను అనేక నూతన విషయములను మనకు తెలుపుచున్నది. కొరవి శాసనము 'కొఱవి' వలె ఆఱదు, వెలుగదు అని తీరని సమస్యగా పరిశోధకులు పరిహాసముగా చెప్పుదురు. చరిత్రలోను, భాషలోను దాని నింకను పరిశోధించవలసి యున్నదని భావము. ఇంతకు అది సాధురేపతో గూడిన 'కొరవి'; శకటరేఫతో కూడిన కొఱవికాదు.

అప్పటికొన్ని సాంఘికాచారములు - ఆర్థిక విధానము

ఈ కొరవి శాసనములో జెప్పబడిన రాజకీయాంశములు, భాషావిశేషములు ఎంత దురవగాహముగనున్నవో దానిలో చెప్పబడిన సాంఘిక విషయాలు కూడ నట్లేయున్నవి. అందు మొదటిది యుద్ధములందలి అలవాటును గూర్చి పైన జెప్పితిమి. అంటే యుద్ధములో ప్రధాన నాయకుడుగాని, రాజుగాని చనిపోయినపుడు వారి పక్షము వారాతని శిరస్సును వెంటనే మృతదేహము నుండి కోసుకొనిపోదురు. లేనిచో శత్రువు లాశిరమును అవమానపఱచుచు ఊరేగించెదరు. గొణగయ్య తన తండ్రియగు

కుసుమాయుధుని శిరస్సును అతని మెడలోని వారి రాజలాంఛనమగు రణమర్దకణ్ఠియను అట్లు తెచ్చుకొనును. కొన్ని నేరముల సందర్భమున ప్రజలపై దణ్డనములు విధించబడినవి. వాటిలో మొదటిది పఱియదయుంబోయు వెరెయంబు, జిట్టరి యెల్లన్దక్కి అనే భాగము అర్థమగుటలేదు.

(2) చాబొడిచిన నూటయరువది ద్రమ్మలు - హత్య చేసిన నేరమునకు 120 ద్రమ్మలు దణ్డువు

(3) మనం బొడిచిన నఱువదిద్రమ్మలు - ప్రాణము తీయకుండ హత్య ప్రయత్నము చేసిన వారికి 60 ద్రమ్మలు దణ్డువు.

(4) అక్కసలకు కఱకూలిలేదు - ఇచట సందర్భము తెలియదు కాని అగసాలురకు కఱకూలి (?)లేదు. వారికివ్వవలసిన మామూలు వృత్తిసుంకము లేదని యర్థమేమో.

(5) ముక్కుదఱిగినను - ముక్కుకోయుట, ఆనాటి దుర్మార్గములలోనిది యొకటి కావచ్చును.

(6) చఱిచినను - చేతితో కొట్టుట

(7) చురియవెఱికినను - కత్తిచూపించి పొడవ ప్రయత్నించుట (కత్తితో పొడిచినను)

(8) ముచ్చిలినను - దొంగిలించుట

(9) అంక్కాడినను - వ్యభిచరించుట

వీటికన్నిటికి 25 ద్రమ్మలు అపరాధము చెల్లించవలెను. ముక్కుదఱిగినను 25 ద్రమ్మలతో నేరము పోతుందట. ఇప్పటి న్యాయస్థానములలో విధించే శిక్షలు కూడ సరిగా యోచిస్తే యింతే.

(10) మాణిసిచేసిన దోసంబునకు వాని జీవితంబదండువు - మానిసి (రాజు సేవకుడు) పై జెప్పిన నేరములు చేసినచో వాని జీవితము (=జీతము) ఇవ్వబడదు.

(11) వరియారంబంబు పడువరంబు - వరివిత్తుకారుకి అంటే వరిపంటల దినములలో పడువారంబు అంటే ధాన్యరూపమున నిర్ణీత రాజభాగము చెల్లించవలెనని యర్థము కావచ్చును.

(12) వెల్లారంబంబు ఎరగద్యాణంబు: మెట్టపైర్ల కారుకి గద్యాణ రూపములో పన్ను చెల్లించవలెను. 'ఎర' అనేది గద్యాణమునకు విశేషణము గోకర్ణ గద్యాణము,

సింగవగద్యాణము, ఇంకా అట్టి ఆయా రాజులుగాని, ఇతర నాయకులుగాని తమతమ పేర్లతో నాణెములు ముద్రించెడివారు. ఈ 'ఎరగద్యాణ' మిచ్చటి ప్రాంతీయ నాణెమని భావించవలెను లేక అరగద్యాణ మనెడి యర్థమున ఎరగద్యాణమని వాడెనేమో తెలియదు.

(13) పెరామణి వున్న మనాణ్డు ఏనూరు ద్రమ్మలరివెట్టి సుఖంబు మనువారు - ఇది వార్షిక పన్ను. గ్రామము మొత్తమున రాజుకి చెల్లించవలసిన 'అరి' అనగా నొక విధమగు సామూహిక కప్పము ఇది నల్లమేడెయ కొడుకు పెద్దన నిరవద్యునికి చెల్లించవలసినది.

(14) ఈ నిబంధనకు కట్టుబడి శత్రురాజులపాలికి పోకుండ నిచట నివసించ వలయును. లేనిచో ఈ గ్రామము విడచిపోవలెను - అనినిరవద్యుడు కొరవి కిచ్చిన స్తితియు, పై వాటిలో కొన్ని పదముల కర్థము తెలియకున్నను ఆనాటి ప్రజలు చెల్లించెడి పన్నులు, తద్వారా రాజుకి చెల్లే ఆదాయము తెలుస్తుంది.

11. కొన్ని పద్య శాసనాలు

ఏ భాషయందైనను క్రమమగు విధానములో వాక్యరచన యేర్పడక పూర్వమే గ్రామ్యవేడుకలకు చెందిన పదాలు, పాటలు, మొదలగు వాఙ్మయము వెలువడి ఆయా ప్రజల్లో ప్రాంతీయంగాను అనుశ్రుతంగాను వచ్చుచుండును. కాలక్రమంలో కొన్నిపోయి మరికొన్ని క్రొత్తవి చేరుచుండును. ఇట్టివి యెచట వ్రాయబడి యుండవు గనుక మనకు లేనట్లే. వ్రాత చేతనైన తరువాత కూడ అట్టివి వ్రాసియుంచవలెననే తలంపు కలుగకపోవుటవలన అనేక పదాలు, పాటలు ప్రజల నోళ్ళలో ఉన్నంతకాలం ఉండి తర్వాత అంతరించును. గాథాసప్తశతివంటి ప్రాకృత ముక్తకములట్టివే. తెలుగులో కూడ నట్టి క్రమబద్ధమైన పద్య రచనలున్నట్లు శాసనాల్లో అక్కడక్కడ గనబడును. ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు వారి 'ప్రాఙ్నన్నయ యుగము' అను గ్రంథములో కొన్ని శాసనములనుండి అట్టి పద్యములవలె కనుపించు భాగములు 'వృత్తగంధి' లేక 'పద్యగంధి' యనబడునని తెలిపి యీ క్రింది యుదాహరణములనిచ్చి యుండిరి (ప్రాఙ్నన్నయ యుగము. పుట. 354)

1. "పుణ్యకుమారుండు గణ్యమానుండు" - (తిప్పలూరి శాసనము)

ఇది ద్విపద పాదము; ప్రాసయతివేయబడినది

2. "విరిపటితి కమ్మరి వినియన వ్రాసె" - (రామేశ్వర శాసనము)

(ద్విపద పాదము; యతిసరిగానున్నది

3. (1) "శ్రీమహేన్ద్రన్ మాన రవి మాఱురాపిడుగు" - (బూడిదగడ్డపల్లి)
ఇందు పంచమాత్రాకమైన నాలుగు గణములున్నవి. ద్విరదగతి, రగడపాదము, యతిలేదు.

(2) "మగడ, పుదలి, మేలు, వాఁడు కాపి, బోళ, ముత్త, రాజు"
ఇందు నాలుగేసి సూర్య గణములతో గూడిన (త్రిమాత్రా గణములతో గూడిన) రెండు దళములున్నవి. యతిలేదు. తురగ వల్గన రగడ పాదమగును.

(3) "అచ్చెర్వు గనునరి వరజముండన్వాదు

దంతియమంగుతోడ(న్) బొడిచిపడియెఁన్)"--

కొంచెము మార్పుతోనిది సీసపద్య పాదమువలెనున్నది యతులు లేవు.

4. "ప్రభుచోటి రట్టోడి - పరహితుడితడు"

ఇది ద్విపద పాదము

"కట్టంచె కనికపొం-పట్టంబు హణులుగు" - (కొసినేపల్లి)

ఇది సీసపాద పూర్వార్ధము (SII_X_598)

5. "దేవస్వంబు లంచము గొన్నవాడు వార

ణాసి వ్రచ్చిన పాపంబు గొన్నవాడు" (పెద్దముడియం)

(SII_X_611)

వీటియందు యతిలేదు; కాని యివి రెండును

తేట గీతి పాదములనుటకుఁదగియున్నవి.

దేవస్వంబు అన్నప్పుడు 'స్వ'నూది పలుకక తేల్చిపలుకవలెను.

6. ఏనియుఱో గొన్నవాడు నిచ్చినవాడు

చెడువాడు క్టొచ్చినవాడు వెంట -- (SII_X_6120)

యతులు లేని సీసపాదము

7. వెంక యచోఱ మహారాజు తెంకణా

దిత్యుండు కొమరు రభీముండు పుసి

ఇల్ల దాఋనీ ధర్మ మా చంద్రార్క

తారకంబును వార్ధిలుచునుండు -దొంగలసాని శాసనము

EI-XXXII

ఇందు గణములు కొంతవఱకు సరిపోవుచున్నవి. మొదటి పాదమునందలి చంద్రగణమున నొక మాత్రహెచ్చుగను, రెండవ పాదమునందలి చంద్రగణమున నొక మాత్ర తక్కువగను గనఁబడుచున్నవి. మహాక్కర కాదగునని సూచించిరి.

8. కొరవి శాసనమందలి మొదటి వాక్యములో ఏడు పాదములు గల భాగమునెత్తి ద్విరదగతి రగడ పాదములగునని చెప్పిరి.

12. పణ్డరంగుని అద్దంకి శాసనము

(క్రీ. శ. సం. 770 ప్రాంతము)

మొట్టమొదట తెలుగులో గణయుక్తముగ వ్రాయబడిన పద్యము అద్దంకి శాసనమని కీర్తిశేషులు శ్రీ కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు గుర్తించి ప్రకటించియుండిరి (ఇపి. ఇండి IX పుటలు 271-275). ఇది తూర్పు చాళుక్య రాజగు గుణగ విజయాదిత్యుడు పట్టాభిషేకమైన మొదటి సంవత్సరమును జెప్పుచున్నది కనుక నిది సుమారు క్రీ. 844 ప్రాంతమునకు జెందిన రచన గావచ్చునని వారు నిర్ణయించిరి. ఆ మొదటి యేడు పండరంగుడను నాతడు సేనాధిపతిగ పట్టము గట్టబడెననియు, రాజుచే పంపబడి సామన్తసేనతో పఙ్ఱెణ్డు బోయ కొట్టములను వశము చేసుకొని కట్టెపు దుర్గమును తెఱపించి కన్దుకూరు (నగరము)ను బెజవాడతో సమానముగ చేసెననియు ఇందు జెప్పబడెను. వేరు విధముగ గూడ కొందఱు చెప్పిరి.

ఈ పద్యము తరువోజ. ఇందు ద్విపదలోని పాదములు రెండేసి కూడి యొక పాదమగును. ప్రాస, యతులు గలవు. ఈ క్రింది మూలము శ్రీ జయంతి రామయ్య పంతులుగారి శాసన పద్యమంజరి నుండి గ్రహింపబడెను.

మూలము :

పట్టంబు గట్టిన ప్రథమంబు నేణ్డు
 బలగర్వ్వ౼ం బొప్పంగ బైలేచి[1] సేన
పట్టంబు గట్టి ఞ్చి[2] ప్రభు బణ్డ రంగు[3]
 బఞ్చిన సమత్త[4] పడువతో బోయ
కొట్టంబుల్వ్రణ్డెణ్డు గొణి[5] వేంగి నాణ్డిం
 గొఱల్చి[6] యాత్రిభువనాంకుశం బణ[7] నిల్పి
కట్టెపు దుర్గ౼ంబు గడు బయల్సేసి
 కణ్డుకూర్బెజవాడ[8] గావిఞ్చెమెచ్చి

వ. పణ్డరంగు పరమ మహేశ్వరుణ్డు ఆదిత్య భటారనికి[9]ఇచ్చిన భూమి యెను బొదివుడ్ల ఆడ్లపట్టు[10] నేల దమ్మపురంబున దమ్ముపులు వీని రక్షింఞ్చిన వారికి అస్వమేధంబున పలంబు[11]అగు.

---

1. బొప్పంగంబై లేచి - అని చదువునది.
2. గట్టిఞ్చి - అని చదువునది.
3. ప్రభుంబణ్డరంగుం - అని చదువునది.
4. సామంత - అని చదువునది.
5. కొట్టముల్పణ్డెణ్డుగొని - అని చదువునది.
6. గొళచి-అనియుండనోపు - అని చదువునది.
7. త్రిభువనాంకుశమున - అని చదువునది.
8. కందుకూర్బెజవాడ - అని చదువునది.
9. భట్టారకునకు - అని చదువునది.
10. వుట్లఆళ్ళ పట్టు - అని చదువునది.
11. అశ్వమేధంబున ఫలంబు - అని చదువునది.

13. యుద్ధమల్లుని బెజవాడ శాసనము
(క్రీ.శ. 930 ప్రాంతమునాటిది)

ఇదియు కొరవి శాసనము ఇంచుమించుగ నొకే కాలమునకు జెందినవి. ఈ పద్యములు మధ్యాక్కరలు. శ్రీ జయంతి రామయ్య పంతులుగారు ఎపి. ఇండియా లో ప్రకటించిరి. వారి శాసన పద్యమంజరి నుండి యిచట గ్రహింపబడెను.

1. స్వస్తి నృపాంకు శాత్యన్త వత్సల సత్యత్రిణేత్ర
విస్తర శ్రీయుద్ధ మల్లుణ్డ నవద్య విఖ్యాత కీర్త్తిఁ
ప్రస్తుత రాజాశ్రయుణ్డు త్రిభువనాభరనుణ్డు సకల
వస్తు సమేతుణ్డు రాజసల్కి భూవల్లభుణ్డర్త్తిఁన్[1]

2. పరగంగ బెజవాడ గొమరస్వామికి[2] భక్తుణ్డై గుడియు
నిరుపమమతి నృపధాముణ్డెత్తించ్చె నెగి దీచ్చేఁ మఠంబు[3]
గొర గల్గా కొరు[4] లిన్దు విడిసి బృన్దంబు గొని యణ్డువారు
... రిగాక యబ్బారణాసి వ్రచ్చిన పాపంబు గొణ్డు

3. వెలయంగ నియ్యెట్టు ఱిస్సి మలినుర్రై విడిసిన వ్రోల[5]
గల తానపతులను రాజుపట్టంబు గట్టిన పతియు
నలియం బయ్వారల[6] వెల్వరించిన నశ్వమేధంబు
ఫలంబు[7] పేక్షించిన లింగం బఱిసిన[8] పాపంబు దమకు

---

1. వల్లభుణ్డర్థి – అని చదువునది
2. గొమరసామికి – అని చదువునది
3. మఠము – అని చదువునది
4. గొరగల్గాక – అనుచో 'ల' కారము తేల్చి పలుకువలయును. – అని చదువునది.
5. విడిసినం వ్రోలం అనుచో 'ల' కారము తేల్చి పలుకువలయును. – అని చదువునది.
6. నలియం బైవారల అనుచో 'ల' కారము తేల్చి పలుకువలయును. – అని చదువునది.
7. ఫలము అనుచో 'ల' కారము తేల్చి పలుకువలయును. – అని చదువునది.
8. మఱిసిన అనుచో 'ల' కారము తేల్చి పలుకువలయును. – అని చదువునది.

4. జననుత చేబ్రోల నుండి బెజవాడ జాత్రకు[9] వచ్చి
త్రిణయన సుతుణ్డొణ్డు సోటు మెచ్చక తివిరి యిన్నెలవ
యనఘుణ్డు సేకొని యిన్దు ప్రత్యక్ష బయన్న నిచ్చి[10]
గని మల్లణెత్తించె గుడియు మఠంబునుం గార్త్తికేయునకు

దీనింజేబ్రోలు యేలెదు (వా) రతిరంబేలు (వా) రొణ్డు సోటి గొరగ (లూ)ను బెట్టు వెరుగను జను (ı*) యీాస్తితి సేకొణి కాచువార దీనిన్దారు నిల్పిన వారు స్థితి దప్పి యఱివుట వా(పం)బుగాన.

5. రమనతో[12] బెజవాడ కెల్ల బెడంగును రక్షయుంగాను
న్దమతాత మల్లపరాజు వేరెఱు దానుంగట్టించెం
గ్రమబున[13] దానిక కలశ బిడ్డట్లుగా మొగమాదు
వమరంగ శ్రీయుద్ధమల్లుణ్డెత్తించె నమితతేజుండు॥

తన ధర్మ్మువు వొడంబడి కాచున్నృపుల కున్ద- (అసంపూర్తి)

ఈ శాసనమసంపూర్తియని శ్రీ జయంతి రామయ్య పంతులుగారు భావించిరి. కాని సి.ఆర్. కృష్ణమాచార్లుగారు 'కున్ద' అను పదమునకు స్తంభమని యర్థము జెప్పి, యుద్ధమల్లుని ధర్మము నొడబడి కాపాడు రాజుల శాసన స్తంభమిది యని దాని కర్థము చెప్పి పూర్తియైనదని చెప్పిరి.

యతిస్థాన విషయమున నన్నయ అక్కరలకును ఈ శాసనమందలి అక్కరలకును సాదృశ్యమున్నదని ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు తెలిపిరి. వానిలో గూడ నైదవ గణము మొదటనే యతి కన్పించుచున్నదని వ్రాసిరి. తర్వాత కవులును కవిజనాశ్రయకర్తయు నాలుగవ గణము యొక్క మొదటి యక్షరమునే

9. జాతరకు అనునది సాధురూపము
10. యిందుం బ్రత్యక్షమైయున్న నిచ్చం - అని
11. మఠమును అని చదువునది
12. రమణతో అని చదువునది
13. గ్రమమున అని చదువునది
14. మిడ్డట్లు అని చదువునది

యతిస్థానముగ చెప్పిరి. ఈ శాసనమందు కొన్ని తావులందు గణములు తప్పినట్లగుపడుచున్నను ఆధునిక లిపి ననుసరించి వ్రాసినచో అట్టి లోపములు సరియగునని వ్రాసిరి. అందుకు వారు కొన్ని సవరణలను చేసిరి.

మల్లుణ్డనవద్య-మల్లుఁడనవద్య అని వ్రాయవలెను.

వల్లభుణ్డర్థిన్ - వల్లభుడర్థిన్

బెజవాడం గొమరు స్వామికి భక్తుణ్డై - బెజవాడ గొమరుసామికి భక్తుఁడై - అని వ్రాయవలెను.

నృపధాముణ్డెత్తించ్చె - నృపధాముఁడెత్తించె - అని వ్రాయవలెను.

నలియం బయ్వారల - నలియ బైవారల - అని వ్రాయవలెను.

మున్నగునవి.

ఇట్టి సవరణలు సాధారణంగా నప్పటి గణబద్ధములకు పద్యములన్నిటిలోను అవసరమగు చుండును. నన్నయ తరువాత కూడ శాసనములందలి పద్యములిట్లే వ్రాయబడుచుండెను. ఆనాటి భాష పలుకుబడియే అంత, 'పృథివి'కి 'ప్రిథివి'; 'పరివృతుండు' అనుటకు 'పరివ్రుతుండు'; 'నృపుడు' అనుటకు 'న్రిపుడు' అనుటయు ఆనాడు మామూలు. పద్యములలోగూడ అట్లే వ్రాసి పూర్వాక్షరము గురువు కాకుండ తేలికగా పలుకువారని తెలియుచున్నది.

14. జినవల్లభుని కుర్క్యాల శాసనము[1]

ఇది కరీంనగరు జిల్లాలో కుర్క్యాల గ్రామము వెలుపల ఒక కొండపైన జినవిగ్రహములు, చక్రేశ్వరి యను శాసనదేవి ప్రతిమలకు క్రింద వ్రాయబడిన సంస్కృత, కన్నడ, తెలుగు పద్యములతో గూడిన శాసనము ప్రసిద్ధ కన్నడ కవియగు పంపని తమ్ముడు జినవల్ల డీశాసనమును వ్రాయించెను. ఇందే పంపని పూర్వులు తెలుగు దేశములోని కమ్మనాటి (గుండ్లకమ్మ తీరము) లోని వంగిపఱ్ఱు గ్రామమునకు చెందిన వారనియు, వేములవాడ చాళుక్య రాజుల ఆశ్రయమునుబట్టి సబ్బి మండలము చేరిరనియు తెలియుచున్నది. పంపడు కన్నడమున విక్రమార్జున విజయము, ఆదిపురాణము అను ఉద్గ్రంథములను రచించి ఆ భాషయందాదికవి యని ఖ్యాతినొందెను. అతడు తెలుగున కూడ నేమియైన స్వల్పకావ్యములు రచించెనేమో తెలియదు. కాని అతని సోదరుడీ శాసనమును రచించెనని చెప్పవచ్చు తాను కూడా గొప్ప విద్వాంసుడనని ఇందాతడు చెప్పుకొనెను. తెలుగులో నన్నయకు పూర్వము కంద పద్యములున్నట్లు ఇంతవఱకు తెలియదు. ఇందు మూడు కందపద్యములు కలవు. ఇవి జినవల్లభుని రచనయనియే చెప్పదగును. ఈ శాసనకాలము సుమారు క్రీస్తు 945అని చెప్పవచ్చును. అంటే నన్నయకంటె సుమారు నూరు సంవత్సరాలు ముందుంది. తెలుగులో మనకిప్పటికి తెలిసిన మొదటి కందపద్దెము లివియే.

1. కంద॥ జినభవనంబు లెత్తించుట (భవనము లెత్తించుట అని చదువవలెను)
జినపూజల్సేయుచున్కి జినమునులకు న
త్తిన యన్నదానం బీవుటం
జినవల్లభు బోలంగలరె జినధర్మ పరుల్.....

2. దినకరు సరివెల్గుదుమని
జినవల్లభు నెట్టు నెత్తు జితకవిననుం
మనుజుల్గలరే ధాత్రిం (మనుజులు గలరేధాత్రిన్=అని చదువవలెను)
విని తిచ్చిదు ననియ వృత్త విబుధ కవీంద్రుల్.

3. ఒక్కొక్క గుణంబు కల్గుదు
రొక్కొణ్డగా కొక్కలక్క లేవెవ్వరికిం
లెక్కింపనొక్కొలక్కకు
మిక్కిలి గుణపక్షపాతి గుణమణి గుణంబుల్

---

1. ఎపి. ఆంధ్రికా 11లో డా. నేలటూరి వెంకట రమణయ్యగారి వ్యాసమునుండి

15. బణపతి దీర్ఘాసి శాసనము. (శకము. 997)

కళింగపట్నమునకు నాలుగుమైళ్ళు ఉత్తరముగ దీర్ఘాసి యను గ్రామము కలదు. అచట దుర్గమెట్టయను కొండపై నొక శిథిలాలయమువద్ద నీ శాసనము కలదు. దీనియందు కొంత సంస్కృతభాగము; మిగిలినది తెలుగు పద్యభాగము.

గంగాన్వయమునకు చెందిన రాజరాజు కళింగదేశమును క్రీస్తు 1068 నుండి 1076-77వరకు పాలించెను. అతని మాణ్డలికులలో నొకడు బణపతి యనువాడు ఈ శాసనమును వ్రాయించెను. దీర్ఘాసినగరమున దుర్గాలయమునకు ముందు తానొక మణ్డపమును నిర్మించి శతాబ్దము 997న ఆ దేవికి అఖండ దీపమునకై దానమొసగినట్లు ఈ శాసనమందు కలదు. అతని భార్యయు మఱియొక దీపమునకు దానము చేసెను. ఈ బణపతి తన యేలిక పంపున చోడరాజును (మొదటి కులోత్తుంగుడు), వడ్డదేశమును, కిమిడి దేశమును (పర్లాకిమిడికి) గొడ్రిసింగ (తెలియదు) వేంగిదేశమును జయించినట్లు చెప్పవడెను. బణపతికి చలమత్తిగణ్డ, భణ్డన విజయ, గణ్డగోపాల అనుబిరుదులు చెప్పబడెను.

(తెలుగు భాగములోని పద్యము)

సీ. శ్రీ శకునేణ్డు[1] భూసతిపై శైల
నన్దాబ్జభవసంఖ్య నొంద వేంగి
దేశంబు గిమిడియ(యు) గోసల గిడ్రిసింగి
దేశంబు మఱియొడ్డ దేశమనంగ
జనిన భూపాలుర ననినొచ్చె[2] చలమత్తి-
గణ్డడ్డె నెగడిన మణ్డలికుణ్డు
భూసుర వంశుణ్డు వాసవ నిభభోగి
బణపతి సౌజన్య గుణయుతుణ్డు
దీర్ఘాసి భగవతిదేవి దేవాలయ
మున ముందటం గడు ఘనతరముగ

---

1. నేణ్డులు - అని చదువవలయును.
2. నోడ్చెన్ - అని చదువవలయును.

మణ్డపమెత్తించె భణ్డన విజయుణ్డు
        గణ్డగోపాలు ణ్డఖణ్డవర్తి
దీవియ వెట్టె నద్దేవికి నవ్వేలం
        దన మనోవల్లభి వనజనేత్రి
దీవియవెట్టెం బద్మావతియును క్షోణి
        నశశులు[3] గలయంతకును ముదమున

గగనభూమి చంద్ర ఖరకరోదక శిఖి
మారుతాత్మమూర్తి మహిష మథన
యిష్ట పూర్త[4] ఫలము లెల్ల కాలంబును
మెచ్చుతోడం దమకు నిచ్చుచుణ్డ.

3. క్షోణి యినశశుల్ - అని చదువవలయును.
4. యిష్టాపూర్త ఫలములు అనునది సాధురూపము

16. గూడూరు శాసనము

(చాళుక్య విక్రమశకము. 49. క్రీస్తు 1124)

ఈ శాసనము జనగామ తాలూకా గూడూరు గ్రామమున నొక శిలాస్తంభముపై నలువైపుల వ్రాయబడినది. అందొకవైపుది మాత్రమే తెలుగుది. మిగత మూడు ప్రక్కల కన్నడములో వ్రాయబడిన శాసనము కలదు. అదియు నిదియు ఒకే లిపికి చెందినవి. ఒకే వ్రాతకాడు చెక్కెను. భాష మాత్రమే భేదము. పైగా తెలుగు భాగములో ప్రశస్తి పద్యములు తప్ప వేరు దానాదికము గాని సంవత్సరము మున్నగు విశేషములుగాని లేవు. శాసనములందెచ్చట అట్టి కేవల ప్రశస్తితోనే యుండు సందర్భములు లేవు. కన్నడ భాగములో చాళుక్య చక్రవర్తి యగు ఆరవ విక్రమాదిత్యుని (క్రీ.శ. 1076-1127) పుత్రుడును, యువరాజును అగు కుమారసోమేశ్వరుడు కొలనుపాక రాష్ట్రమునకు మహామండలేశ్వరుడుగనుండి అతని దండనాయకుడగు స్వామిపయ్య విన్నపమున గుముడూరులో విరియాలమల్లడు నిర్మించిన మల్లేశ్వర శివాలయమునకు చాళుక్య విక్రమశకము 49వ సంవత్సరములో బమ్మెర గ్రామమును దానమొసగినట్లు చెప్పబడెను. తర్వాత విరియాలమల్లని తాతతండ్రుల ప్రశస్తిగల పద్యములు కన్నడములో గలవు. ఆ తరువాత నాలుగవవైపున అదే విరియాల వంశము వారి ప్రశస్తి తెలుగు పద్యములలో గలదు. కాకపోతే, మల్లన తాతదండ్రుల ప్రశస్తి కాక ఇది వేరే వ్యక్తుల ప్రశస్తి. వీటిలో తుది పద్యము విరియాల సూరనను గూర్చినది. కన్నడ పద్యములు సూరన ప్రశస్తితో ప్రారంభమగును. కనుక మల్లని తాతయగు ఆ సూరడు, తెలుగు భాగములో తుది యందు జెప్పబడిన సూరడు ఒకరేయగుటలో ప్రతిబంధకమేమియు లేదు. ఇంతకు, తెలుగు భాగములో దానమును గూర్చిన విషయమేమియులేని కతన అది శాసనాంతరము కాజాలదు లిపి కూడ భిన్నము కాదు. భాషయు, విషయమును మిగిలిన దాని నుండి భేదించును. ఆ భేదమును పై తెలిపిన విధముగ సరిపెట్టుకొనక తప్పదు. కనుక గూడూరు శాసనమందలి పద్యములు నన్నయకు ముందువి కావు. నన్నయ తర్వాత సుమారు నూరేండ్ల నాటివి. అందలి విషయముమటుకు నన్నయకు పూర్వము జరిగినది. అనగా మల్లని తాతయగు సూరని తల్లిదండ్రులనుకొనబడు

విరియాల ఎఱ్ఱన, కామవసానులు చేసిన ఘనకార్యములిందు వర్ణించబడినవి. మల్లడు క్రీ. 1124 నాటి వాడు గనుక అతని ముత్తాత నూరు లేక నూట పాతికేండ్ల క్రిందటి వాడు కాదగును. ఈ విధముగ నీ శాసనమును క్రీ. 1124 నాటిదిగ చెప్పినచో నన్నయకు పూర్వము వృత్తములలో రచింపబడిన తెలుగు పద్యములున్నవా లేవా అను సందియము తదవస్థముగనే యున్నది.

ప్రస్తుతము మనము తెలుగు పద్యములనుగూర్చియే విచారింతము. ఇది సరిగా అర్థముకాకుండుటతో, కొరవి శాసనమువలె, అందు జెప్పబడిన చరిత్రాంశములు సరిగా మనకు తెలియవు. అది వ్రాయునాటికి మల్లడికి కూడ సరిగా తెలియవేమో ననిపించును. రెండవ విషయము, పద్యములలోని భాషలో కొన్ని తప్పులు గలవు. దానికి తోడు కొన్ని పదములు మనకు సరిగా అర్థము కాకుండుట. ఈ కారణములవల్ల ఈ గూడూరు శాసనములోని పద్యములు పూర్తిగా తెలియుట లేదు.

కొరవి శాసన సందర్భములోవలె ఇచట కూడ ముందు కొంత చరిత్రాంశమును పరిచయము చేసుకొనిన శాసనమందలి పద్యములు కొంత అర్థము కాగలవు. తెలుగు భాగమున జెప్పబడిన చరిత్ర విరియాల వంశమునకు చెందినది. దుర్జయాన్వయమున వెన్నడనువాడు పుట్టెను. అతనికి నెఱ్ఱభూపతియు నితనికి విరియాల భీమడు నృపఘస్మరుడై యుదయించెను. ఇతనికి మఱల యెఱ్ఱ నరేంద్రుడు జన్మించెను. ఈ యెఱ్ఱనృపతి బొట్టు బేతరాజును చేతబట్టి (ఆశ్రయించి) వాని వైరిని జంపి కొరవి దేశములో నాతని ప్రతిష్ఠించి తత్ప్రతిఫలముగ వాని వలన నాతని పుత్రుని పేరును తన దాయమునకు పెట్టుకొనుట కనుమతిని, విస్తారముగ ధనమును, మొగడుపల్లికి చెందిన పన్నెండు గ్రామముల అధికారమును పొందెను. తరువాతి పద్యములో ఆ యెఱ్ఱనృపుని భార్యయగు కామవసాని గరుడుడను పేరుగల కాకతిరాజు నొకని పిన్నవయస్కునిచేతబట్టి గొప్ప వాడగు బల్లవ (బల్లహ) రాజు యొక్క ప్రాపు జేరి భాస్కరవిభు చక్రవర్తిని జూచి (వాని యనుగ్రహమును బొంది) కాకతి వంశమును నిలబెట్టిన కీర్తినార్జించెను. తుది పద్యమున సూరడను వాని ఘనత చెప్పబడెను. కాటయ నాయకుని జంపి వేలుపుకొండకు చెందిన రవ్వనృపుని ఆ వేలుపుకొండయందు నిలిపి వానివలన ముప్పదిమూడు గ్రామముల యధిపత్యమును, బోదిపాడు, బేకుమామిడ్లు గరెడెయరాజు నెయ్యము సంపాదించెనని చెప్పబడెను.

ఈ పద్యము లైదింటిలోను కీర్తింపబడిన విరియాల వంశజుల ఘనత స్థూలముగ అర్థమగుచున్నను, సూక్ష్మముగ యోచించిన చరిత్రకందని విషయములు కొన్ని పొడగట్టుచున్నవి.

దుర్జయుడు విరియాల వంశమున కాది పురుషుడని చెప్పబడెను. ఈ విధముగ తెలుగునాట ననేక నాయక వంశములు దుర్జయుని తమ మూలపురుషునిగ బేర్కొనుట పరిపాటి. అది అంత గణింపదగిన విషయము గాదు. వెన్నడు తరువాత జెప్పబడెను. ఇట్లు దుర్జయుడు - వెన్నరాజు కాకతీయులకు గూడ మూల పురుషులుగ నిటీవల బయల్పడిన బయ్యారము శాసనములో జెప్పబడిరి.

ఇది కాకతీయులు, విరియాలవారు - ఇద్దరి విషయములోను కడు ప్రాచీన కాలమునకు జెందినది గనుక శాసనకాలము నాటికి అనగా క్రీ. 1124 నాటికి సత్యదూరమై కేవలము ప్రశస్తి కొరకేర్పడిన యంశమనిపించును. ఆ వెన్నరాజుకి ఎఱ్ఱడనువాడు జన్మించెనని చెప్పి మొదటి పద్యము ముగియును. దీనిలోని దుర్జయుడు, వెన్నడు, ఎఱ్ఱడు అను ముగ్గురు కాకతీయులలో గూడ నుండుటచే ఈ పద్యము కాకతీయుల కన్వయించునో, విరియాల వారి కన్వయించునో సందియ మొకటి తట్టును. కాకతీయులకే చెందుచో రెండవ పద్యము నుండియేవిరియాల వంశము చెప్పబడినదనుకొనవలెను. విరియాల పదముకూడా రెండవ పద్యమునందే యున్నది. విరియాల పదము మల్యాల పదమువలె ఊరి పేరా లేక మఱి యేదైనా పేరా అని యింకొక సందేహము. ఏలయన నీ పద్యములో భావితకీర్తి

నాథ(ని-) పాండవ మధ్యమ భీముడోయనం

గా విరియాల భీమనృప ఘస్మరుడై యుదియించె".

అను దానిలో ఉదయించినదెవరు? పాండవ మధ్యమ భీముని పోలిన విరియాల భీముడనవలెను. 'భీముడు' అని తత్సమముగా ఆపదము లేదు. అట్లే విరియాలుడని కూడా లేదు. అందుచే విరియాల భీమ అనుదానినే కర్తచేయుట ఉచితమని తోస్తుంది. విరియాల భీముడుదయించెను అనవలెను. అప్పుడు పైనున్న భావితకీర్తినాథ(ని-) అనుచోట చివరి అక్షరమునెట్లు పూరించవలెనో తెలియదు. నాతనికి అని కొందరు పూరించి పై పద్యముతో నన్వయించుచున్నారు. ప్రస్తుతము అప్పుడు పై పద్యములో జెప్పబడినవారు కూడా విరియాల వంశమువారే యగుదురు.

కావచ్చును. ఈ రెండవ పద్యములో 'విరియాల భీమ' అనునది ప్రథమైక వచనములో తత్సమ రూపమని యంగీకరించవలెను.

ఆ భీమునికి ఎఱ్ఱన్నపుడుదయించెను. ఇతడు బొట్టు బేతరాజును ఆశ్రయించి వాని శత్రువుని జంపి వానిని కొరవి దేశములో రాజుగ జేసెనట. ఈ మధ్య లభించిన క్రివ్వక గ్రామ దాన శాసనములో ముదుగొండ చాళుక్య వంశమునకు చెందిన కొందరు రాజులు చెప్పబడిరి. వారిలో దాతయగు కుసుమాదిత్యుడు అతని తమ్ముడగు నాగతిరాజు, బొట్టుబేతరాజు యొక్క పుత్రులని చెప్పబడిరి. ఆ రాజులది కొరవిదేశమేనని ఆ శాసనములో చెప్పబడింది. కనుక అందలి బొట్టు బేతరాజు యీ గూడూరు శాసనములోని బొట్టుబేతరాజని చెప్పవచ్చును. కాని యీ యూహకొక పెద్ద – టంకము కలదు. ఇతని కొడుకులుగా చెప్పబడిన కుసుమాదిత్యుడు, నాగతిరాజు ఇరువురు కాకతి గణపతి దేవుని సమకాలము వారుగా శాసనాంతరములవల్ల తెలియవచ్చు చున్నారు. అంటే క్రీస్తు 1220 ప్రాంతములోనివారగు వీరియొక్క తండ్రియగు బొట్టు బేతరాజు 1150 కంటె పూర్వము వాడు కాజాలడు. మరి గూడూరు శాసనమే క్రీ.1124 నాటిది కదా అంతకు ఇంకా నాలుగైదు తరములనాటి చరిత్ర కదా యిది కనుక క్రివ్వక శాసనమందలి బొట్టు బేతరాజే యితడు కాజాలడు. అతనికి నాలుగైదు తరములకు ముందు వాడుకావలెను. అందుచే ఆ క్రివ్వక శాసనములో వంశములోని వారందరు చెప్పబడలేదని నిశ్చయమగుచున్నది. మొత్తము మీద ఆ వంశమువాడేనని చెప్పవచ్చును. బొట్టు అను పదము స్థల నామముగా ఆ క్రివ్వక శాసనంలో కనిపిస్తుంది. కనుక ఆ వంశములో ఏ బేతరాజైనను బొట్టుబేతరాజేయగును. కాని అట్టి వ్యక్తియు మనకు ప్రస్తుతము తెలియవచ్చుటలేదు.

అతనికి కొరవి దేశము నష్టము కాగా తిరిగి విరియాల యెఱ్ఱడు వాని వైరిని చంపి అతనిని కొరవిలో ప్రతిష్ఠించెనట. దానికి ఫలముగ ఆ బొట్టు బేతరాజువలన వాని పేరు గుర్తుగల పేరు తన సంతతికి పెట్టుకొనే అనుమతిని, కొంతధనమును, పన్నెండు గ్రామముల మొగుడుపల్లి ప్రభుత్వమును పొందినట్లు చెప్పబడెను.

ఇది మూడవ పద్యము : ఇందు చరిత్రకు చెందిన సందేహము లింకను గలవు. నాలుగవ పద్యములో వాని యంగన (భార్య) కామవసాని చిన్నవాడగు గరుడుడను కాకతిరాజును చేబట్టి (కాపాడి) బల్లవ (హ) రాజు యొక్క ఆశ్రమము

చేరి చక్రవర్తి యనుగ్రహము వడసి కాకతి వంశమును ప్రతిష్ఠించెనట. అంటే కాకతి వంశము పతనమగు సమయమున ఆ కామవసాని రక్షించినదని తాత్పర్యము. ఇచటగూడ చరిత్రాంశము చాలా దురూహముగ నుండును. కాకతి మొదటి బేతరాజునకు గరుడును బిరుదనామమున్నట్లు బయ్యారం శాసనములో చెప్పబడెను. అతని సమయములో కాకతి రాజ్యమెట్లు పతనోన్ముఖమయ్యెనో యోచింపవలెను. స్త్రీయగు కామవసాని రక్షించుటేల? ఇట్లు కాకతివంశమును కుంతలదేవియను నొక స్త్రీ నిలబెట్టి రాజ్యమేలినట్లు సిద్ధేశ్వర చరిత్రలో గూడ జెప్పబడెను. కనుక కామసాని కాకతి వంశమును నిలబెట్టిన మాట నిజమే. ఆమె కట్టి యనురాగము గరుడ బేతనియందేల కలిగెను? వానికి ఆమె మేనయత్తయని సిద్ధేశ్వర చరిత్ర చెప్పుచున్నది. అంటే బేతరాజు యొక్క తండ్రియగు పిండిగుండరాజుకి ఆమె తోబుట్టువు అయినను ఆమె భర్త యెఱ్ఱనృపతియే సహాయము చేయవచ్చు కదా! అట్లు జరగలేదు. పై పద్యములో నతడు బొట్టు బేతని వైరిని చంపెనని కలదు. ఆ వైరియే పిండిగుండడు అతడే కొరవిని ఆక్రమించుకొని బొట్టు బేతరాజునో లేక యతని తండ్రినో తరిమివైచెను. అంత ముదుగొండ రాజులు కొరవిని విడిచిబొట్టు అనుచోట ఆశ్రయము కల్పించుకొని కొంతకాలము గడిపిరి. ఆ బొట్టు ప్రస్తుత మేగ్రామమో తెలియదు. పాలవంచ తాలూకాయందలి అడవిలో నేదో ప్రాంతము కావచ్చును.

ఆ బొట్టు బేతని సేనానాయకుడు కానవచ్చును విరియాల యెఱ్ఱడు, స్వామిభక్తి కొలది బావమఱదియైన పిండి గుండని చంపి కాకతి వంశమునకు ముప్పుతెచ్చెను. గరుడ బేతరాజు చిన్నవాడగుటచే నేమియు చేయలేని స్థితిలో నుండెను. రాజ్యములేదు. కనుక పుట్టినింటి వారి పంశమును రక్షించవలెనను కోరిక కామవసానికి కలుగుట సహజము. ఆ గరుడ బేతరాజును ఒకానొక బల్లవరాజు యొక్క సహాయమున చాళుక్య చక్రవర్తి యొద్దకు గొనిపోయి అనుముకొండ రాజ్యమిప్పించి కాకతి వంశమును నిలబెట్టెను. పిండి గుండని వఱకు కాకతీయులు రాష్ట్రకూటులకు సామంతులుగ నుండిరి. వారి తదనంతరము క్రీ. 973లో పశ్చిమ చాళుక్యులు రాజ్యమునకు వచ్చినపుడు పిండిగుండడు వారికి లొంగక కొరవి రాజ్యమును తన యధీనమందే యుంచుకొని స్వతంత్రుడును అయియుండును. బొట్టు బేతరాజీయదను చూచుకొని చాళుక్యుల ప్రాపుచేరి పిండిగుండని యెఱ్ఱనిద్వారా చంపించి తన కొరవి రాజ్యమును

తిరిగి పొందెను. కనుక చాళుక్య చక్రవర్తికి ఎఱ్ఱని యెడ అభిమానముండి యుండును. ఈ లోపున నెఱ్ఱడు మృతి జెంది యుండినను కావచ్చును. అతనికున్న పలుకుబడిని వినియోగించి కామవసాని కాకతిగరుడ బేతని అనుమకొండలో సామంతుడగునట్లు పాటుబడి వంశమును నిలబెట్టెను. 'కాకతి నిల్పుట కోటి సేయదే' అను పద్యములోని భాగమునకీ యర్థము. ఇచట బల్లవరాజెవరో తెలియదు. భాస్కర విభుచక్రవర్తి యెవరో తెలియదు. భాస్కర నిభుభు చక్రవర్తి యని కొందరు దిద్దిరి. సూచన బాగానే యున్నది. అయినను ఆ చక్రవర్తి పేరు తెలియదు. ఇది జరిగిన సమయము క్రీ. 1000లకు కొంచెము ముందని ఊహించవచ్చును. పిండిగుండడు క్రీ. 956 నాటిదగు మాంగల్లు శాసనములో తెలియవచ్చుచున్నాడు. కనుక రాష్ట్రకూట పతనానంతరము కొంతకాలమున కీతనిని విరియాల ఎఱ్ఱడు వధించి యుండును అనగా సుమారు 990 ప్రాంతములోని విషయమిది. ఇది నాలుగవ పద్యమునందలి చరిత్రాంశము.

అయిదవ పద్యములో నొక సూరని ఘనత వర్ణింపబడెను. అతడు కామవసాని పుత్రుడే యగునని పలువురి యభిప్రాయము. లేకున్న యెడల సంగతి కుదరదు. అతడు వేలుపుకొండ (నేటి జఫర్‌ఘడ్) ప్రభువగు కాటయ నాయకు జంపి వేరొక రవ్వ నృపతిని వేల్పుకొండ యందు ప్రతిష్ఠించెనట. ఈ రవ్వనృపతి యెవ్వరో తెలియదు. అతడు పిన్నవాడైన కాకతి గరుడ బేతడే కావచ్చునని కొందరు, కాదు వేరే మరియొక నాయకుడని కొందరు చెప్పుచుండిరి. అతనిని నిలబెట్టుటని సూరలికు 33 గ్రామముల యాధిపత్యము, నేరెడు, బోటిపాడు, బేకు మాలిడ్లు, గరెండెయ రాజు యొక్క మైత్రి చేకూరెనట. వీటిలో కొన్ని పదములకు అర్థము తెలియదు. నేరెడు అనునది 'నేలెడు' అని కాదగునని కొందరు చెప్పుదురు. నేరెడు, బోటిపాడు, బేలమాలిడ్లు అనునవి మూడు స్థలనామములే యగునని కొందరు భావించెదరు. గరెండెయ రాజనగా కాకతీయ మొదటి బేతరాజు. అతనికే గరుడ బేతరాజని పేరు కలదు. 'ర' 'ల' లకు భేదము నంతగా పాటించుట లేదు యీ రచయిత. అందుచేతనే 5వ పద్యములో ప్రాసస్థానమున 'ల'కు బదులు 'కారకకాలుడై'యని 'ర'ను వాడినాడు. 'కాలకకాలు' డనుటయే యుక్తము అనగా 'కాలయముడు' లేక 'కాలాన్తకుడు' అని అర్థము. ఈ సూరడే కన్నడ భాగములో జెప్పబడిన మల్లన తాతయగు విరియాలసూరడు. ఇది యైదవ పద్యము. కొమ్మోజన బరహ అని కన్నడములో కొమ్మోజు వ్రాసెనని చెప్పబడెను.

దీనివలన పై కన్నడ శాసనమును వ్రాసినది కూడ నితడేనని యర్థము గనుక అది, ఇది అంత ఒకరే వ్రాసిరనవచ్చును. 'అడపగట్టు దేవరకుజమ' అని తుది వాక్యము. అంటే తాంబూలము దేవరకు ఇచ్చితినని కొమ్మోజు చెప్పుకొనెను. తనకిచ్చిన కూలి దేవుని కని యర్థము.

ఈ విధముగ గూడూరు శాసనములోని చరిత్రాంశమును కొంతవఱకిప్పుడు చెప్పగలుగుచున్నాము. ఇది కాకతీయుల మొదటి చరిత్రకు, కొరవి రాజులైన ముదుగొండ చాళుక్యుల చరిత్రకు చాలా ముఖ్యమైనది' కాని పూర్తిగా అర్థము కాదు. కన్నడ లేఖకు దగుటచే తప్పులు గూడ కొన్ని గలవు. ఇందలి విషయము క్రీ. 1000 ప్రాంతమునాటిది. శాసనము క్రీ. 1124 నాటిది.

శాసనమూలము:

1. చ. అనుపమ దుజ్జ-యాన్వయ సుదాబ్ధి ననేకులు రాజనందనులు
సనిన బొఱంటి వెన్నడను సంభవుడయ్యె నతిప్రసిద్ధుడై
వినుత విరోధి మణ్డళిక వెన్నడు వెన్నుడె(డ)వోలెవానికిని(న్)
ఘనుడగు నెఱ(ఱ్ఱ)భూపతి జగద్వినుతుండు(ద)యించె గీర్తి-తోను॥
2. ఉ. భావిత కీర్తి-నాథ (ని-) పాండవ మధ్యమ భీముడోయనం
గా(వి)రియాల భీమ (నిప ఘస్మరుడై (యు) ది(ద)యించె వానికిను
భూవిమతుణ్డు మండళిక భూష (ణు)డెఱ(ఱ్ఱ)నరేంద్రుదుత్తమ
శ్రీవినుతుండు బంధుజన సేవ్యుండు దా నుదయించె నున్నతిని॥
3. చ. అతణ్డనిబొట్టు బేత వసుధాధిపు జేకొని వానివైరిను
ర్ద్రి(ర్థు) తమున జంపి యాకొరవి దేశమునందు ప్రతిష్ట (ష్ఠ) జేసిత
త్తనెయురు పేరు పోడగల దాయము బిట్టఱ గద్యనంబున
ప్రతిముదు వానిచే మొగడు పల్లియు పంద్ర (ద్రె)డు నేలునప్పుడే॥
4. చ. అరుదగునట్టి ఎఱ(ఱ్ఱ)నృపునంగన గామవసాని యొక మే
ల్గరుండని బేత భూవిభుని గాకతి వల్లభు బిన్నవాని దా
బరగంగ జేతబట్టి ఘనుబల్లవరాయని యోగి జొచ్చి భా
స్కర విభు చక్రవర్తి- గని కాకతి నిల్పుట గోటిసేయదే॥
5. ఉ. కారక కాలుడై పడసె గాయడ నాయకు జంపి సూరడ

వ్వేలుపు గొండ రవ్వ్రనిపు వేలువు గొండ ననిల్పి వానిచే
మేలుగ మూడ ముప్పయిని మేలుగ నేరెదు బోటి పాదు మం
మేలుగ బేకు మావిడ్లు మేలుగ రెండెయ రాజు పంగడ్లు (డుల్)॥

సూత్రధారి కొమ్మోజన బరహో శ్రీశ్రీశ్రీ
అడపగట్టు దేవరకు జను.

శకము 1067 నాటి చేబ్రోలు శాసన మొకదానిలో భీమయపండ్డడను మాండలికుడు తను దేశిమార్గ కవితలు రెండు చక్కగ చెప్పగలుగుదునని చెప్పుకొనెను.

చ. తలంపు సదర్థ- భావమునం దద్గత సూక్తులం గూడ వర్ణ్ణ-నలు
గొలుసు గొనంగ వ్రావడ్లు గోరిన భంగికవచ్చి ముట్టం గో
మలగతి దేసి మార్గ్గ-ములు మట్టుపడగం గ్గటనంబ్బు లొప్ప
నాద్యుల క్రియం జెప్పనేర్చె నృపధూర్జ్జ-టి భీమయపండ్డ డిమ్మహిని.

17. ఉప్పరిపల్లి శాసనము

(క్రీ.శ. సం. 1157)

కావ్యదృష్టిలోను చక్కని కవిత్వములోను పేర్కొనదగినదీ శాసనము. దీనిని కాకతిగణపతి దేవుని ప్రసిద్ధ దండనాయకుడైన, రేచెర్ల రుద్రిరెడ్డికి మంత్రియగు కాటయ వేయించెను. కరీంనగరు జిల్లా హుజూరాబాదు తాలూకా గొడిశాల గ్రామము దగ్గర ఉప్పరపల్లి యనుచోట నొక శివాలయము వద్ద నున్నదీ శాసనశిల. శకము 1157 (క్రీ. 1235)వ సంవత్సరమున వ్రాయబడెను. ఇందు గమనించదగిన విషయము. తెలుగు శాసనము లందిప్పటివరకుగాన వచ్చు లోపము లనేకములు తొలగినవి. శాసనములు కూడా చక్కగా వ్రాయదలచినచో నిర్దుష్టముగ గ్రాంథిక భాషలో వ్రాయనేర్చిరని యీ రచన నిరూపించును. ఒక్క అరసున్న నుపయోగించకుండుట తప్ప మిగతా వ్రాతలోపములన్నియు పోయినవి. అరసున్నకు బదులు పూర్ణానుస్వరమునే యింక వాడుచుండిరి దీనిని బట్టి ఆనాటి తాళపత్ర గ్రంథములలో కూడా తెలుగు కావ్యములు వ్రాయునపుడు అరసున్న లేదని వ్యక్తమగుచున్నది. నిండు సున్నాను వ్రాసినను చదువునపుడు మాత్రము ఛందోనుగుణముగ దానిని పలుకుటయు పలుక కుండుటయు చేసెడి వారని గ్రహించవలెను. సరిగానప్పటికి మూడు శతాబ్దులకు పూర్వము దైన జినవల్లభుని కందపద్యములను ఈ శాసనమందలి కందపద్యములను పోల్చి చూచిన కవన భాష యెంత మార్పు నొందెనో తెలియకలదు. 'ణ్డు'కు బదులు'ండు'; 'ంబు'కు బదులు 'ము' వచ్చినవి. పాదాంతములందు గాని వేరొండు తావులందుగాని ఛందోభంగముగతోచు 'ను' మున్నగు అజంతాక్షరములకు బదులు 'న్' అనే హల్మాత్రములు వాడుకలోనికి వచ్చినవి.

తనయుండనగాంన్	-	6వ పద్యము
రుద్రుండిలన్	-	7వ పద్యము
కాటయకొసంగున్	-	2వ పద్యము
నభీష్ట ఫలంబుల్	-	4వ పద్యము
దయామతి శుభముల్	-	3వ పద్యము

కాని 'ని' యింకా మారలేదు. బ్రీతింని - 5వ పద్యము
ధాత్రిని - 8వ పద్యము.

తెలుగువారికి హలంత పదములును కూడ అజంత పదములుగా నుచ్చరించుట అలవాటు. సంస్కృత పదాలను కూడ శ్లోకములందున్నను అట్లే ఉచ్చరించుట, వ్రాయుట వీరికి సహజము. 'శ్రీమాన్ రుద్రయనాయకో' అనుటకు 'శ్రీమాన్ను రుద్రయనాయకో' అని పలుకుదురు. కనుక 'న్' వ్రాయుటకు 'ను' లేక 'ని' అనియు 'ల్' వ్రాయుటకు 'లు' అనియు వ్రాసెడివారు. ఛందోనుగుణంగా చదువవలెను.

శాసన మూలము

1\. ఉ. శ్రీమదనూన దానజలసేవకుంబాయక మ్రోయుషట్పద
స్తోమనినాదమున్వినుచు సూరెల నెప్పుడుం బ్రస్తుతించు సి
ద్ధామరకోటికి న్వరదుండైన గణేశుండు సుస్థిరస్థితిం
గామ సమాన మూర్త్తి యగుకాటయ కీవుత మిష్టసంపదల్

2\. క. చరణ సరోరుహరాగ
స్ఫురణన్మహిషుని శిరంబు వొలుపుగ సంధ్యా
భ్రరుచి నెనయ మెట్టిన స
త్కరుణాన్విత దుర్గి వరము గాటయ కొస(o)గున్.

3\. క. ఉరగేంద్ర దిగ్గజములకుం
బరమోత్సాహముగ నాతపత్రమువోలె
న్ధర యెత్తిన కిరివరుండగు
హరి గాటయ కీవుతము దయామతి శుభముల్

4\. క. దేవాదిదేవుం దమిత
స్థావరజంగమమయుండు సర్వే శుండు గౌ
రీ(వ)రుండనవతంబును
నీవుతం గాటయకు దయ నభీష్ట ఫలంబుల్

5\. క. హరిదశ్వుం దజాచ్యుత శం
కరమూర్త్తి త్రయీమయుండు గమలాప్తుండు భా
స్కరుండుద (యం గాచుచుండెదుం)
గరుణారస పూర్ణ హృదయుం గాటయం బ్రీతింని.

(గద్య) స్వస్తిశ్రీ మదపారపారావార పరివృత మహీతలంబున సకలజన వినుతం బగునంధ్ర దేశంబునకు (వి)భూషణం బైన యనుమకొండయను పురవరంబు నిజరాజధానిగా నొప్పుచుంన్న కాకతిభూపాల క్రమంబున జనవినుతయశో విలాసుండును జయలక్ష్మీ నివాసుండునునైన రుద్రనరేంద్రు సుపుత్రుండును సదారాధిత త్రినేత్రుండును విబుధ జనవన వసంతుండును రమణియ్య సీమంతినీజయంతుండును సకల జనమనోరంజనుండును నరాతి రాజ మదభంజనుండును శరణాగతరాజ శరణ్యుండును వినతాఖిల రాజవరేణ్యుండును ధైయ్యా౯ మరసానుమంతుండును దు(రం)గమ రేవంతుండును సత్యహరిశ్చంద్రుండును విభవామరేంద్రుండును నైన గణపతిదేవ మహీనాధునకుంబ్రధానియై.

6. క. కనకాచలధీరుండు జన
వినుత చరిత్రుండు గాయ్యా౯ విదుం డినతేజుం
డనఘుండు గుణనిధి బెజ్జమ
తనయుండు బుధదీనభానుతనయుం డనగాం౯

7.మ. ప్రతిపక్ష క్షితిపాలకుంజర మద ప్రారంభ సంరంభ ము
ద్ధతబాహానిహిత ప్రచండనిశితో ద్యత్ఖడ్గధారానఖా
హతి బేదించి యఖవ్వా౯ గవ్వా౯ బల శౌర్య స్ఫూర్తిం౯ గంఠీరవా
కృతియై (సన్నుత) వ్రిత్తిదాల్చి వెలసెను రే (చెర్ల౯) రుద్రుండిలన్.

సకల జన వినుతయశుండును గుణగణాలంకారుండును నైన కాట్రెడ్డికి(ం) సౌభాగ్య సౌందర్య చాతుయ్యా౯ంబులు గలిగి పరగిన పరమ పతివ్రతయైన బెజ్జమాంబకుం బ్రియనందనుండును ననవరత ధమ్మా౯ సమేతుండును పతిహితాచరణుండునుం గాకెత రాజ్యభార ధౌరేయుండును సద్గుణ ప్రఖ్యాతుండును నతులబల పరాక్రమ సమన్వితుండును నైన రేచెర్ల౯ రుద్రనకుం బ్రధాని.

8. క. కులతిలకుండు వసుధామర
జలధి సుధాకరుం డ శేషజననుత చరితుం

దలఘుండు రిపుతరు దావా
నలుండనంగాం బరగె రాజెనాయకుం దుర్వ్వీని.

(గద్య) బొక్కెరలోని వీరభటావలి వధించి గోధుమ అతి తలదెంచి ఉదగిరి సాధించి పడిరాయనిందోలి దాక్షారామ భీమేశ్వర దేవర కక్షయ దీపంబులునిపి ధర్మ్మ సమేతుండైన రాజెనాయకునికి ధర్మ్మపత్నియు సుచారిత్రయు వనితాలలామయునైన రవ్వమాంబకు సుపుత్రుండు

9.క. స(శ)ర నిధి గంభీరుండు సు
స్థిర తేజుండు వంశశేఖరుండు దయా
కరుండు బుధాంబుజ దశశత
కరుండని వర్న్ని (ర్ణ్ని)ంప నొప్పుం గాటయధాత్రిని.

(గద్య) విశద యశుండైన గణప
తిదేవ భూపాలునకుం బరమ భక్తుండై తన్మహీ
నాథు కారుణ్యంబున నతుల విభవ సమేతుండై
వనంబు లొప్పం బెట్టె తటటాకంబులు శివాలయం
బులు నిలిపి వినయవివేక సత్యశౌచ త్యాగ
భోగ బలపరాక్రమంబుల జనవినుతుం
డై యభీష్టార్త్థ ప్రదుం డగుచుంన త్రిలోకారాధ్యు
ండైన పరమేశ్వరున కంగభోగార్త్థ
ంబు దనయిచ్చిన వ్రిత్తుల శాశ్వతం
బై ప్రవర్త్తి ల్లుచుం దని నిల్పిన సంవత్సర సంఖ్య
శకవర్షములు ౧౧౫౭మన్మథ సంవ
త్సర మాఘశుద్ధ ౧౫ గురువారము
నందు పంచలింగాలకునూ పించఅపల్లి
ని దేవ బ్రాహ్మణ వ్రిత్తులు గాక సర్వ్వ సమస్య
ముగా నిచ్చె పెంజెఱ్ఱున మీంది కాల్వను కొ
ంతపుగాల్వ దక్షిణమూను ఆవాంక అడ్డా

ను చింతన మిట్టలూను రవ్వసాని అనకిం
దూను యింతవట్టు గూడను ర్ ౧౩॥
ప్రోలకంమ కాల్వను ర్ ౧చోలు బాడె కాల్వ
ను చుట్టు ర్ ౧ కాట్నాయుని చెఱ్వున బ్రాహ్మ
ణ వ్రిత్తులుగాక సర్వ్వమూంను రవ్వసాని
చెఱ్వూను రవ్వసాని మామిడితోంట పడమ
టి అనాను రాజెనాయంకుని చెఱ్వునర్ ౬
వెలిహొలము యేరువోక గుబ్బలి జగదేవ
త్రోవ దక్షిణమున ర్ ౨ందీని దక్షిణము
న పెద్ద రేగటిలోన ర్ ౪౦ బొమ్మకంటె తెర్పు ప
డుమట నుండి పూరివెన తీగవెన నద్మర్ ౬౦
యేటిమడ మామిడివనమూను ఆ వనములోని చింత వ
నమూను ఊరి దక్షిణమున తాటివనమూను
అంగడి సుంకమూను ఇంతవట్టు కాట్న్యాయు
ండు దేవడ్లకు అంగభోగ రంగభోగ ధూపదీపనైవేద్య
తాంబూలాలకు సూర్య్య చంద్రుల కలంతగాల
ము ఇచ్చిన ఈవి (॥*) కాదంన్న వారు గంగకఱ్తం గవి
లం బొడిచిన దోషానం బోదురు
కింది కాల్వనుర్ ౧౦1=ఇచ్చితిమి యింతవట్టు గణపతి
దేవమారాజు విడిచిన దత్తి

కాకతీయుల కాలము తెలుగుదేశమునకు రాజకీయముగను, భాషాభివృద్ధి యందును పేర్కొనదగినది ఇప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో కొలది భాగము తప్ప మిగిలిన దంతయు వారి యేలుబడి క్రింద నుండెను. తెలుగు భాష పుట్టిన పిదప తెలుగువారధిక సంఖ్యలో నొక రాజ్యమున కలిసియుండుట గణపతిదేవుని కాలములోనే జరిగెను. పైన జెప్పిన ఉప్పరపల్లి శాసనములోని భాషయు, కవిత్వము అప్పటివే. తిక్కనగారి ఆంధ్ర మహాభారతము, భాస్కరాదుల రామాయణములు ఆ కాలమున

వెలసిన ఉద్గ్రంథములు. అట్లే లిపి కూడ అప్పటికొక స్థిరరూపము దాల్చెను. కొద్దిమార్పులతో ఆయక్షరముల రూపునే మనము నేడు వ్రాయుచుంటిమి. తరువాత రెడ్డిరాజుల శాసనములు మననేటి తెలుగుక్షరములలోనే యుండును. కవి సార్వభౌముని శాసన పద్యములతో నీ విభాగమును ముగించెదము.

18. పిరంగిపురము శాసనములోని తెలుగు పద్యములు

(శక. 1331)

ఈ క్రిందిది గద్యవలె నుండును. శ్రీనాథుని సీసపద్యమని వెంటనే తట్టదు. కాని తరువాతి పద్యములు రెండు కవిసార్వభౌముని వనిపించును.

1.సీ. శాకాబ్దములు సహస్రమును మున్నూంట ము
ప్పది యొక్కండునునైన భవ్య సంఖ్య
వఱలు విరోధి సంవత్సరంబున ఫాల్గు
నంబున బహుళ పక్షంబు విదియ
శుక్రవారంబున శుభముహూర్తఁంబున
శ్రీ ధాన్యవాటి పురాధిపతియుం
గ్రిష్ణవెణ్ణా జలక్రీడా వినోదుండ్డు
నగు గన్న భూపాలు ననుంగుంబుత్రి

వీరనారాయణుండు వేమ విభునిదేవి
భూరిసద్గుణ నికురుంబ సూరమాంబ
సగము వినుతింప సంతానసాగరాఖ్య
వరతటాక ప్రతిష్ఠోత్సవం బొనచ్చెఁ

2.సీ. జాహ్నవీ యమునాది సకళ పావన నదీ
విమల తీర్థాఁంభః పవిత్రతంబు
స విధ దేశస్తా (స్థా)యి శివమౌళి బాలేందు
కౌముదీ సంపుల్ల కైరవంబు
బహు మహా పరివాహ పాథో భరధ్వాన
ఘుమ ఘుమాయిత దిశాగోళకంబు
జల సారణీసేక సంవర్ధిఁ తానేక
నన వినీతాధ్వగా ధ్వశ్రమంబు

బలవదురు మత్స్య కచ్ఛపఘుళి కుళీర
తిమి తిమింగిళ విక్రమ క్రమ విహార
తరళతర తుంగ భంగ కదంబచుంబి
తాభ్రవీథి సంతాన మహాపయోధి.

3\. సీ. కపట సూకరమైన కైటభాసుర వైరి
ఖురపుటంబులం బరిక్షుణ్ణమయ్యె
రఘు కులోద్వహ ధను ర్యంత్ర ముక్తములైన
చిచ్చుఱమ్ముల వేండిం జేవదఱ(ఱి) గెం
గుంభసంభవుని హస్తాంభోరుహంబున
నాపోసనంబయి[1] హ్రాసమొందెం
బాషాణముల నచ్ఛ భల్ల గోలాంగూల
కపియూథముల చేతం గట్టువడియె

వనధి యేభంగి సరివచ్చు ననంగవచ్చు
నారసాతల గంభీర వారి యగుచు
నపగతాపాయ మగుచు శోభాఢ్య మగుచు
ననుపమంబైన సంతాన వనధితోడ.
శ్లో॥ విద్యాధికారీ శ్రీనాథో వీరశ్రీ వేమభూపతేః॥
అకరో దాకరో వాచాం నిర్మళం ధర్మశాసనమ్.

1\. 3వ పద్యములో 'అపోసనంబయి' అనుభాగమును 'ఆపోశనంబయి' అని దిద్దవలెనని శ్రీజయంతి రామయ్య పంతులుగారు సూచించిరి. 'శ'కారమునకు 'స'కారము వాడుట శాసనములందు కలదు. 'వశము'నకు 'వసము' నిఘంటువులందున్నది. కాని 'దేశము' 'ఆపోశనము' అనునవి 'దేసము', 'ఆపోసనము' అను రూపములలో గానరావు.

19. చిడిపిరాళ్ళ శాసనము

(శక.1464)

(కమలాపురం తాలూక)

మచ్చునకొక విజయనగర కాలమునాటి శాసనముకూడ చూచెదము. ఇది చిడిపిరాళ్ళ గ్రామమునందు అగస్త్యేశ్వరస్వామి గుడిలోనున్నది. ఇందు వీరప్రతాప శ్రీ అచ్యుతదేవరాయ మహారాయలు రాజ్యము చేయుచుండగ శకము 1464కు సరియగు క్రీ.శ. 1542 సంవత్సరమున వారి సుంకాధికారమును నిర్వహించు కొందరు అగస్త్యేశ్వరునికి తిరువళిక (అఖండదీపము) కొఱకు దానము చేసిన విషయమిందు చెప్పబడెను. తాము చిడిపిజేల స్థలము నందున్న చెప్పలి గ్రామములో పొందు కొన్ని సుంకముల నిచట దానము చేసినట్లు చెప్పబడెను.

1. శుభమస్తు: శ్రీ అగస్వీశ్వరాయనమః స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వర్షంబులు ౧౪౬౪ అగునే
2. ంటి శుభకృతు సంవత్సర ఆషాఢ సు ౧౧లు శ్రీ మహారాజా ధి రాజ రాజ పరమేశ్వర శ్రీ వీర ప్రతాప శ్రీ అచ్యుత
3. దేవ మహారాయరు పృథివి రాజ్యంబు సేయుచుండంగాను శ్రీ అగస్తీశ్వరుని దివ్య శ్రీపాద పద్మంబుల్కు ఘండికోట సీమ
4. సుంకలుః కాస్యపగోత్ర యజు శాఖాధ్యాయులైన పర్వతరాజు కొమారుండు మల్లయాను... ....
5. ... ... కొమారుండు వోబులయ్యాను చితలూరి... ... కొమారుండు యల్లయాను జ3న్ను ఆనం
6. తములైన దండములు సమర్పించి ఇచ్చిన ధర్మః శాసనం స్వామి సంనిధిని అఖండ తి(రు)వళిక వుండెటి అందులకు కట్నం (॥*) ఘండికోట.
7. సీమలోన మా సుంక (రా) జ్యాన్కుచెల్లే (చడిపతేల)ను మా సుంఖాన్కు చెల్లే

(చె) బలిగ్రామ కట్నమున్, మగ్గస్తావరాలున్, కోమటి సిద్ధాయం, గాను
8. గసిద్ధాయం, (సింజ)ని సిద్ధాయం, ఇడిగిసిద్ధాయం, గొల్లసిద్ధాయం, వుప్పర
సిద్ధాయం, సహగాను తథాతిథి పుణ్యకాలమందు
9. జ3న్ను త్రివాచకంగాను త్రికరణ సుద్ధిగాను ధారవోసి
ఇస్తిమి యిందువల్ల వచ్చే ఆదాయంవల్ల స్వామి సంన్నిధిని తిరువళికవు
10. ండె అట్టుగాను జ3న్ను త్రివాచకంగాను త్రికరణసుద్ధిగాను
తథాతితి పుంణ్యకాలమందు ధారవోసి ఇస్తిమి.

... ...

ఇందు దానము చేయబడిన సుంకములు

చెప్పల్లి	1.	గ్రామకట్నము	(సామూహికముగ రాజునకు చెల్లించవలసినది)
	2.	మగ్గస్తావరాలు	(సాలెవారి మగ్గములపై విధించు పన్ను)
	3.	కోమటి సిద్ధాయము	(కోమటి వర్తకులపై విధించు పన్ను)
	4.	గానుక సిద్ధాయము	(తెలికవారి గానుగలపై విధించు పన్ను)
	5.	సింజిని సిద్ధాయము	(నారితాళ్ళు చేయు వారిపై పన్ను)
	6.	ఇడిగి సిద్ధాయము	(కల్లుగీత వారిపై విధించు పన్ను)
	7.	గొల్ల సిద్ధాయము	(గొల్లవారిపై విధించు పన్ను)
	8.	ఉప్పర సిద్ధాయము	(ఉప్పరివారిపై విధించు పన్ను)

గ్రామీణవృత్తులపై ఈ విధముగ పన్నులుండెడివని దీనివలన తెలియుచున్నది. ఇట్లే దొమ్మరి పన్ను, మంగలి పన్ను, విప్రవినోది పన్ను మొదలగు పన్నులు కూడ నుండెడివి.

౨౦. ముగింపు

దాదాపు క్రీస్తు 1300 వఱకు అనగా కాకతీయుల రాజ్యాంతమువఱకు గల తెలుగుదేశము యొక్క సాంఘిక చరిత్రను తెలుసుకొనుటకు గ్రంథాధారములేవియు లేని కారణమున శాసనములే ముఖ్యాధారములు. నన్నయ, తిక్కనల ఆంధ్ర మహాభారతమున్నను అది పురాణానువాద మగుటయేగాక గ్రాంథికమగుటచే నాటి జన సామాన్య జీవనమునంతగా ప్రతిబింబించుటలేదు. పండితారాధ్య చరిత్ర క్రీడాభిరామము మున్నగు కొలది రచనలు నాటి సాంఘిక జీవనమును కొంత తెలుపుచున్నవి. తెలుగువారి అప్పటి సాంఘిక విషయములనేకములు శాసనముల నుండియే కాని వేఱువిధముగ మనుక తెలియవు. విజయనగర రాజుల కాలమందున్న జీవన వ్యవస్థ, రాజకీయవ్యవస్థ. ఆర్థిక విధానము మత సంప్రదాయములు మున్నగునవి అనేక కైఫియతులలోను, గ్రంథములలోను, విదేశ యాత్రికుల కథనములందు లభ్యమగుచున్నవి. కాని కాకతీయ రాజ్యాంతమువఱకు గల రాజకీయ చరిత్రవలె సాంఘిక చరిత్రను తెలుసుకొనుటకు కూడా శాసనములే యాధారము. అందును తెలుగు శాసనములే తెలుగు ప్రజల గ్రామీణ జీవనమును వ్యక్తము చేయును. స్థాలీపులాకముగ కొన్ని యంశములనిట చెప్పుదును.

1. ప్రజలు : గ్రామీణ ప్రజలు జాతులననుసరించియేగాక వృత్తుల ననుసరించి కూడ సంఘములుగ వ్యవస్థీకరింపబడువారు. ఈ సంఘములకు సమయములు లేక శ్రేణులనెడి వ్యవహారముండెడిది. ఆయా సమయములు కొన్ని కట్టుబాట్లు, లేక కొన్ని సాంఘిక వ్యవస్థల ద్వారా తమ వృత్తుల నిర్వహించుకొనుటయేగాక జీవిత విధానమును కూడ సరిదిద్దుకొనెడువారు. వారు ఉత్పత్తి చేయు వస్తువుల క్రయ విక్రయములకు సంబంధించిన అంగళ్ళు, సుంకములు, లాభములు మున్నగునవి కూడా వారి సమయముల ద్వారా జరుగుచుండెడివని తెలియుచున్నది. రాజోద్యోగులు వారిపై విధించు పన్నులను సమయముల పెద్దల ద్వారానే వసూలు చేసెడివారు. దానధర్మములు సమయముల ద్వారానే ఆయా ప్రజల జీవిత విధానంలో సమయముల నిర్ణయమే ప్రబలమనిపించును. ఎక్కటి, పాంచాల, కుంభాలిక, తంతువాయ, వస్త్ర భేదక, తెలిక, దేవాంగ, గోరక్షక, పరికెల. కిరాత, రజక మున్నగు తెగలవారు వారి

వారి సమయముల నేర్పాటుచేసికొనువారు ఈ సంఘముల నిర్ణయములు వారి జీవన విధానమును చక్కజేయును. ఆ నిర్ణయముల నుల్లంఘించినవారు సమయము విధించు శిక్షలనుభవించవలెను. అట్టి శిక్షలు సమయదండనములనబడును. ప్రజా జీవనము అధికముగ స్థానిక వ్యవస్థల ద్వారా యంత్రితమగుచుండెడిది.

ఆనాటి ప్రజల మత సంప్రదాయములనుగూర్చి తెలిసికొనుటకు శాసనములు మిక్కిలి తోడ్పడును. తెలుగు శాసనములందట్టివనేకము గలవు. సామాన్య మనుజుల మత సామరస్యమును తెలుపు కాకతీయుల నాటి యీ శాసనము చూడదగును. ఇది బెక్కల్లు (జనగామ తాలూక) గ్రామములోని రుద్రేశ్వరాలయముననున్నది (క్రీ. 1176 నాటిది).

అమరగ శైవ వైష్ణవ నిజారుహ బౌద్ధములైన యిచ్చతు
స్సమయములంబ్రిథజ్మతము సంశయహేతువు దైవమెల్లనే
కమయని యైక్య భావమున గల్మష దూరుడు మల్లిరడ్డియ
త్యమిత గుణాఢ్యుడీ యతులితాయతనంబులు నిల్పె బ్రీతితోన్॥

అని మల్లిరెడ్డి యనునొక సామాన్య కుటుంబి తన కులమున జైనము ముఖ్యమతమై యున్నను శైవ, వైష్ణవ, అర్హ (జైన), బౌద్ధములనెడి నాలుగు మతములు కేవల సంశయ హేతువులే కాని దైవమన్నిటనేకమే యను విశ్వాసముతో తానీ శివాలయమును నిర్మించితినని జెప్పుకొనెను. ఇట్టి మత సమరస భావమే తెలుగునాట అనాది నుండి యున్నది కనుక మతోన్మాదములేవియు తలయెత్తలేదు.

కాకతి రుద్రుని మంత్రియగు వెల్లకి గంగాధరుడు తాను చేసిన అనేక ధర్మకార్యములలో శివాలయములు, ప్రసన్న కేశవాలయములు నిర్మించుట. అనుమకొండలో జైన వసతిని బాగుచేసి నూతనముగజేయుట, బౌద్ధాలయమును నిర్మించుట చేరియున్నట్లు శాసనములుగలవు.

కం. పరమేశుడు హరి బుద్ధ
స్వరూపుండై యసురవరుల వంచించుట నా
హరి యనియ పట్టశాలం
జిరముగ బుద్ధ ప్రతిష్ఠసేసితి భక్తిని॥

(కరీంనగర్ శాసనము)

ఇదే విధముగ ధరణికోట నేలిన కోటరాజులు కూడ సచటి బౌద్ధక్షేత్రమునకు దానములొసగినట్లు శాసనములుగలవు. వేల్పూరులో వారు నిర్మించిన శివాలయములు, అమరావతిలో చేసిన శివ ప్రతిష్ఠలు శాసనములు నిరూపించుచున్నవి.

సంస్కృత శాసనములందు బేర్కొనబడనట్టి సుంకములు అనేకము తెలుగు శాసనములలో కనిపించును. ఈ సుంకములు ఆనాటి ఆర్థిక విధానమును గూర్చి తెలుసుకొనుటకు తోడ్పడును. శకము 1339 నాటి గిద్దలూరు తాలూక సలకలవీడు గ్రామశాసనమొక దానిలో ఆ గ్రామమునకు చెందిన ఈ దిగువ నుదహరించిన ఆదాయములన్నింటిని కాకతి ప్రతాపరుద్రదేవుని యనుమతిన దేవరి నాయనింగారు శ్రీరంగనాథదేవునికి దానమొసగినట్లు చెప్పబడెను. పంగతప్పు, కఱి, కొల్చు, వంను, కానిక, పుల్లరి, సాదము, సుంకము, తలారి కానిక, సుంకెకానిక, పుల్లరి కానిక, దరిశవకానిక, పవిత్రకానిక, అని 13 విధములగు పన్నులు పేర్కొనబడినవి. వీటిలో నేయొక్కటి సరిగా మనకిపుడు తెలియదు. ఇవిగాక మరికొన్ని పన్నులు కూడ వేరే శాసనములందుగలవు. పుట్టు పేరు సుంకము, వడ్డరావుళ సుంకము, బీరణాలు, అరి, అప్పనము, మగ్గరి, వృత్తి సుంకములు, అంగడి సుంకములు అనేకము పేర్కొన బడుచుండును. వీటిలో కొన్ని రాజసుంకములు, మఱికొన్ని గ్రామసుంకములు. తరువాతి విజయనగర రాజులు గూడ ఈ సుంకములన్ని ప్రజల నుండి రాబెట్టెడువారు. వీటిలో ననేకము వస్తురూపములో నుండెడివి.

ప్రజాసామాన్యమునకు జెందిన జీవనవ్యవస్థ తెలుగులో వ్రాయబడిన శాసనములలోనే అధికముగ తెలియవచ్చును. కాని యీ శాసనములు ఆనాటి గ్రామ్యభాషలో నుండుట వలన నేదు మనకు సులభముగ అర్థము కావు. అప్పటి పన్నులు, కొలతలు, తూనికలు, నేలల సేద్యవిధానములు, వృత్తులు, పరిపాలన, యుద్ధములు చేయు విధము, మత సంప్రదాయములు మున్నగు విషయములు శాసనముల ద్వారా తెలియవచ్చును. అప్పటి గ్రాంథిక భాష గ్రంథములలో తెలియు చున్నను వ్యావహారిక భాషను తెలుసుకొనుటకు శాసనములే ఆధారము గనుక తెలుగు భాషా శాస్త్ర విజ్ఞానమునకు శాసనములు మిక్కిలి తోడ్పడును.

Blank Page

ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

* తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారుచేయడం.
* ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషా సంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
* తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించడానికి చర్యలు చేపట్టడం.
* తెలుగు పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
* తెలుగు వారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
* తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం.
* తెలుగు జాతి చరిత్రపై, భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారుచేయడం.
* తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
* తెలుగు నేలపై గల చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

తెలుగు భాష వికాసం **తెలుగు సంస్కృతి ప్రకాశం**

దేశ భాషలందు తెలుగు లెస్స